SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 12
MAY - 2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మే 2022 వెల రూ. 5/-

పుటలు-56



శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయమహోత్సవము, తిరుమల
(2022, మే 10 నుండి 12 వరకు)



## తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవం

### 2022, జూన్ 04 నుండి 13 వరకు

| తేదీలు | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|
| 04-06-22 | -- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 05-06-22 | తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 06-06-22 | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 07-06-22 | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 08-06-22 | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 09-06-22 | పల్లకిలో.. మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 10-06-22 | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 11-06-22 | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 12-06-22 | రథోత్సవం | అశ్వవాహనం |
| 13-06-22 | పల్లకీ ఉత్సవం, తీర్థవారి అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణోత్సవం |

## అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

### 2022, జూన్ 09 నుండి 18 వరకు

| తేదీలు | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|
| 09-06-22 | -- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 10-06-22 | తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 11-06-22 | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 12-06-22 | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 13-06-22 | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 14-06-22 | పల్లకిలో.. మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 15-06-22 | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 16-06-22 | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 17-06-22 | రథోత్సవం | అశ్వవాహనం |
| 18-06-22 | పల్లకీ ఉత్సవం, తీర్థవారి అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణోత్సవం ద్వాదశారాధనం, ఏకాంత సేవ |





## గీతాశ్లోకార్థసారం

**శ్లో : ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 35వ శ్లోకం)

ప్రతిపదార్థం: మధుసూదన = ఓ మధుసూదనా!; ఘ్నతః అపి=(నేను) చంపబడినను; త్రైలోక్యరాజ్యస్య= (లేక) మూడులోకముల రాజ్యాధిపత్యము; హేతోః, అపి=నిమిత్తమైనను; ఏతాన్ = వీరిని (ఈ స్వజనులను); హంతుం=చంపుటకు; న, ఇచ్ఛామి= ఇష్టపడను; మహీకృతే= భూమండలము కొరకైతే; కిమ్, ను=చెప్పవలసినదేమి?

భావం: ఓ మధుసూదనా! ముల్లోకాధిపత్యము కొరకైనను నేను ఎవ్వరినీ చంపను. ఇక ఈ భూమండల విషయమై చెప్పనేల? అట్లే వీరిలో ఎవ్వరైనను నన్ను చంపబూనిననూ నేను మాత్రము వారిని చంపనే చంపను.

## నల్లనిమేని నగవుఁ జూపులవాఁడు

నల్లనిమేని నగవుఁ జూపులవాఁడు
తెల్లనికన్నుల దేవుఁడు

బిరుసైన దనుజుల పీఁచమణఁచినట్టి
తిరుపుగైదువతోడి దేవుఁడు
చరిబడ్డ జగమెల్లఁ జక్కఁజాయకుఁ దెచ్చి
తెరువు చూపినట్టి దేవుఁడు

నీటఁ గలసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుఁడు
పాటి మాలినట్టి ప్రాణుల దురితపు-
తీఁట వాపినట్టి దేవుఁడు

గురుతు వెట్టఁగరాని గుణముల నెలకొన్న-
తిరువేంకటాద్రిపై దేవుఁడు
తిరముగ ధ్రువునికి దివ్యపదంబిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుఁడు

(సంపుటము - 05, సంకీర్తన - 244)





*ఇది అన్నమయ్య పదకవిత. వేంకటేశుని వర్ణనం. "స్వామి (నీలమేఘశ్యాముడు) నల్లని రూపంతో మెరిసిపోతున్నాడు. ఆ చూపులలోనే నవ్వులు తారాడుతున్నాయి. కన్నులు తేటగా, స్వచ్ఛముగా శుద్ధ సత్త్వసంపదను తెలియజేస్తూ ప్రకాశిస్తున్నాయి. ఇంకా ఎటువంటి స్వామి అంటే-*

*పేరొందిన రాక్షసుల పీచాన్ని(దర్పాన్ని)అణచినట్టి చక్రాయుధుడైన దేవుడు. గతి తప్పిన జగత్తును చక్కగా ఒక పద్ధతికి తెచ్చి దారి చూపే దేవుడు. అంటే స్వామి వారు ధర్మరక్షకుడు, అధర్మశిక్షకుడు అని అర్థం. నీట కలిసిపోయిన పూర్ణ విద్యలను అంటే వేదాలను వెలికి తీసి స్పష్టపరచిన దేవుడు.*

*'ధర్మము' తప్పిన ప్రాణుల పాపాలను వదిలించే దేవుడు. గుర్తించడానికి, లెక్కించడానికి అందని అనంత కల్యాణ గుణాలతో తిరువేంకటగిరిపై ప్రకాశించే దేవుడు. స్థిరంగా ధ్రువునికి దివ్యపదాన్నిచ్చిన 'సర్వోన్నతుడు' ఈ దేవుడు- "శ్రీవేంకటేశుడు" అని వర్ణించాడు ఈ కీర్తనలో.*

మన మహర్షులు

# విష్ణుభక్తి తత్పరుడు "మైత్రేయుడు"

– శ్రీ ఎం.వి. అవధాని

మైత్రేయుడు పరాశమహర్షికి శిష్యుడు. వ్యాసుని తండ్రి పరాశరుడు. స్మృతిని రచించిన పరాశరుని తపఃఫలంగా సాక్షాత్ శ్రీమన్నారాయణుడు వ్యాసునిగా అవతరించి, రాశిగా ఉన్న వేదాన్ని నాలుగువేదాలుగా క్రమబద్ధీకరిస్తూ పురాణాలను మనకు అందించాడు.


పరాశరుడు విష్ణుపురాణాన్ని మైత్రేయునికి ఉపదేశించాడు. మైత్రేయుని ద్వారా అది లోకాన వ్యాప్తి చెందింది. మైత్రేయుడు మాతృగర్భంనుండే సమస్తవేదాలు ఆకళింపు చేసుకున్నాడు. బాల్యంలోనే రాక్షస వినాశకర యజ్ఞాన్ని చేశాడు. పులస్త్యబ్రహ్మ ద్వారా దివ్యజ్ఞానాన్ని పొందిన ఘనుడు. పరాశరుని వాత్సల్యాన్ని చూఱగొని, ఆయనకు చాలాకాలం శుశ్రూష చేశాడు. ఆ శుశ్రూష ఫలంగా సర్వధర్మాలకూ, విజ్ఞానాలకూ, వేదవిషయాలకూ ఆలవాలమైన 'విష్ణుపురాణాన్ని' ఉపదేశంగా పొందాడు. ఈ పురాణాన్నే 'పరాశరసంహిత' అంటారు.

ఒకానొక సమయంలో మైత్రేయుడు సర్వతీర్థాలను సేవిస్తూ, కామ్యకవనంలో ఉన్న ధర్మరాజాది పాండవుల్ని కలుసుకొని వారిని ఆశీర్వదించి– ధృతరాష్ట్రునకు, కౌరవులకు బుద్ధి చెప్పాలని హస్తినకు బయలుదేరాడు.

ధర్మబుద్ధిగల పాండవులకు హాని తలపెడితే ప్రమాదకరమని కౌరవులను హెచ్చరించి, పాండవుల పరాక్రమాన్ని తెలియపరచి వారితో విరోధం తగదని బోధించాడు.

రోగికి మందు చేదుగా తోస్తుందన్నట్లు, దుర్యోధనుడు ఆ మాటలు అంగీకరించక, ఆ మహామునిపై అగౌరవాన్ని వ్యక్తీకరిస్తూ, నిర్లక్ష్యంగా కాలిబొటనవేలితో నేలమీద రాస్తూ, చేతులెత్తి అహంకారంతో ఊరువు(తొడ) చరచుకుంటూ నవ్వసాగాడు.

ఆ వైఖరిని చూసి మైత్రేయుడు కోపించి–"ఓరీ దుర్యోధనా! ఈ నిర్లక్ష్యానికి తగిన ఫలాన్ని అనుభవిస్తావు. భీముని గదాఘాతంతో నీ తొడలు భగ్నమవుతాయి" అని శపించాడు.



దాంతో తన కొడుకును క్షమించమని వేడుకున్నాడు ధృతరాష్ట్రుడు. 'అతడి దుష్కృత్యాలకు ఫలం అనుభవించక తప్పదనీ, శాపఫలం అవశ్యం అనుభవించవలసిందేనని' చెప్పగా, 'ఏదైనా జ్ఞానవిషయాలను తనకు తెలియజేయమని' ధృతరాష్ట్రుడు ప్రార్థించగా, 'నీకు కావలసినవి విదురుని అడిగి తెలుసుకో'– అని చెప్పి నిష్క్రమించాడు.

జ్ఞాననిధియైన విదురుడు యమునా నదిని దాటి వివిధ దివ్యక్షేత్రాలు దర్శిస్తూ, హిమాచలంలో గంగఒడ్డులో యోగ నిష్ఠలో ఉన్న మైత్రేయుని దర్శించాడు. విదురుని ప్రార్థన మేరకు విష్ణుభగవత్తత్త్వాన్ని ఎఱుక పరచాడు మైత్రేయుడు.

పరాశరుని శిష్యుడైన మైత్రేయుడు, పరాశరపుత్రుడైన వ్యాసుని ఆదరాన్ని కూడా పొందాడు. కాశీక్షేత్రంలో తపోదీక్షలో ఉన్న మైత్రేయుని వద్దకు వచ్చిన వ్యాసుని ఎంతో భక్తితో సత్కరించి, ధర్మవిజ్ఞానాన్ని ఉపదేశించమని ప్రార్థించాడు.

మహాత్ముల గొప్పదనమది! తాము సర్వజ్ఞులైనా, వారిలో అహంకారం ఉండదు. ఇతర మహాత్ములను దర్శించగానే విధేయులై వారి నుండి జ్ఞానసముపార్జనకు ప్రయత్నిస్తారు. గురువుల పట్ల చూపవలసిన మర్యాద అది. యోగవిద్యలో కూడా మైత్రేయుడు పరిపూర్ణత సాధించాడు. మానవజాతి ఇటువంటి మహర్షులను చూసి వారి మార్గంలో ప్రయాణించడానికి ప్రయత్నించాలి.




50 వసంతాల
1970-2020
SAPTHAGIRI
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 మే, 2022 సంచిక : 12


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| విష్ణుభక్తి తత్పరుడు "మైత్రేయుడు" | శ్రీ ఎం.వి.అవధాని | 04 |
| హనుమంతుని జన్మస్థలం తిరుమలలోని అంజనాద్రి పౌరాణిక ఆధారములు | ఆచార్య రాణి సదాశివ మూర్తి | 07 |
| పరేంగిత జ్ఞాన చతుర 'పారావతి' | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 11 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంతకుమార్ | 12 |
| అన్నమయ్య శృంగారకీర్తనల్లోనూ ఆధ్యాత్మిక పరిమళాలు | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 16 |
| మధురకవులు -ఆచార్యభక్తి | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 17 |
| భారతీయ జ్ఞానసంపద- వైదికవాఙ్మయం | ఆచార్య రేమిల్ల వేంకటరామకృష్ణశాస్త్రి | 19 |
| అనంత శక్తుల అంజనా తనయుడు | శ్రీ కప్పగంతు లక్ష్మీనారాయణ | 21 |
| సనాతన ధర్మోద్ధారకులు ఆదిశంకరులు | డా॥ కె.అన్నపూర్ణ | 23 |
| లక్ష్మీవిభూతి "నృసింహావిర్భూతి" | డా॥ సూరం శ్రీనివాసులు | 25 |
| శ్రీరామానుజ మార్గోపదేశం | శ్రీమతి ఈ.జయలక్ష్మి | 31 |
| తిరుమలక్షేత్రంలో 'హనుమద్వైభవం' | శ్రీ ఇటుగుళ్లపాటి హర్షవర్ధన్ రావు | 35 |
| తిరుమలేశుడి భక్తురాలు తరిగణమ్మ! | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 37 |
| పరశురాముడు | శ్రీ అప్పరుసు రమాకాంతరావు | 41 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 42 |
| భక్తసులభుడు | శ్రీ భీమవరపు శ్రీహరిరావు | 43 |
| తిరుక్కరంబనూర్ (ఉత్తమర్ కోయిల్) | ఆచార్య చక్రవర్తిరంగనాథన్ | 44 |
| వ్యర్థ పదార్థాలూ ఔషధాలే! | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| హనుమంతుని భక్తి (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| వట్టిమాటలు... కట్టిపెట్టాలి | శ్రీ జి.సీతారామశాస్త్రి | 53 |
| బాలవినోదం | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 54 |


ముఖచిత్రం : శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయమహోత్సవం, తిరుమల
వెనుక చిత్రం : హనుమజన్మస్థలం-ఆకాశగంగ, తిరుమల


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# మన సనాతన ఆధ్యాత్మిక దిగ్గజాలు

మహోన్నత హైందవ సంస్కృతి, సనాతన ధర్మమును పరిరక్షించుటలో మన ప్రాచీన ఆధ్యాత్మికవేత్తల పాత్ర ఎంతో ఘనమైంది మరియు ఆదర్శప్రాయమైంది. హైందవము కేవలము మతము మాత్రమే కాదు. ఇది ఒక గొప్ప జీవనవిధానము. హైందవ జీవన తత్త్వమును, సమస్త విలువల సారమును బాగా పరిశీలించి ఆచరించడంవల్ల మానవజీవితము పవిత్రతను పొంది సరియైన మార్గములో పయనిస్తుంది. హిందూమతమును అనుసరించడం అంటే సనాతన ధర్మమును అనుసరించడమే! హిందూమతమునందు **సత్యసంధత, కారుణ్యము, నిరాడంబరత, పరిశుభ్రత దాతృత్వము, ఆధ్యాత్మిక విద్య** అనే ఆరుసూత్రములు మూలస్తంభములై అలరారుతున్నాయి! ధైర్యము, స్వచ్ఛమైన మనస్సు, దానగుణము, త్యాగనిరతి, నిరాడంబరత మొదలైన దివ్యద్రష్టల ఆదర్శగుణాలను భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఉద్ఘాటించారు!

జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులు, శ్రీమద్రామానుజాచార్యులు, శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, శ్రీపురందరదాసు లాంటి మహితాత్ములు ఎంతోమంది మానవాళిని ప్రభావితం చేసి ప్రజల ఆధ్యాత్మిక జీవనానికి మార్గం చూపారు. **జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులు** అద్వైత సిద్ధాంతమును స్థాపించారు. అవైదికమైన పాషాండమార్గాలను బోధిస్తున్న కుహనా పండితులను తన మేధా సంపత్తితో వాదపటిమతో జయించి జ్ఞాన, భక్తి యోగాల ద్వారా మహోన్నత హైందవ జీవన వైభవాన్ని పునరుద్ధరించిన మహితాత్ములు. జీవించిన అతితక్కువ కాలంలోనే ఎన్నో స్తోత్రములు, ఆధ్యాత్మిక గ్రంథాలు రచించి లోకార్పితం చేసిన మహనీయులు. ఇక మానవాళి పై **శ్రీమద్రామానుజాచార్యుల** వారి దయామయత్వాన్ని ప్రశంసించ ఎవ్వరికి సాధ్యం కాదు. సర్వజనానికి మోక్షం కలిగిన, తానొక్కడు నరకానికి పోవడానికి సిద్ధమని చెప్పి గురువాజ్ఞను సైతం ఉల్లంఘించి ఏకంగా గుడిగోపురం అధిరోహించి పవిత్ర అష్టాక్షరిమంత్రమును ఎలుగెత్తి ఉచ్చరించిన కారుణ్యమూర్తి. ఈ కారణం వల్ల శ్రీమద్రామానుజులు సమతామూర్తిగా కీర్తిని గడించారు.

పవిత్ర తిరుమల దేవాలయం మొదలైన ఎన్నో దేవాలయాలలో పూజావిధానాలు, సేవాకైంకర్యాలను నెల కొల్పినారు. ఇవి నేటికినీ యథావిధిగా కొనసాగుతున్నాయి. తిరుమల శ్రీవారి దేవాలయ ప్రధానమండపంలో శ్రీమద్రా మానుజాచార్యుల దివ్యవిగ్రహమూర్తిని మనం చూడవచ్చు.

ఈ కోవకే చెందిన మరొక మహనీయులు పదకవితా పితామహుడు **శ్రీతాళ్లపాక అన్నమాచార్యులవారు.** ఈయన తన జీవితం మొత్తమును తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పై సంకీర్తనలను అంకితము చేసి జీవితసార్థక్యము నొందిన పావనచరితులు. తిరుమల శ్రీవారిపై 32 వేల సంకీర్తనలు రచించిన నిరుపమాన వాగ్గేయకారులు. నేటికీ తిరుమలలో అన్ని పర్వదినములందు అన్నమయ్య సంకీర్తనలు వేడుకగా గానం చేయబడుతున్నాయి. తన సంకీర్తనలలో అన్నమా చార్యులు సమతా భావాన్ని చాటినారు.ఇలాగే ప్రసిద్ధ కర్ణాటక సంగీతవిద్వాంసులు **పురందరదాసుగారు** తన విశిష్ట గానామృతంతో భక్తితత్త్వమును ప్రజలలో విస్తృత పరిచిన ఒక సంగీత ప్రభంజనం! మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ గారు తన అసమాన కవితా ప్రతిభతో "శ్రీవేంకటాచల మాహాత్మ్యం" అను గ్రంథరాజాన్ని రచించిన విదుషీమణి. జీవితాంతం శ్రీవారిసేవలోనే గడిపి తరించిన ఈ భక్తశిఖామణి సేవకు ప్రతీకగా **'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవన సముదాయం'** నేడు తిరుమలలో వేలకొద్దీ భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నది.


ఇలానే మహాకవి క్షేత్రయ్య, శ్రీసారంగపాణి, శ్రీబసవన్న, వాగ్గేయకారులు త్యాగయ్య, భక్తరామదాసువంటి మహ నీయులు ఎందరో తమ భక్తిగీతాల ద్వారా తమదైన శైలిలో సమాజసంస్కరణకు కృషి చేశారు. ఈ పవిత్రభక్తి మార్గ దార్శనికులు ప్రజలకు పావన జీవనమే మోక్ష సాధనా మార్గమని సూచించిన సత్యద్రష్టలు! వీరు వేదవిజ్ఞానికి నిలువెత్తు చిహ్నాలు. భావితరాల నైతికఆధ్యాత్మిక పురోన్నతి కోసం వీరి దివ్యస్మృతులు పదిలంగా ఉండాలన్న సత్సంకల్పంతో ఈ మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతోంది.

శ్రీహనుమజ్జయంతి, శ్రీశంకరజయంతి, శ్రీమద్రామానుజజయంతి, శ్రీఅన్నమయ్యజయంతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి లాంటి ఉత్సవాలు మానవ ఆధ్యాత్మిక జీవనవిధానం, సత్ప్రవర్తనల పై తమదైన ప్రభావం కలిగివున్నాయి. ఈ నిరుపమాన ఆధ్యాత్మికవేత్తలు మానవాళి మోక్ష సాధనమునకు దీపస్తంభాలుగా విరాజిల్లుతున్నారు. మహోన్నత జీవనవిధానాన్ని ఆధ్యాత్మ సంస్కార సాఫల్యమునందించుటకు ఈ మహా మహితాత్ముల జయంతి ఉత్సవాల నిర్వహణ ఎంతో ముఖ్యమని మనమందరం గుర్తుంచుకోవాలి.

*'ఓం నమో వేంకటేశాయ'*

# హనుమంతుని జన్మస్థలం తిరుమలలోని అంజనాద్రి పౌరాణిక ఆధారములు

- ఆచార్య రాణి సదాశివమూర్తి



యావద్భారతదేశంలో, భారతేతరదేశాలలో ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశముల వరకూ కూడా హనుమంతుని పట్ల భక్తివిశ్వాసాలు ఎన్నోవేల సంవత్సరాలుగా వేళ్ళూనుకుని ఉన్న విషయం. ఉత్తరభారతదేశంలో కనుక తీసుకున్నట్లయితే రామభక్తికి ఎంత ప్రాధాన్య మిస్తారో హనుమంతుని పట్ల భక్తిని చూపడంలోనూ అంతే శ్రద్ధ కలిగి ఉంటారు. దక్షిణభారత దేశంలో అంత భక్తిఉన్నా ఉత్తరభారతంలో శ్రీ తులసీదాసవిరచిత మైన 'రామచరితమానస్'కి ఉన్న ఖ్యాతి శ్రీవాల్మీకి రామాయణానికి ఉన్నంతగా ఉంది అంటే అతిశయోక్తి కాదు. అందునా 'శ్రీహనుమాన్‌చాలీసా' పఠించనివారు చాలా అరుదుగా కనబడుతారు. ఇంత ప్రసిద్ధమైన హనుమంతుని జన్మస్థల విషయంలో మాత్రం భక్తులు అంత ఎక్కువగా దృష్టి పెట్టినవారు తక్కువ. ఆయా స్థానిక జనశ్రుతులను బట్టి అంటే స్థానికుల నమ్మకములను బట్టి భారతావనిలో అయిదారు ప్రదేశాలలో హనుమంతుని జన్మ చోటు చేసుకున్నది అని చెప్పబడుచున్నది. గుజరాత్‌లో నవ్‌సారిజిల్లా లోని డాంగ్ ప్రాంతమని అక్కడి స్థానికులు, జార్ఖండ్‌లో గుమ్లాలో అక్కడి వారు, హర్యానా రాష్ట్రంలోని కైథాల్ (కపిస్థల్)లో అని కొందరు, నాసిక్ వద్ద అంజనేరిలో అని కొందరు, కర్ణాటకలో హంపి దగ్గర కిష్కింధలో అని ఆ ప్రాంతము వారు ఇలా ఎవరికి తోచిన విధంగా వారు వారి స్థానిక కథనాలకు ప్రాధాన్యం ఇచ్చి కథలను ప్రచారం లోకి తెచ్చారు. పర్యాటకులు ఆ ప్రదేశాలను చూడటానికి వెళ్ళినప్పుడు నమ్మి తమ తమ ఊళ్ళకు వెళ్ళగానే మర్చిపోతు న్నారు. ఈ అయిదింటికి జనశ్రుతులు తప్ప వేరే ఏ ఆధారములు లభించడం లేదు.

అయితే వీటన్నింటి కన్నా భిన్నంగా తిరుమల లోని అంజనాద్రి గురించి, అంజనాద్రియే హనుమంతుని జన్మ స్థలమనడానికి పురాణాలలో, శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో, భక్తిసాహిత్యంలో, సంకీర్తనాచార్యుల కీర్తనలలో, ఆగమములలో ప్రస్తావనలు ఎన్నో లభిస్తున్నాయి.

ఈ ప్రస్తావనలను అన్నింటినీ మూడువిధాలుగా విభజించవచ్చు. 1)శ్రీశేషా చలపర్వతశ్రేణిగా పిలువబడే తిరుమలగిరులలో ఒకటి అంజనాద్రి అని చెప్పేవి కొన్ని, 2)అంజనాదేవి ఇక్కడ పుత్రప్రాప్తి కోసం తపస్సు చేసిందని చెప్పేవి కొన్ని, 3)హనుమంతుని జన్మస్థలమిదే అని చెప్పేవి కొన్ని.

ఈ ఆధారాలను పరిశీలించే ప్రయత్నంలో అంజనాద్రి విషయంలో పురాణాధారాలు ఎలా లభిస్తున్నాయో గమనించాలి. 18 మహాపురాణములలో ఉత్తరభారత మరియు దాక్షిణాత్యప్రతులలో పలుచోట్ల అంజనాద్రి ప్రస్తావన కనబడు తున్నది నిర్ద్వంద్వంగా 'స్కందపురాణంలో'. ఇక 12 పురాణములలోని శ్రీవేంకటా చలక్షేత్ర మాహాత్మ్యాన్ని ఒక్కచోటకు తెచ్చి శ్రీవేంకటాచలక్షేత్రమాహాత్మ్యము అనే

పేరుతో ముద్రించారు. ముద్రణపద్ధతి రావడానికి పూర్వం నుంచి ఈ గ్రంథానికి శ్రీమద్రామానుజాచార్యుల వారికాలం నుంచి గౌరవం ఉన్నది అన్న విషయం శ్రీవేంకటాచలేతిహాస మాల వంటి గ్రంథాలు చెబుతున్నాయి. గ్రంథముద్రణ ప్రచారం లోకి వచ్చాక తొలిసారిగా శ్రీవేంకటాచలక్షేత్రమాహాత్మ్యము 1929వ సంవత్సరంలో కలకత్తాలోని శ్రీస్వామి మహంత్ శ్రీప్రయాగదాస్‌వర్యులద్వారా పండిత శ్రీకేసరీకాంత్‌శర్మ, పండిత శ్రీలక్ష్మీధర పాఠక్ వర్యుల సంపాదకత్వంలో ముద్రింపబడింది. ఇందులోని స్కందపురాణభాగం, స్వతంత్ర స్కందపురాణంలో కన బడే శ్రీవేంకటాచలక్షేత్రమాహాత్మ్యము ఒకే విధంగా ఉండటంవల్ల మిగిలిన పదకొండు పురాణాల భాగములూ ప్రమాణములే అని పండితులందరూ అంగీకరించే విషయం.

ఈ క్రమంలో దొరుకుతున్న ఆధారాలను పరిశీలిస్తే- శ్రీవేదాంతదేశికులు, శ్రీవేంకటాధ్వరిన్‌వంటి కవిపుంగవుల గ్రంథములలోనూ, అన్నమయ్య, పురందరదాసు, తరిగొండ వెంగమాంబవంటివారి భక్తి కీర్తనల్లో, ఆగమములలో శ్రీవేంకటే శ్వరస్వామివారి సహస్రనామావళిలో, శ్రీవేంకటేశ్వరగద్యంలో, ఇతర స్తోత్రాలలో అంజనాద్రి పేరు తరచూ వినబడుతుంది.

> అంజనాద్రిర్వృషాద్రిశ్చ శేషాద్రిర్గరుడాచలః,
> తీర్థాద్రిః శ్రీనివాసాద్రిశ్చింతామణిగిరిస్తథా,
> వృషభాద్రిర్వరాహాద్రిర్ జ్ఞానాద్రిః కనకాచలః
> ఆనందాద్రిశ్చ నీలాద్రిః సుమేరుశిఖరాచలః,
> వైకుంఠాద్రిః పుష్కరాద్రిరితి నామాని వింశతిః

అన్న బ్రహ్మపురాణంలోని శ్లోకాలలో **శ్రీశేషాచలం లేక శ్రీవేంకటాద్రికి గల ప్రసిద్ధములైన పేర్లలో మొట్టమొదటి పేరు అంజనాద్రియే.** ఇక్కడ ఈ సందర్భములో కొందరు విజ్ఞులు 'ఇతి నామాని వింశతి..' అని 20 పేర్లు అంటూనే శ్లోకాలలో 16 మాత్రమే చెప్పారు, కనుక ఈ శ్లోకములు సంశయించ వలసినవి' అంటున్నారు. అయితే ప్రస్తుతకాలపు ఆధునికుల కోసం ఈ మధ్యకాలంలో వ్రాసిన శ్లోకములు కావివి. పరం పరలో వస్తున్న శ్లోకములు. ఈ గ్రంథము ముద్రణకు వెలుగు చూసే నాటికే వేలసంవత్సరాల కాలంలో ఈ కనబడని నాలుగు పేర్లు లుప్తం అయిపోయి ఉండవచ్చు. అంత మాత్రాన మిగిలిన 16 పేర్లు అప్రమాణీకములు కాజాలవు. అలాగే పద్మపురాణం నుంచి రెండు సందర్భాలు ఉదాహరింపబడుతున్నాయి.

శ్రీవేంకటాచలాన్ని సందర్శించుకున్నవారిలో ముందుగా చెప్పవలసిన మహర్షి శ్రీశుకులవారు. ఆయన తిరుశుకనూరు (నేటి తిరుచానూరు)లో పద్మావతీ అమ్మవారిని సేవించుకుని అక్కడి నుండి రమ్యాతిరమ్యమైన శ్రీవేంకటాచలదివ్య క్షేత్రాన్ని చూశారు అని చెప్పిన సందర్భంలో దానిని అంజనగిరి, అంజనా చలం అని ప్రస్తావించారు. ఇది గమనించదగిన విషయం. అలాగే నారాయణాద్రిగా వర్ణించే సందర్భంలోకూడా ఈ పర్వతాన్ని అంజనగిరి అని చెబుతూ ఈ అంజనగిరి తటంలో స్వామిపుష్కరిణి ఉందని అక్కడ స్నానమాచరించిన వారికి కలిగే ఫలాన్ని వివరించారు.

## పద్మపురాణంలో

> తస్య సానుమతః సోఽపి పదానాశ్రిత్య సత్వరః.
> నిరారేష్వాప్లవం కుర్వన్ విమలోదేష్వనన్యధీః, .........
> అతంద్రితోంజనగిరిం ప్రాప్య విప్రోపవేశనమ్। 1

చక్కనిసానువులు కల ఆ అంజనాద్రిని చేరిన ఆ ముని అక్కడ ఉన్న పవిత్రజలాలతో కూడిన సెలయేళ్లలో స్నానంచేసి సోమరితనం లేనివాడై ఆ పర్వతపాదాలలో సంచరించాడట.

## శుకపురినుంచి శుకుడు శేషశైలానికి రావటం

> తత్ర త్రిషవణస్నానం కృత్వా వ్యాసోరసో మునిః
> ..................
> ఉషిత్వా త్రిదినం తత్రోపాసకః పరాయణః
> ద్రష్టుకామోఽఖిలాశ్చర్యం పునరప్యంజనాచలే। 2

వ్యాసపుత్రుడైన ఆ ముని అక్కడ త్రిషవణ స్నానం చేసి మూడు రోజులు ఉండి ఉపాసనాపరుడై కాలం గడిపాడు. ఆ అంజనాచలంలో ఉన్న ఆశ్చర్యాలను చూడదలిచాడు.

## నారాయణాద్రి వర్ణనంలో

> ప్రాచీనే తస్య దేశస్య స్థితోంజనగిరేస్తటే,
> తరుణాదిత్య సంకాశాఽఖిలాభీష్టదా। 1

ప్రాచీనమైన ఆ ప్రదేశంలో అంజనగిరి తటంలో ఉదయసూర్యుని కాంతులతో సమానమైనదై స్వామిపుష్కరిణి అభీష్టప్రదాయని అవుతున్నది.

> కుంజేంజనగిరేః స్వామిపుష్కరిణ్యప్సు యో నరః,
> కృతాప్లవః సకృత్ సత్యం కృతకృత్యో భవేన్నరః। 2

అటువంటి అంజనగిరిలో స్వామి పుష్కరిణిలో ఎవరు స్నానం చేస్తారో వారు తమ కార్యాల్లో సాఫల్యాన్ని పొందుతారు.

తదుపరి పురాణములలో పరిశీలించినట్లైతే స్కంద పురాణంలోని వైష్ణవఖండంలో 39, 40 అధ్యాయములు రెండింటిలో అతి విస్తృతంగా హనుమంతుని జన్మవృత్తాంతం వర్ణింపబడింది. అది స్కందపురాణం యొక్క ఉత్తరభారత, దక్షిణ భారత ప్రతులన్నింటిలోనూ ఉన్నది. అక్కడ చెప్పబడిన విధంగా హనుమంతుని జన్మ ఈ వేంకటాద్రిలోనే ఆకాశగంగ వద్ద సంభ వించింది. మతంగమహర్షి సూచనపై ఈ ప్రదేశంలో అంజనా దేవి తపస్సు చేయడంవల్ల హనుమంతుడు ఇక్కడ జన్మించాడు కనుక బ్రహ్మవరం వల్ల ఈ పర్వతానికి అంజనాద్రి అనే పేరు ప్రసిద్ధిలోనికి వచ్చింది అని ఈ పురాణం చెబుతున్నది.



ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది. ఈ స్కందపురాణాన్ని అనుసరించి అంజనాదేవి తండ్రి రాక్షసుడు. మహా బలపరాక్రమశాలి. అతని పేరు కేసరి. ఆమె భర్త ఒక కపి వీరుడు. అతని పేరు కూడా కేసరి. ఈ విషయాన్ని ఈ క్రింది శ్లోకాలలో చూడవచ్చు.

**మతంగ! మునిశార్దూల! వచనం మే శృణుష్వ హ,**
**పితా మే కేసరీ నామ రాక్షసః శివతత్పరః.**
**(స్కందపురాణం - శ్రీవైష్ణవఖండం 39-4 నుంచి 6)**

ఓ మునిశ్రేష్ఠ! మతంగమహర్షీ! నా తండ్రి కేసరి అనే రాక్షసుడు. ఆయన పరమశివభక్తుడు.

**..............................................**
**తతః కాలాంతరే విప్రః కేసర్యాఖ్యో మహాకపిః,**
**యయాచేమాం దదస్వేతి పితరం మే తతః పితా.**
**తస్మై మాం దత్తవాంశ్చైవ పారిబర్హం దదౌ చ సః,**
**గవాం లక్షసహస్రాణి గజలక్షం మహామనాః॥**
**(స్కందపురాణం- శ్రీవైష్ణవఖండం 39-10, 11 శ్లోకాలు)**

తర్వాత కేసరి అనే పేరుగల ఒక వానరవీరుడు నన్ను భార్యగా తనకిమ్మని మానాన్నను కోరాడు. పెద్దమనస్సుకల మానాన్న ఆ కపివరునికి నన్నిచ్చి వివాహం చేసి కానుకగా కోట్ల సంఖ్యలో ఆవులను, ఒక లక్షఏనుగులను అర్బుద (పది కోట్ల) సంఖ్యలో గుఱ్ఱాలను, రథాలను, అనేకాలైన వస్త్రాలను, రత్నాలను వేల సంఖ్యలో దాసదాసీజనాలను నృత్యగీతాల్లో ఆరితేరిన అంతఃపురస్త్రీలను, వేయివస్త్రాలను ఇచ్చాడు.

ఇక్కడ చెప్పిన ప్రకారం అంజనాదేవి తండ్రి పేరు కేసరి. రాక్షసుడు. ఆమె భర్త పేరు కూడా కేసరియే. అయితే అతడు కపివీరుడు. ఇదే విషయం శ్రీవేంకటాచల మాహాత్మ్యంలోని బ్రహ్మాండ పురాణభాగంలో కూడా ఉంది.

**త్రేతాయుగేఽసురః కశ్చిత్ కేసరీత్యేవ విశ్రుతః**
**(బ్రహ్మాండపురాణే తీర్థఖండే భృగునారద సంవాదే 54 శ్లోకం)**

త్రేతాయుగంలో కేసరి అనే అసురుడు చాలా ప్రసిద్ధి చెందినవాడు ఉండేవాడు.

**తతః కపివరః కశ్చిత్ కేసరీతి భువి విశ్రుతః**
**అభిగమ్య యయాచే తాం కన్యాం యౌవనశాలినీమ్.**
**(బ్రహ్మాండపురాణే తీర్థఖండే భృగునారదసంవాదే 68 శ్లోకం)**

రాక్షసుడగు కేసరికి శివుని వరమువల్ల పుట్టిన కుమార్తె అంజన యుక్తవయస్కురాలు అవగానే కేసరి అనే పేరు గల ఒక కపి శ్రేష్ఠుడు ఆమెను తనకిచ్చి వివాహము జరిపించ వలసిందిగా ఆమె తండ్రిని అడిగాడు. ఆమె తండ్రి అంగీ కారముతో వారిరువురి వివాహం జరిగింది. ఇలా ఈ రెండు పురాణాలలో (స్కందం సాక్షాత్తుగా పురాణమే.) బ్రహ్మాండపురాణ భాగం శ్రీవేంకటాచలమహాత్మ్యంలో ఉన్నదానిలో ఈ వృత్తాంతం చాలా విస్తారంగా ఉన్నది. అలాగే ఈ రెండుగ్రంథాలలో కూడా హనుమంతుడు పుట్టిన అంజనాద్రి తిరుమలగిరులైన వేంకటాద్రి యే అని చెప్పబడింది. అలాగే బ్రహ్మాండపురాణే తీర్థఖండే భృగు నారద సంవాదే 5వ అధ్యాయంలో -

**అంజనే త్వం హి శేషాద్రౌ తపస్తప్త్వా సుదారుణమ్,**
**పుత్రం సూతవతీ యస్మాల్లోకత్రయహితాయ వై.**
**ప్రసిద్ధిం యాతు శైలోఽయమంజనే! నామతస్తవ,**
**అంజనాచల ఇత్యేవ నాత్ర కార్యా విచారణా.**

"ఓ అంజనా! నీవు ఈ శేషాద్రి పై గొప్ప తపస్సు చేసి ఈ పుత్రుని లోకశ్రేయస్సు కోసం కన్నావు. కనుక ఈ వేంకటగిరి లేక శేషాద్రి ఇక మీదట నీ పేరుపైన అంజనాద్రి అను పేర ప్రసిద్ధిని పొందగలదు." అని చెప్పి బ్రహ్మాది దేవతలు తమ తమ లోకాలకు వెళ్ళిపోయారు. తరువాత అంజన ఆనందంతో తన కుమారునితో శ్రీవేంకటగిరిలోని తన ఆశ్రమానికి చేరుకుంది.

శ్రీవేంకటాచలమాహాత్మ్యంలోని వరాహపురాణభాగంలో (36వ అధ్యాయంలో 28, 29 శ్లోకాలు) కూడా కలియుగం లోని వేంకటాద్రియే త్రేతాయుగంలో అంజనాద్రి అన్న విషయాన్ని చెప్పారు.

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయామ్ అంజనాచలం,**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీవేంకటాచలమ్**
**అంజనా చ తపః కృత్వా హనూమంతమజీజనత్,**
**తదా దేవాస్సమాగత్య దేవసాహాయ్య కారకమ్.**
**యస్మాత్ పుత్రమసూతాఽసౌ జగుః తస్మాత్ ఇమం గిరిమ్ అంజనాద్రిమ్**

అని పేర్కొన్నారు. అంటే అంజన పుత్రుణ్ణి పొందిన పర్వతము కనుక ఇది అంజనాద్రి అయ్యింది.



ఇలాంటి ఉదాహరణలు వివిధ ప్రాచీన ఇతిహాస, పురాణగ్రంథాలలో ఎక్కడా మరే ఇతర ప్రాంతానికి హనుమజ్జన్మ భూమిగా సమర్థించే విధంగా కనబడవు.

కనుక పై ప్రమాణములను బట్టి హనుమంతుని జన్మ క్షేత్రం వేంకటాద్రిలో ఆకాశగంగా ప్రాంతమందలి అంజనాద్రి సీమయే అని నిర్ధారించవచ్చును.



అలాగే శ్రీవేంకటాచల మాహాత్మ్యములోని బ్రహ్మాండ పురాణభాగంలో ఆంజనేయస్వామి పుట్టుకయే కాక, బాల్యమున కూడ అక్కడే నివశించి అక్కడ, గిరి, తీర్థ, వనాదులను సేవించ టమే కాక అక్కడ భక్తి, జ్ఞాన ప్రదమగు విష్ణుతీర్థమను ఒక తీర్థమును కూడా తాను నిర్మించినట్లు తెలుస్తున్నది.

అలాగే ఈ అంజనాద్రిలో ఉన్న మరి 108 పుణ్య దాయకములగు తీర్థములలో శ్రీఆంజనేయతీర్థము అను తీర్థము కూడా ఉండటం గమనించదగిన విశేషము.

ఓం నమో వేంకటేశాయ

గృహలక్ష్మి


# పరేంగిత జ్ఞాన చతుర 'పారావతి'

– ఆచార్య కోలవెన్ను మలయవాసిని

కాశీపట్టణంలోని ప్రసిద్ధ దేవాలయాలలో త్రివిష్టపేశ్వర దేవాలయం ఒకటి. ఆ దేవాలయశిఖరంలో ఆలుమగలైన పావురాల జంట ఆనందంగా జీవిస్తోంది. ఆ పావురాలు రెండూ ప్రతిరోజు గుడిమండపం చుట్టూ తిరుగుతూ, గర్భగుడిలో పానవట్టం నుండి ప్రవహించి వచ్చే తీర్థజలాలు తాగుతూ, బలిహరణంగా ధ్వజస్తంభం దగ్గర పెట్టిన అన్నం తింటూ, గుడిలో వాయించే వాయిద్యాలు శ్రద్ధగా వింటూ సుఖంగా జీవిస్తున్నాయి.

గుడిగోపురంలో క్షేమంగా ఉన్న ఈ పావురాలజంటను ఒకనాడు ఒకడేగ చూసింది. వాటిని పట్టుకోవాలనుకుంది. కాని అవి కాపురమున్న గూడు చిన్నదిగా కట్టుదిట్టంగా కోటలా ఉండడంతో ఏమి చేయలేకపోయింది. డేగ పావురంకంటే ఆకారంలో పెద్దది. పైగా పావురాలను వేటాడి చంపి తినేస్తుంది కూడా. పరేంగిత జ్ఞానచతుర అయిన పారావతి– ఇతరుల మనస్సులో ఏముందో పసి గట్టడంలో నేర్పరి అయిన ఆ పారావతి తన భర్తతో ఇలా చెప్పింది.

"ఓ నాథా! మనకు డేగ గర్భశత్రువని నీకు తెలుసు కదా! ఇక్కడ గుడి గోపురంలో పటిష్టమైన కోటలో ఉన్నాం కనుక ఈరోజు ఆ డేగ మనని పట్టుకోలేక వెను తిరిగిపోయింది. పట్టు ఒడుపు తప్పి ఉందేమో మనమీద పగబట్టి ఉంది. మనం జాగ్రత్తగా వెంటనే వేఱే ప్రదేశానికి మారిపోవడం మంచిది. వాడు విజృంభిస్తే మనం తట్టుకో గలమా! ఇక్కడనుండి వెంటనే మకాం మార్చేద్దాం. ప్రాణాలు కాపాడుకుందాం" అని చక్కని హితబోధ చేసింది ఆ ఇల్లాలు.



భార్య మాటలు వినగానే మగపావురానికి ఎక్కడ లేని కోపం వచ్చింది. మంచి యౌవ్వనంలో ఉండడంతో భార్యతో "ఏమంటున్నావూ. నాకేం బలపరాక్రమాలు లేవనుకుంటు న్నావా? అది పక్షే గదా, దెయ్యం కాదు కదా. దాన్ని చూసి ఇల్లు వదలిపెట్టి మరో చోటికి వెళ్ళి దాక్కుంటే సాటి వాళ్ళు నవ్వరా! ఏమీ భయపడవలసిన పని లేదు. ఇక్కడే ఉందాం."

*అది విహంగమమేను విహంగమంబ.... చంచూ పుటీ కోటి కుట్టినముల* (కాశీఖండము–ఆ–6, 6–296) "ఓసి బేలా! అదీ పక్షే, నేనూ పక్షినే. పెసరగింజకి మరో పెసరగింజ తక్కువా? నా ముక్కుపుటాల కొనతో దాన్ని పొడిచి పొడిచి పొగరణగిస్తాను' అని గొప్పగా పలికాడు. ఆ ఇల్లాలు మరి మాట్లాడకుండా 'ధర్మోజయతి' అనుకుని ఊరుకుంది. మఱునాడు పొద్దుటే జంట పావురాలు సంచారనిమిత్తం గూట్లోంచి బయటకు రావడం తడవు ఆ ద్వారం దగ్గటే కాచుకుని ఉన్న డేగ ఉక్కుముక్కలాంటి తన ముక్కుతో ఆడుపావురాన్ని, అంకుశాల్లాంటి గోళ్ళు గల కాళ్ళతో మగపావురాన్ని ఒడిసి పట్టుకుని ఎగిరిపోసాగింది.

డేగకు భయపడాలా? అని ఎన్నో బీరాలు పలికిన మగపావురం ఏమీ చేయలేనిస్థితిలో పడిపోయింది. ఆ సమయంలో 'వివేకనిధి' అయిన ఆడుపావురం భర్తను చూచి – డేగ కాలు గట్టిగా కొరుకు అని కంటితో చూపింది. ఈసారి భార్యమాట అక్షరాలా పాటించింది ఆ మగ పావురం.

*శ్యేనము కాలివ్రేలు గఱచెన్ ...... రయంబున... బక్షి దంపతుల్* (కాశీ ఖండము–ఆ–6, ప–298)

భార్య కనుసైగ అందుకొని గుండె చిక్కబట్టి మగపావురం డేగకాలు గట్టిగా కఱచాడు.

ఆ తీవ్రమైన బాధ తట్టుకో లేక డేగ– అబ్బా! అని అరవడం, కాలువిదిలించుకోవడం ఒకేసారి చేసింది. ఆ సందులో ఆ పక్షిదంపతులు ఎగిరి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇక కాశీ వాసం వద్దు అని అయోధ్యలో కాపురం పెట్టాయి.

ఆ ఇల్లాలు భర్తకు ముందు హితవు చెప్పింది. విన లేదు. తీరా ప్రాణాలకు ముప్పు వచ్చింది. కర్తవ్యతా మూఢు డైన భర్తకు చక్కని ఉపాయం చెప్పి అపాయం నుండి బయట పడవేసింది.

ఈ గృహలక్ష్మిని శ్రీనాథమహాకవి – 'పరేంగిత జ్ఞాన చతుర' అనీ, 'వివేకనిధి' అని సంభావించి గౌరవించాడు.

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

## 15వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్



### పురుషోత్తమప్రాప్తియోగం అధ్యాయనామౌచిత్యం

పురుషుల్లో ఉత్తముడు పురుషోత్తముడు. అనగా పరమాత్మ. ఆ పరమాత్మప్రాప్తిని పొందటానికి అవసరమైన యోగాన్ని చెప్పే అధ్యాయం కనుక దీనికి పురుషోత్తమప్రాప్తి యోగమనే పేరు కల్గింది.

క్షరాక్షర పురుషులకంటే వేరైన ఈశ్వరుడే, ఉత్తమ పురుషుడు. అట్టి ఈశ్వరుడు పురుషోత్తముడైన శ్రీకృష్ణుడే. పరమాత్మను గూర్చినటువంటి విచారణతో ధ్యానయోగులు ఆ పురుషోత్తముణ్ణి తెలుసుకోగలుగుతున్నారనీ తక్కిన వాళ్ళు అజ్ఞానంతో చూడలేక పోతున్నారని భగవంతు డన్న ఈ శ్లోకమే అందుకు ఉదాహరణ –

యతన్తో యోగిన శ్చైనం పశ్యన్త్యాత్మ న్యవస్థితమ్ ।
యతన్తోఽప్య కృతాత్మానో నైనం పశ్యన్త్య చేతసః ॥ 11

ఈ అధ్యాయంలో వైశ్వానరోపాసన చెప్పబడి ఉంది. అనుష్ఠానపరులు ఈ అధ్యాయాన్ని పఠించిన తరువాత భుజించే అలవాటు కూడా ఏర్పడి ఉంది. పురుషోత్తముని స్వరూప మేమిటి? అత డెట్టివాడు? ఆయనను పొందటానికి మార్గమేమి? పొందితే కలిగే ఫలిత మేమిటి? మున్నగు విషయాలు తెలియ జేసిన అధ్యాయ మవడం వల్ల దీనికి పురుషోత్తమప్రాప్తి యోగమనే పేరు అన్వర్థదాయకం. ఈ అధ్యాయంలో చెప్పి నట్లాచరిస్తే పరమపద ప్రాప్తి కలుగుతుందనేది ఫలశ్రుతి.

-------

### భగవంతు డంటున్నాడు :

ఊర్ధ్వమూల మధశ్శాఖం అశ్వత్థం ప్రాహురవ్యయమ్।
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥

వాసుదేవుడు తన ప్రబోధాన్ని కొనసాగిస్తూ, అర్జునా! ఈ సంసారం ఒక రావిచెట్టు. సాధారణంగా లోకంలో వృక్షానికి వేర్లు క్రింది భాగంలోను, కొమ్మలు పైన ఉంటాయి. కానీ ఈ సంసారవృక్షం కొమ్మలు అన్ని చెట్ల మోస్తరుగా ఉండక, కొమ్మలు క్రిందికి వేర్లు పైకి ఉంటాయి. వేదాలే ఈ చెట్టుకు ఆకులు. ఆకుల వల్లనే వృక్షానికి ఆహారం సమకూరి వృద్ధి చెందినట్లుగా వేదాల్లో చెప్పబడిన కామ్యకర్మల వలన ఈ సంసార వృక్షం వృద్ధి చెందుతుంది. విషయ సుఖాలే ఈ వృక్షం యొక్క లేత చిగుళ్ళు, బ్రహ్మదీనికి మూలం. ఇంద్రాదులే శాఖలు. దేవతలనే శాఖలు పైకి, మానవులనే శాఖలు క్రిందికి వ్యాపించి ఉన్నాయి. మానవలోకంలో చేయబడుతున్న కర్మలే దీనికి కారణం. ఈ సంసారవృక్షానికే జగద్వృక్షమని కూడా మరో పేరుంది. ఇది మోక్షమార్గానికి అడ్డంగా ఉంది. దీన్ని ఛేదిస్తేనే మోక్షాన్ని పొందగలరు. "అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా" వైరాగ్య మనే బలమైన ఆయుధమే అందుకు సమర్థమైంది. ఈ వృక్షం యొక్క నిజస్వరూపం ఎవరికీ అందదు. దీన్ని చక్కగా గ్రహించి కోర్కెలను జయించాలి. అంతేగాకుండా–

నిర్మానమోహా జితసంగదోషా అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।
ద్వన్ద్వైర్విముక్తా స్సుఖదుఃఖ సంజ్ఞైః గచ్ఛన్త్యమూఢాః పదమవ్యయం తత్ ॥ 5

అభిమానం, మోహం లేనివారుగా, నిస్సంగులై వ్యవ హరించేవారుగా ఉండాలి. నిరంతరం ఆత్మచింతన చేస్తుండాలి. కోర్కెలను తొలగించుకుంటుండాలి. సుఖదుఃఖాలనుంచి విడివడి నటువంటి జ్ఞానులు పునరావృత్తి రహితమైన శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందుతారు.

సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఇవి ఏవీ ఆ పరమపదాన్ని (పరమాత్మను) ప్రకాశింపచేయజాలవు. అది స్వయంప్రకాశకం. ఆ స్థానాన్ని పొందినవారు తిరిగి ఈ ప్రపంచంలోకి రారు. అంటే తిరిగి జన్మింపరు, అటువంటి పరమపదమే నా స్థానం. జీవుడు భగవంతుని యొక్క అంశభూతుడు. జీవుడు నూత్న శరీరాన్ని పొందునపుడుగానీ, దానిని విడిచిపోవునపుడు గానీ వాయువు వాసనలను మోసుకుపోయినట్లే ఇంద్రియాలతో పాటుగా మనస్సునూ తీసుకుపోతాడు. జ్ఞానదృష్టి కలవారు దీన్ని తెలుసుకుంటున్నారు.

పరమాత్మ రసస్వరూపంతో చంద్రుడై ఓషధుల్ని వృద్ధి చేస్తున్నాడు. ఆ పరమాత్మే జఠరాగ్ని రూపంలో శరీరాన్ని ఆశ్రయించి ప్రాణాపానాది వాయువులతో కూడి నాల్గు విధాల ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాడు.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14**



నాల్గు విధాలు ఆహారాలు అంటే –

**1)భక్ష్యం** – నమిలి తినవలసిన ఘనపదార్థాలు కూరలు, రొట్టెలు మొ॥వి.

**2)భోజ్యం** – జుర్రుకొని త్రాగేటువంటి పాయసాదులు మొ॥వి.

**3)లేహ్యం** – చప్పరించి తినవలసినవి పచ్చడులు, తేనె మొ॥వి.

**4)చోష్యం** – రసాన్ని పీల్చవలసినవి అంటే త్రాగేవి పాలు, మజ్జిగ మొ॥వి.

కనుక మితాహారాన్నే భుజించాలి. అదిగూడ నేను తింటున్నాను అనే భావనతో కాకుండా లోనున్న పరమాత్మకు అర్పణచేసి తిన్నట్లయితే యజ్ఞకర్మగానే భావింపబడుతుంది.

**సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తస్స్మృతిర్ జ్ఞానమపోహనం చ।**
**వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్॥ 15**

అర్జునా ! పరమాత్మ స్వరూపుడనైన నేను అన్ని జీవుల హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను. నా వల్లనే జ్ఞాపకశక్తి, జ్ఞానం, ఊహ, మతిమరపు కలుగుతున్నాయి. వేదాలచే తెలియ బడేవాడిని నేనే, వేదాంత కర్తనూ నేనే.

అర్జునా! ఈ లోకంలో క్షరుడు, అక్షరుడు అని ఇద్దరు పురుషులున్నారు. దేహాభిమాని క్షరుడు. వీరు సంసారులగు పురుషులు. చిత్తాభిమాని అక్షరుడు. వీరు మోక్షం పొందిన పురుషులు. వీరిరువురి కంటే వేరైన ఉత్తమపురుషుడను నేనే. కనుకనే నన్ను పురుషోత్తము డంటారు. ముల్లోకాలలో ప్రవేశించే నియామకుడ నగుట చేత నన్ను పరమాత్మ అని కూడా చెప్పుకుంటారు.


**యో మామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వ విద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19**

పాపరహితుడవగు ఓ అర్జునా! ఎవడు అజ్ఞానం లేని వాడై నన్ను పురుషోత్తముడని తెలుసుకుంటాడో వాడే సర్వజ్ఞుడు. అట్టి వాడే నన్ను అనన్యభక్తితో ఆరాధించే శ్రేష్ఠుడు. ఈ ప్రకారంగా అతిరహస్యమైన ఈ శాస్త్రాన్ని నీకు తెలిపాను. దీన్ని తెలుసుకొని నీవు కృతకృత్యుడవు కమ్ము.

**శ్రీకృష్ణార్పణమస్తు.**

# అన్నమయ్య శృంగారకీర్తనల్లోనూ ఆధ్యాత్మిక పరిమళాలు

– డా॥ అద్దంకి శ్రీనివాస్




అన్నమయ్య రచించిన సంకీర్తన వాఙ్మయం ఒక విజ్ఞాన సర్వస్వం. సమాజాన్ని అద్దంలో చూపించే అద్భుతమైన సామాజిక చిత్రం. అందులో జానపదాలు, హావభావవిన్యాసాలు కావ్యధర్మాలకు ప్రతీకలుగా అద్భుతంగా ఒదిగిపోతాయి. అధ్యాత్మిక సంకీర్తలనుగానీ శృంగారసంకీర్తనలనుగానీ అసంఖ్యాకంగా రాసినా ఎక్కడా భాష విషయంలోగానీ, భావం విషయంలోగానీ పునరుక్తిదోషం అంటని రచనావైలక్షణ్యం అన్నమయ్యది. ఇది ఒక్క అన్నమయ్యకే సాధ్యం అయ్యిందంటే అతిశయోక్తి కాదు.

ఆళ్వారులలో అంగిస్థానాన్ని పొందిన నమ్మాళ్వారుల నాయికాభక్తి అన్నమయ్యలో ఎంతో విస్తృతంగా పరిఢవిల్లి కావ్యవస్తువయ్యింది. ఎన్నెన్ని రీతులలో భగవంతుడిపట్ల భక్తుడు ఆర్తితో వ్యవహరించవచ్చో నాయికాభక్తిలో అన్నమయ్య తెలియజేశాడు. నిజానికి ఇవి శృంగార సంకీర్తనలుగా కనిపిస్తున్నా లోపల ఆధ్యాత్మిక రహస్యం దాగి ఉంటుంది. మచ్చుకు ఈ కీర్తన చూడండి.

దగ్గరితె మొగచాటు దువ్వులు నుంటేఁ జవి
నిగ్గుల యీరెండూను నీవొళ్లనే కంటినే (9-1)

**భావం:** నాయిక మరో నాయికతో అంటోంది. చెలీ, నువ్వు స్వామి దగ్గరైతేనేమో ముఖం చాటువేస్తున్నావు.. దూరంగా ఉంటే నేమో తపించిపోతున్నావు.. ఈ రెండూ నీ దగ్గరే చూస్తున్నానే.. ఇక చరణాల్లో భావాన్ని చూసినట్లయితే –

చెలీ, ఇంతవరకూ పతి కనిపించలేదంటూ తెగ బాధ పడిపోయావే.. అలా బాధపడుతూ ఉండి ఇప్పుడు ఆతడే వచ్చి నిన్ను పిలుస్తుంటే మాత్రం బిగిసిపోతావు... కలివిడిగా తానే లోపలికి వచ్చి స్వామి గక్కున నీ చెయ్యిపట్టుకుంటే ముసిముసినవ్వులు రువ్వుతూ పరవశంగా మూలుగుతావు..



స్వామి వచ్చేంతవరకూ అప్పటిదాకా స్వామిని కలవాలన్న కోరికతో ఎడమాటలు మాట్లాడుతూ అంటే అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతూ (విరహంతో ఉన్నవారి మాటలు అలాగే ఉంటాయి) తీరా నాయకుడు నిన్ను చూస్తే ఇట్టే తలవంచేస్తావు. అతిశయించిమరీ వచ్చి విభుడు దూరంగా నీ పక్కన కూర్చుంటే చెప్పలేనంత సిగ్గు ముంచుకు వచ్చేస్తుంది నీకు. దానితో పెనగులాడతావు.

ఇంతకీ మనసులో నువ్వు కోరిన శ్రీవేంకటేశ్వరుడు ఆర్తితో నిన్ను కూడితే చాలు ఇట్టే అలసిపోతావు. ఆ కూడికలో అధరామృతాన్ని

అందించిన ఆ స్వామిని భక్తితో కొలవడానికి కూడా నువ్వు చాలవు. ఎందుకంటే ఇంకా నువ్వు ఆ భ్రమలోనే ఉండిపోతావు. ఇందులోని విశేషం ఏమిటంటే ఇక్కడ శృంగారాన్ని పక్కన పెడితే స్వామి మనకోసం ఎన్ని చేసినా భక్తులు తమ మనస్సులో స్వామిని నిలుపుకోలేకపోతున్నారు. మాయలో పడిపోతున్నారు అన్న భావం అంతర్లీనంగా స్ఫురిస్తుంది. ఈ సంకీర్తనలో నాయిక ముగ్ధ. ఆ ముగ్ధత్వాన్ని జీవుడికి ఆపాదించుకుంటే ఇందులోని ఆధ్యాత్మికత అర్థమవు తుంది. ఇది కూడా ఒక అధ్యాత్మకీర్తనే. మరో కీర్తనలో–

**ఎవ్వరి నే మన లేవు యింతేసికి నోపము**
**పువ్వునఁ బుట్టినయట్టి పూఁపవంటివాఁడవు**

అంటూ స్వామిలోని సౌలభ్యగుణాన్ని శృంగారపరంగా వివరిస్తోంది నాయిక. అలా ఉండవద్దని స్వామికి విన్నవించు కొంటోంది. తనను విడిచిపెట్టవద్దని బ్రతిమిలాడుతోంది.

**అలిగేదె సహజము ఆఁడువారికి**
**మలసి నీవె తిద్దుక మన్నించవయ్యా**

స్వామితో నాయిక తనలోని లోపాల్ని ఎత్తి చూపుతూనే వాటివల్ల తమ ప్రణయానికి ఏ మాత్రం లోటు లేదని చెప్తున్న కమనీయమైన భావాలు కల సంకీర్తన ఇది.

స్వామీ! శ్రీవేంకటేశా! ఆడవాళ్ళు అలగడం సహజం. ఆ విషయం నీకు తెలియదా! కాబట్టి నువ్వే సర్దుకోవాలి. తిరిగిదిద్దుకొని నన్ను మన్నించవయ్యా స్వామీ! ఇది శ్రీకృష్ణావ తారంలోస్వామి ప్రదర్శించిన గుణం. తనను ద్వేషించిన వారిని కూడా స్వామి ఉద్ధరించాడు కదా.

**కానీవయ్య దానికేమి కాంత యవివేకి గాదు**
**సానఁబట్టి చూచీని సరిత లన్నియును**

మరో సంకీర్తనలో ఒక నాయిక గురించి మరో నాయిక స్వామికి విన్నవిస్తోంది.

స్వామీ! సరేలే కానీవయ్య! దానికేముందిగానీ! కాంత మరీ అంత వివేకం లేనిదేమీ కాదులే!నీ చరిత్రంతా సానబట్టి మరీ చూస్తుంది ఏమనుకున్నావో!

**మానుసులకుఁ దరమా మరి యివి నీకె కాక**
**ఆనుకొని సేసే వీ దయ్యపు చేఁతలు**

ఈ కీర్తనలో నాయిక – స్వామిని కృష్ణావతార స్వరూపుడిగా ప్రస్తుతిస్తోంది. ఆ అవతారంలో స్వామి చేసిన చేష్టలన్నింటినీ ప్రస్తావిస్తూ అలాంటి అతిమానుష లీలలు నీకే తగినవంటూ శ్రీకృష్ణలీలలను భంగ్యంతరంగా చెప్తోంది.


స్వామీ! పూనుకొని మరీ కావాలని ఈ దైవచేష్టలు చేస్తున్నావు కానీ మనుషులెవరికైనా ఇవి సాధ్యం అయ్యే పను లేనా? ఇవి నీకే తగును కానీ! పరిపూర్ణమైన గొల్లవాడిగా యాదవుడిగా జన్మించడం, గోవర్ధనపర్వతాన్ని ఎత్తడం, పెద్ద రాక్షసి అయిన పూతనను చంపడం, అడవుల్లోనికి వెళ్ళి గోప బాలకులతో బువ్వపు బంతులు ఆడడం ఇవన్నీ నీకే అమరి పోతాయిలే! ఇక్కడ శ్రీకృష్ణవతారాన్ని నిండైన గొల్లతనం అని చెప్పడంలో పరిపూర్ణావతారం ధ్వనిస్తోంది.

భూమిపై అవతరించిన అవతారస్వరూపుడివి. కాళిందీ మడుగులో నాట్యం చెయ్యడం, పంతం పట్టి మరీ బ్రహ్మతో సయ్యాటలు ఆడడం, ఇవన్నీ నీ ఆటలు. అవి నీకే చెల్లునయ్యా!

నువ్వో పెద్ద రాచబిడ్డవు కదా! అందుకే ఏ మాత్రమూ సంకోచం లేకుండా చుట్టాలతో పోరాడడం నీకే అబ్బిందిలే! శ్రీవేంకటేశ! ఇక్కడపదహారువేలమందిని ప్రేమగా ఏలుకున్నావు. నన్ను కూడా కలిశావు. మొత్తానికి నా ప్రార్థన నిలబడిందిలే. అంటే నా వేడికోలును మన్నించావని శ్రీకృష్ణుడితో వేంకటేశ్వర స్వామికి అభేదం చూపుతున్నాడు అన్నమయ్య.

పరమాత్మ ఒక్కడే పురుషుడు. తక్కిన జగత్తంగా స్త్రీరూపమే అని వైష్ణవ సంప్రదాయం చెబుతోంది. అందువల్ల ఇక్కడ నాయిక అంటే జీవతత్త్వానికి ప్రతీక. స్వామిపై విముఖంగా ఉండడం, కోపంతో ఉండడం, కామక్రోధాదుల్ని కలిగి ఉండడం జీవుడి లక్షణాలు. అలాంటి జీవతత్త్వాన్ని శృంగార కీర్తనలలో చెప్పడమే అన్నమయ్య ప్రత్యేకత. ఇలా ఆలోచిస్తే అన్నమయ్య ప్రతి శృంగారసంకీర్తనలోనూ **'ఆధ్యాత్మిక పరిమళాలు'** గుబాళిస్తాయి.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం....)*

అప్పుడు చక్రవర్తి విశ్వాసము గలవాడై తిరుమల అడివారమునకు వచ్చి హతశేష మగు సేనలతోడ చింతాక్రాంతుడై యుండగ, అప్పుడు శ్రీవేంకటేశ్వరస్వామి అనంత గరుడ విష్వక్సేనాదులగు తమ యసాధారణ పరిషజ్జనులతోడ –

"గరుత్మన్నిహ సర్వే వై వసామ గిరిమూర్ధని
త్వం గిరే ర్ధక్షిణాం సానుమాసాద్య వస నిత్యశః,
శేషాఽఽగచ్ఛ వన త్వం చ తార్క్ష్యాధ్యశ్శైలరూపధృత్."

(గరుత్మంతుడా! మన మందరము ఈ కొండకొనపై వసింతము. నీవు కొండకుడిచరియ చేరి నిత్యవాసము చేయుము. ఆదిశేషా! రమ్ము నీవును గరుత్మంతుని క్రింద పర్వతరూపధారివై యుండుము.) అని వామనపురాణమున చుతర్థాధ్యాయమునందు చెప్పిన తీరును గరుడ విష్వక్సేనాధిష్ఠితమగు శేషపర్వత శిఖరమునకు పడమటగా ఒకశిఖరమున అర్చారూపమున ఆవిర్భవించి చక్రవర్తికి దర్శన మొసగి –

"మా భైషీః పుత్ర భద్రం తే చక్రశంఖౌ దదామి తే,
తాభ్యాం గచ్ఛ పురీం దివ్యాం తౌ తే శత్రూన్ హనిష్యతః.
ఇత్యుక్త్వా తౌ దదౌ తస్మై తాభ్యాం సహ జగామ సః,
తౌ చ శత్రూ న్నిహత్యాఽఽశు కృత్వా రాజ్యమకంటకమ్."

('వత్సా! భయపడకుము. నీకు కుశలమగుగాక! నీకు చక్రశంఖముల నిత్తును. వానితోడ దివ్యమగు పట్టణమునకు పొమ్ము. అవియే శత్రువును సంహరింపగలవు' అని పలికి ఆ యాయుధములను చక్రవర్తి కొసగెను. అతడు వానితోడ వెడలిపోయెను. ఆ శంఖచక్రములు వెంటనే పగతురను దునుమాడి రాజ్యమును నిష్కంటకముగా జేసి....)

అని బ్రహ్మపురాణమున నున్న రీతిగనే 'శ్రీసుదర్శన పాంచజన్యము'లను ప్రసాదింప పిమ్మట ఆ దివ్యాయుధములు రెండును చక్రవర్తి సన్నిధానమున పురుషాకారముతోడ సాక్షాత్కరించి 'రణమునకు బయలుదేరుము' అని చెప్పెను. చక్రవర్తియు పిమ్మట వేంకటాచలపతి మాటలను విశ్వసించి వానిని వెంటగొని బయలువెడలి శత్రువుల జయించి మరల శ్రీనివాసుని సన్నిధిని జేరి దర్శనము చేసికొనగ ఆఖండ భూమండలాధిపతి యగు శ్రీవేంకటాచలాధీశ్వరుని పాదపద్మములపైని భక్తిచే పరిపూర్ణ మనోరథుడై పెద్దకాలము సకలవిధభోగములనను భవించి, పిమ్మట శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రుడైనాడు' అని బ్రాహ్మపురాణమున ఈ కథ యుండుటవలననాడు శేషగిరిశిఖరమున చక్రవర్తికి పరిషత్తు తోడ సాక్షాత్కారమైన స్వామియే ఇప్పుడును పరిషద్వేంకటేశ్వరుడను పేర ఎల్లవారికి దర్శనము నొసంగుచున్నాడు. ఇట్లు శేషాద్రిశిఖరమున ఆవిర్భవించిన పరిషద్వేంకటేశ్వరస్వామికి, శ్రీభగవద్రామానుజులవారు ప్రతి దినమునను అపక్వములైన వడపప్పు, పానకము, పండ్లు, కొబ్బెర మున్నగువానిని నివేదనము చేయులాగున నియమము నేర్పరచిరి.

*(ఇంకా ఉంది)*



నారాయణుడు మాయతో మనుష్య జన్మనొందిన పుణ్యమూర్తి శ్రీకృష్ణుడు

# మధురకవులు- ఆచార్యభక్తి

- డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు

పరమాత్మను పొందడానికి భక్తి తగిన సాధనమని వేదాంతశాస్త్రం ఉపదేశిస్తున్నది. భగవంతుని విషయంలో ఒకడు అనన్యమైన భక్తిని కలవాడై ఆరాధించినట్లయితే అతడు ఆ స్వామి కరుణకు పాత్రుడై, ముక్తిని పొందుతున్నాడు అనేది వేదాంత శాస్త్రం సామాన్యంగా తెలిపిన మోక్షోపాయం.

అయితే, ఈ ఉపాయం సిద్ధించాలంటే, ఉపాసకుడు పరమాత్మను ఉపాసించినంత మాత్రంతో చాలదు. ఆ పరమాత్మ కూడా ఉపాసకుని విషయంలో ఆనుకూల్యాన్ని కలిగి ఉండాలి. అప్పుడే ఆ ఉపాసన ఫలిస్తుంది. జీవుడు భగవంతుని ఉపాయంగా ఆశ్రయించడం ఒక విషయమయితే, ఆ జీవుని తరింపజేయాలన్న భగవంతుని సంకల్పం కూడా మరొక ముఖ్యవిషయం. ఈ విషయాన్ని శాస్త్రం "సిద్ధిర్భవతి వా నేతి సంశయోచ్యుతసేవినామ్" 'అచ్యుతుని సేవించేవారికి సిద్ధి కలుగుతుందా? లేదా? అనే సందేహం ఉంది' అని తెలిపి, వెంటనే దానికి పరిష్కారాన్నికూడా తెలిపింది. "న సంశయోస్తి తద్భక్తపరిచర్యారతాత్మనామ్"(ఆ అచ్యుతుని భక్తులను సేవించడంలో ఆసక్తి కలిగినవారికి మాత్రం సిద్ధికలగడంలో ఏ సందేహం లేదు)అని అంటూ భగవద్భక్తులను సేవిస్తే ఫలం తప్పక సిద్ధిస్తుంది, సందేహం లేదని తెలియజేసింది. అందుకే భగవద్భక్తి కంటే భాగవతభక్తి ఉత్తమమైన ఉపాయం అని చెప్పబడింది.



భగవంతుని చేరడానికి భగవద్భక్తులు సదాచార్యుని ఆశ్రయిస్తే భగవత్ప్రాప్తి ఇంకా ఇంకా సులభం కదా. అందువల్ల సదాచార్యుని ఆశ్రయించి, దానివల్ల భాగవతుల అభిమానాన్ని సంపాదించి, తద్వారా భగవంతుని ప్రీతిని పొందినట్లయితే, కోరుకున్న ఉత్తమపురుషార్థం తప్పక లభిస్తుంది కదా. ఈ విధంగా సదాచార్యుని అభిమానంలో ఒదిగి ఉండడానికి శ్రీవైష్ణవ సంప్రదాయంలో చరమపర్వనిష్ఠ అని పేరు.

భక్తి అనేది ప్రీతి పూర్వకంగా ఉపాసించడం కనుక, అది సహజంగా మధురంగా ఉంటుంది. అందువల్ల భక్తిని తీయని చెరకుగడతో పోలిస్తే, అందులోని మొదటి కణుపు భగవద్భక్తి అనీ, రెండవ కణుపు భాగవతభక్తి అనీ, మూడవ కణుపు ఆచార్యభక్తి అని చెప్పవచ్చు. అంటే భగవద్భక్తి కంటే భాగవతభక్తి, దానికంటే ఆచార్యభక్తి మధురమైనవి.

ఈ ఉపాయం వేదచోదితమైనది. శ్వేతాశ్వతరోపనిషత్ చివరలో ***"యస్య దేవే పరాభక్తిః యథాదేవే తథా గురౌ, తస్యైతే కథితా హ్యర్థా ప్రకాశం తే మహాత్మనః"*** (ఎవనికి భగవంతునిలోవలె ఆచార్యుని విషయంలో గొప్పభక్తి ఉంటుందో, అతనికి అన్ని విషయాలు స్ఫురిస్తాయి, అతడు మహాత్ముడు) అని తెలిపింది.

ద్రావిడవేదంగా కీర్తింపబడే నాలాయిర దివ్యప్రబంధాన్ని లోకానికి అందించిన

మహనీయులు ఆళ్వారులు. వీరిలో మధురకవి ఆళ్వారు ఒకరు. ఆళ్వారులు అందరూ భగవద్భక్తితో పాటు ఆచార్య భక్తిని కూడా ప్రబోధించినా, మధురకవి ఆళ్వారు మాత్రం ఆచార్య భక్తిని ఉత్తమోపాయంగా ఉపదేశించారు.

అందువల్ల వీరు చరమపర్వనిష్ఠులుగా, ఆచార్య భక్తికి మారురూపంగా భావింపబడుతున్నారు. పదిపాశురాలను కల "కణ్ణినుణ్ శిఱుత్తాంబు" అనే వీరి ప్రబంధం పూర్తిగా ఆచార్య భక్తిని ప్రబోధిస్తున్నది.

ఈ ఆళ్వారులు నమ్మాళ్వారులకు సమకాలీనులు. చైత్రమాసంలో చిత్తానక్షత్రంలో తమిళనాడులోని తిరుక్కోళూరు అనే క్షేత్రంలో అవతరించారు. దివ్యక్షేత్రసందర్శనం కోసం వీరు ఉత్తరభారతాన్ని పర్యటిస్తూ ఉండగా, ఒకనాటి రాత్రి వీరికి దక్షిణ దిక్కుగా ఆకాశంలో ఒక దివ్యమైన తేజస్సు కనిపించింది. ఆ తేజస్సునుగూర్చి అన్వేషిస్తూ చివరికి మధురకవులు నమ్మాళ్వార్ అవతరించిన ఆళ్వార్ తిరునగరి చేరగా, ఆ జ్యోతి అంతర్ధానం అయినది. ఆ ఊరి బయట చింతచెట్టు దగ్గర యోగ సమాధిలో ఉండే నమ్మాళ్వారులను దర్శించి, ఆ తేజస్సుకు కారణం ఆ మహాపురుషులే అని గుర్తించారు. వారిని ఏ విధంగానైనా ప్రశ్నించాలని మధురకవులు చాలా సేపు వేచి చూసినా, ఆళ్వారులు కళ్ళు తెరవలేదు.

**2022, జూన్ నెల**
**ఉత్సవాలు, పర్వదినాలు**

| | |
|---|---|
| 05 - 13 | తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం |
| 10 - 18 | అప్పలాయగుంట, శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవం |
| 10 - 14 | తిరుచానూరు, శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం |
| 12 - 14 | తిరుమల శ్రీవారిజ్యేష్ఠాభిషేకం |
| 14 | ఏరువాకపూర్ణిమ |

అప్పుడు మధురకవులు పెద్ద రాతిని ఎత్తి నేలపై వేయగా, ఆ శబ్దానికి నమ్మాళ్వారులు కళ్ళు తెరచిచూచారు. మధురకవులు "శెత్తత్తిన్ వయిత్తిల్ శిఱియదు పిఱందాల్ ఎత్తై త్తిన్ఱు ఎంగే కిడక్కుమ్?" (ఈ ప్రకృతిలో పుట్టిన జీవుడు దేనిని అనుభవిస్తూ, దేనిలో ఉంటాడు?) అని నమ్మాళ్వారులను ప్రశ్నించగా, "అత్తై త్తిన్ఱు అంగే కిడక్కుమ్" (ఆ ప్రకృతినే అనుభవిస్తూ, అందులోనే ఉంటాడు) అని వారు బదులిచ్చారు. ఈ సమాధానం వినగానే అళ్వారులు మహాజ్ఞాని అని మధుర కవులు గుర్తించారు.

తరువాత మధురకవులు నమ్మాళ్వార్లను ఆశ్రయించి, వారికి శిష్యులై సేవించారు. వారు అనుగ్రహించిన ప్రబంధాలను, వానిలోని తత్త్వాలను గ్రహించారు. ఆళ్వారులు పరమపదాన్ని చేరిన తరువాత, వారి ప్రబంధాలను లోకంలో ప్రచారం చేశారు. అంతేకాక, నమ్మాళ్వారులను పరదైవంగా కీర్తిస్తూ పది పాశురాలను కల "కణ్ణినుణ్ శిఱుత్తాంబు" అనే ప్రబంధాన్ని రచించారు. "మాయన్ ఎన్నప్పనిల్ నణ్ణి తెన్ కురుకూర్ నంబి ఎన్టక్కాల్ అణ్ణిక్కుమ్ అముదూఱుమ్ ఎన్నావుక్కు" (నాథుడైన శ్రీకృష్ణుని నామాన్ని పలికినప్పుడు కలిగే తీయదనంకంటే, కురుకాపురిలో వేంచేసి ఉండే నమ్మాళ్వారుల నామాన్ని పలికినప్పుడు కలిగే మాధుర్యం గొప్పది) అని అన్నారు. ఈ విధంగా చాలా మధురమైన ఆచార్య భక్తిని కీర్తిస్తూ అద్వితీయమైన ప్రబంధాన్ని రచించిన వీరికి మధుర కవులు అనే పేరు సార్థకమైనది.

శ్రీవైష్ణవసంప్రదాయంలో ఈ ప్రబంధం అష్టాక్షరీ మహామంత్రం మధ్యలో ఉండే నమశ్శబ్దంలోని అర్థాన్ని ప్రతిపాదిస్తున్నదని భావింపబడుతున్నది. అష్టాక్షరీలోని నమశ్శబ్దం జీవుని స్వరూపంలో, మోక్షోపాయంలో, మోక్షఫలంలో ఎదురయ్యే విరోధులను లేకుండా చేస్తుంది. ఆ విధంగానే, ఈ ప్రబంధం కూడా అమోఘమైన, తప్పక ఫలించే ఉపాయం అయిన ఆచార్య భక్తిని ఉపదేశించడం ద్వారా ఆ మూడు విరోధులను తొలగిస్తున్నది. అందువల్ల మధురకవి ఆళ్వారులు ఆచార్య భక్తికి మారురూపమని, ఈ ప్రబంధం "నమశ్శబ్దానికి" ప్రతీక అని ప్రసిద్ధి కలిగింది.


ఎంత విన్నా తనివి తీరనిది హరికథాశ్రవణం




# భారతీయ జ్ఞానసంపద - వైదిక వాఙ్మయం

-ఆచార్య రేమిల్ల వేంకటరామకృష్ణశాస్త్రి

ప్రపంచవాఙ్మయచరిత్రలో అతిప్రాచీనమైంది **'వైదికవాఙ్మయం'**. వేదములకు సంబంధించినదంతా వైదికమే. వేదాలు అపౌరుషేయాలు. అంటే పురుషునిచే వ్రాయబడినవి కావని అర్థం. వేదమంత్రాలను మహర్షులు తమ దివ్యనేత్రాలతో దర్శించి మానవాళికి అందించారు. అందుకేవారిని **'మంత్రద్రష్టలు'** అంటారు.

భారతదేశం కర్మభూమి. వేదవిహితధర్మమే ఆచరింపదగినకర్మ. అదియే యజ్ఞం. యజ్ఞం ద్వారానే మానవులు దేవతలను ఆరాధించాలని, వానివల్ల సంతోషించిన దేవతలు వర్షాలద్వారా అనుగ్రహిస్తారని భగవద్గీతకూడా చెపుతోంది. భారతీయవైదికజీవన విధానంతో యజ్ఞానికిచాలా ప్రాధాన్యం ఉంది. దాన్ని ప్రతిపాదించేదే వేదం.

*'యజదేవపూజాసంగతి కరణదానేషు'* అనే ధాతువునుండి యజ్ఞశబ్దం ఏర్పడింది. దేవపూజ, సమాజాన్ని కలిపిఉంచడం, దానం-ఈ మూడు యజ్ఞం ద్వారా నిర్వహింపబడతాయి. అంటే యజ్ఞాచరణంలో వ్యక్తి శ్రేయస్సు, సమాజ శ్రేయస్సు కూడా ఉన్నాయని గ్రహించాలి.

వైదికవాఙ్మయం ముఖ్యంగా నాలుగుభాగాలుగా ఉంటుంది. **సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులు.** ఇందులో**సంహితా**భాగాన్ని వేదాలంటారు. **బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులు** వైదికవాఙ్మయంగా చెప్పబడుతాయి. ఇవేకాక వేదార్థజ్ఞానానికి ఉపకరించే శిక్షాదిషడంగాలు, ప్రాతిశాఖ్యలు, న్యాయవైశేషికాది షడ్దర్శనాలుకూడ వైదిక వాఙ్మయంగా చెప్తారు.

భాషాదృష్టితో చూసినట్లైతే సంహితలోని భాష వైదిక భాష. తదుపరి గ్రంథాలలోని భాష దీనికంటె కొంత భిన్నంగా ఉంటుంది. దీన్ని లౌకికసంస్కృతభాషగా వ్యవహరిస్తారు. ఈ భేదాన్ని దృష్టిలోపెట్టుకొనే వైదికసంస్కృతం, లౌకిక సంస్కృతం- అని చెపుతూంటారు.

వేదశబ్దం *'విద్'* ధాతువునుండి ఏర్పడింది. *'విదజ్ఞానే, విదసత్తాయామ్, విద్‌లాభే, విదవిచారణే'* అని నాలుగురకాల *'విద్'* ధాతువులున్నాయి. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తోంది కాబట్టి వేదము జ్ఞానస్వరూపం. ఇహపరలోక ధర్మాధర్మ సంబంధ విషయవిచారణ చేస్తోంది కాబట్టి వేదం 'విచారణ' రూపమైంది.

వేదాలకు *'శ్రుతులు'* అనికూడా పేరు. *'శ్రుతి'* అనే పదం *'శ్రుశ్రవణే'* అనే ధాతువునుండి ఏర్పడింది. *'వినికిడి'* వినబడునది అని దీని అర్థం. మహర్షులు దివ్యదృష్టితో దర్శించినది చెప్పగా విని (తరువాత) వారిశిష్యులు గ్రహించారు. కాబట్టి 'శ్రుతి' అనే పేరు సార్థకమైంది. పరమాత్మనుండి విన్నారు కాబట్టికూడ 'శ్రుతుల'ని అనవచ్చును.

వేదాలకు 'త్రయీ' అనేపేరుకూడా ఉంది. వేద మంత్రాలు ఋక్, యజుస్, సామములని మూడువిధాలుగా ఉండటంచేత 'త్రయీ' అనేపేరుకలిగింది. ఆధునికులు కొందరు ఈ పేరునుబట్టి ఋగ్యజుస్సామవేదాలు మూడే ముందు ఉండేవని, అందుకే 'త్రయీ' అనే పేరు వచ్చిందని, 'అథర్వ' వేదం తరువాత కాలంలో వచ్చిందని అంటారు. ఋగ్వేదము **'అగ్నిమీళే పురోహితమ్'** అను అగ్నిస్తుతితో ఆరంభమవుతుంది. శుక్లయజుర్వేద (మాధ్యందినీ) సంహిత **'ఇషే త్వోర్జేత్వా'** అను వాయుస్తుతితో ఆరంభమవుతుంది. సామవేదమందలి జైమినిశాఖ **'యే త్రిషప్తా పరియంతి'** అను సూర్యస్తుతితో ఆరంభమవుతుంది. ఈవిధంగా ద్యులోక, అంతరిక్ష, భూలోకమందు ప్రధాన దేవతాస్తుతుల దృష్టితో మూడు (త్రయీ) వేదాలను వ్యవహారం కలిగి ఉండవచ్చును. వేదమంత్రాలు ప్రధానంగా మూడువిధాలుగా ఉన్నవి. 1)ఛందోబద్ధములు. వీనికే **ఋక్కులు** అనిపేరు. 2)ఛందోరహితములు- వీనికే **యజుస్సులు**అని పేరు. 3)గానసహితములగు ఛందోబద్ధములు- వీనికి **సామాలని** పేరు. ఈ భేదము కూడ 'త్రయి' అను వ్యవహారము కలుగుటకు కారణం.

ఏకరాశిగాఉన్న వేదాలను విభాగం చేయడంవల్ల సాత్యవతేయునికి 'వేదవ్యాసు'డనే పేరు వచ్చిందన్నది జగద్విదితం. వేదవ్యాసమహర్షి తన నలుగురుశిష్యులకు నాలుగు వేదాలను ప్రచారం (పఠన సాధనాలు) చెయ్యమని చెప్పినట్లుంది. అంటే అప్పటికే నాలుగు వేదాలు ఉన్నట్లే కదా! మహాభాష్యకర్త పతంజలి మహర్షి పస్పశాహ్నికంలో–

యజుర్వేదము 101 శాఖలు, సామవేదము 1000 శాఖలు, ఋగ్వేదము 21 శాఖలు, అథర్వము 9 శాఖలు కలిగినవని చెప్పారు. కాలాంతరంలో ఇందులో చాలాభాగం లుప్తమయ్యాయి. కాబట్టి 'నాలుగు వేదాలు' అనడం ప్రామాణికం.

ఇతిహాస పురాణాలతోకలిపి వేదాలు ఐదుఅను వ్యవహారం కూడ ఉంది. మహాభారతానికి పంచమవేదమనే పేరు ప్రసిద్ధమే కదా! వేదములకు 'నిగమ' ములనిపేరు. నిరంతర గమన శీలములు కావున నిగమాలని పేరు కల్గింది. వేదాలకు ఆమ్నాయములనికూడపేరు. మంత్రద్రష్టలైన ఋషులచే మొదటిసారిగా చెప్పబడినవి కావున వీనిని 'ఆమ్నాయి'ములను పేరు వచ్చింది. ప్రతి వేదము సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తు– అను నాలుగు భాగాలతో ఉంటుంది.

**1) సంహిత-** కేవల మంత్రభాగానికి సంహితఅనిపేరు. ఏకరాశిగాఉన్న ఈ సంహితలు కాలక్రమంలో అనేక శాఖలుగా విస్తరించి అధ్యయనం చేయబడ్డాయి. ఈ మంత్రాలకు *జటా, మాలా, శిఖా, రేఖా, ధ్వజ, దండ, రథ, ఘనపాఠాలను* ఏర్పాటు చేసికొని సంహితలను యథాతథంగా రక్షించారు.

**2) బ్రాహ్మణము-** వేదంచెప్పిన యజ్ఞయాగాది కర్మలను నిర్వహించే పద్ధతిని, ఆయా సందర్భాలలో ఉపయోగింపవలసిన మంత్రాలను బ్రాహ్మణగ్రంథం వివరిస్తుంది. వైదిక కర్మాచరణకు ఈ బ్రాహ్మణాలు చాల ముఖ్యమైనవి.

**3) ఆరణ్యకము-** అరణ్యంలో పఠిస్తారు కాబట్టి ఆరణ్యకములనే పేరువచ్చింది. భారతీయ సామాజిక వ్యవస్థలో *బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలు* నాలుగు చాలా ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. వారు ఆచరించవలసిన కర్మలను, అనుసరించ వలసిన పద్ధతులను వివరించేవే ఈ ఆరణ్యకాలు.

**4) ఉపనిషత్తు-** ఇది ప్రతివేదమునకు చివరలో ఉండడం వల్ల వలన 'వేదాంత'మనే పేరువచ్చింది. అంతేకాక వేదశబ్దానికి జ్ఞానమని అర్థంగ్రహిస్తే జ్ఞానానికిచివరిది అంటే జ్ఞానానికి పరాకాష్ఠ అని అర్థం.

'ఉపనిషద్' అనే పదం 'ఉప–ని' అనే ఉపసర్గలతో కూడిన *'షద్ విశరణ గత్యవసాదనేషు'* అనే ధాతువునుండి ఏర్పడింది. అవిద్యను నశింపజేసి, దుఃఖములను శిథిలపరచి, జ్ఞానానికి చేర్చేది, బ్రహ్మప్రాప్తిని కలిగించేది ఉపనిషత్తు.

ఉపనిషత్తులలో ఓంకారతత్త్వం, ఆత్మతత్త్వాన్ని విపులంగా చర్చించడం జరిగింది. ఉపనిషత్తులలో 10 ఉపనిషత్తులు ముఖ్యమైనవిగా భావిస్తుంటారు. *ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండ, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకాలను* దశోపనిషత్తులుగా వ్యవహరిస్తారు. శంకర భగవత్పాదులు ఈ పదింటికీ ప్రధానంగా వ్యాఖ్య వ్రాశారు. భారతీయాధ్యాత్మిక విజ్ఞానమంతా వీటిలో నిక్షిప్తమై ఉంది.

వేదాలలో లౌకిక విషయాలైన వర్ణాశ్రమ ధర్మాలు, రాజ్యవ్యవస్థ, స్త్రీ ధర్మం, వివాహవ్యవస్థ, ద్యూతనింద, సోమపాన ప్రభావం (ఋక్. 10–43–13) (ఋక్.10–119–9) కార్యనిర్వహణవిధానం, వ్యవసాయం, క్షేత్రపాలనం, ఔషధ విశేషాలు మొదలైన అనేక విషయాలు ప్రస్తావించబడింది. ఋగ్వేదంలోని 10–161–1వ మంత్రంలో 'రాజయక్ష్మ' రోగం నుండి విముక్తి చేయడం చెప్పబడింది. మరొక సందర్భంలో 'హృదయరోగానికి 'చిలుక హృదయం' ఔషధంగా చెప్పబడింది. 10–173, 174 సూక్తాలలో రాజ ధర్మాలు, రాజనీతులు వివరించారు.

వైదికమంత్రాలకు దేవసంబంధమైన, యజ్ఞవిషయకమైన, ఆధ్యాత్మికమైన, ఆధిభౌతికమైన, ఐతిహాసికమైన అర్థంలను కూడ తెలియజేసే అవకాశం ఉంది. దీని దృష్టితో ఆధునిక కాలంలో వైజ్ఞానికార్థాలను, గణితవిజ్ఞానాన్ని, కంప్యూటర్ విజ్ఞానాన్ని కూడ వేదమంత్రముల మూలంగా వ్యాఖ్యానిస్తున్నారు. భాష్యకారులైన సాయణులవారు 'ఒకానొక మంత్రానికి తొమ్మిది అర్థాలు వివరించి, ఇంకనూ అర్థములు కలవు, గాని విస్తృతి దృష్టితో వ్రాయుటలేదని' చెప్పారు. మనకు వైదిక వాఙ్మయంపట్ల విశ్వాసం, శ్రద్ధఉండి విజ్ఞానతృష్ణ ఉన్నట్లయితే ఆధునికకాలంలోకూడ వేదవాఙ్మయం స్వీకరణయోగ్యమే అవుతుంది.

# అనంత శక్తుల... అంజనా తనయుడు



– శ్రీ కప్పగంతు లక్ష్మీనారాయణ

హనుమంతుడు–ఈ ఒక్క పేరు చాలు.. నిరాశ, నిస్తేజం, భయం, దౌర్బల్యం ఆవహించిన మనసుల్ని ఉత్తేజం చేయటానికి. *'జై వజ్రాంగబలీ' (బజరంగబలీ)*– ఒక్క నినాదం చాలు యువతలో సమరస్ఫూర్తి ఉద్దీపింపజేయటానికి. 'ఆంజనేయ స్వామి'– ఈ ఒక్క నామం చాలు ఆధ్యాత్మిక యానంలో పరమ పదసోపానాన్ని చేరుకునే కైవల్యమార్గాన్ని అనుగ్రహించటానికి. కేవలం భారతదేశమేకాదు, యావత్ప్రపంచంలో హనుమంతుని భక్తులు లెక్కకు మిక్కిలిగా ఉంటారు.

హనూమాన్ అనే శబ్దానికి 'జ్ఞానవాన్' అనే అర్థం ఉంది. 'హనూ' అంటే 'జ్ఞానం' అనేఅర్థం కొన్నినిఘంటువుల్లో కనిపిస్తుంది. 'హనువులు' అంటే 'దవడలు' అనే అర్థం కూడా వాడుకలో ఉంది. శబ్దార్థపరంగా చూస్తే, 'హనుమ' అనే పదంలోని అచ్చులు 'అ, ఉ, మ' ఈ మూడుకలిస్తే 'ఓం'కారం ఆవిర్భవిస్తుంది. అంటే, హనుమంతుడు ప్రణవస్వరూపడనే విషయం అత్యంత స్పష్టంగాతెలుస్తుంది.

## సూర్యాంజనేయుడు

హనుమ నవవ్యాకరణపండితుడు. ఉదయాద్రిపై ఒక పాదం, అస్తాద్రిపై మరొకపాదం ఉంచి, సూర్యరథగమనానికి అనుగుణంగా సంచరిస్తూ, సూర్యునివద్ద సకలశాస్త్ర వాఙ్మయాన్ని అభ్యాసం చేశాడని పురాణాలు చెబుతున్నాయి. హనుమ సూర్యునికి శిష్యునిగానేకాకుండా, అల్లునిగా కూడా కొన్ని చోట్ల కనిపిస్తారు. పరాశరసంహితవంటి కొన్ని గ్రంథాల్లో సూర్యుని వర్చస్సు 'సువర్చల' అనేకన్యగా మారిందని, తన



కుమార్తె అయిన సువర్చలను హనుమంతునికి ఇచ్చి సూర్యుడు వివాహం చేశాడని పేర్కొన్నారు. ఇప్పటికీ, వైదిక క్రతువుల్లో **'సువర్చలా హనుమ త్కల్యాణం'** జరపటం ఆచారంగా ఉంది. ఈ విధంగా హనుమసూర్యుని శిష్యుడు, అల్లుడుకూడా అవుతాడు.

సూర్యుని కుమారుడైన సుగ్రీవునికి హనుమ మంత్రి, అత్యంతప్రియస్నేహితుడుకూడా. అన్న వాలికి భయపడి దేశాలుపట్టి తిరుగుతున్న సుగ్రీవునికి ధైర్యం చెప్పి, రామునితో స్నేహంచేయించి, వానర రాజ్యానికి అధిపతిని చేసిందికూడా హనుమంతుడే. తన గురుపుత్రుడైన సుగ్రీవునికి తోడ్పడం ద్వారా హనుమ గురుఋణం తీర్చుకున్నారు. వీటన్నిటికన్నా సమున్నత మైన అంశం హనుమ, రామచంద్ర మూర్తికి దాసానుదాసుడు. రాముడు సూర్యవంశంలో పుట్టినవాడు. వారి మైత్రికి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఈవిధంగా తనకు విద్యాదాత అయిన సూర్యునివంశంలో జన్మించిన రామచంద్రునికి సేవచేసిన ఘనతకూడా హనుమకు దక్కుతుంది. మొత్తంగా సూర్యునితో, సూర్యవంశంతో ఉత్తమమైత్రి కలిగిన హనుమను **'సూర్యాంజనేయుడి'**గానూ భక్తులు కొలుచుకుంటారు.

## ప్రాణప్రదాత హనుమంతుడు

హనుమలో మరో విశిష్టలక్షణం–అతడు ప్రాణప్రదాత. శ్రీరామవియోగదుఃఖం భరించలేక, ఆత్మాహుతికి సిద్ధపడ్డ సీతమ్మకు రామయ్యక్షేమం తెలిపి, ఆమెను ఆత్మహత్యాప్రయత్నం నుంచి విరమింపజేసి, ఆమెకు ప్రాణాన్ని అందిస్తాడు హనుమ. ఇంద్రజిత్తు చేసిన అస్త్రప్రయోగానికి, నిశ్చేష్టులై పడి ఉన్న వానరులందరికీ ఓషధీపర్వతాన్ని తీసుకురావటం ద్వారా ప్రాణప్రదానం చేసింది కూడా హనుమంతుడే. సంజీవని తీసుకురావటంద్వారా లక్ష్మణప్రాణప్రదాతగా రాముని అభినందనలు అందుకున్నదీ

హనుమే. అందుకే, జాంబవంతుడు– "ఎంతమంది వీరులు జీవించి ఉన్నా, హనుమంతుడు లేకపోతే వారందరూ జీవించి ఉన్నట్లు లెక్కకాదు. ఒక్క హనుమంతుడు జీవించి ఉంటే, సకలవానరవీరులూ బ్రతికి ఉన్నట్లే" అని అంటాడు.

## రుద్రావతారమూర్తి హనుమ

రామరావణ సంగ్రామంలో కూడా అనేకచోట్ల హనుమ లోని రుద్రతేజాన్ని వాల్మీకి మహర్షి వివరిస్తారు. ప్రళయకాల రుద్రునివలే హనుమ భాసించారనే పోలికకూడా రామాయణంలో అనేకచోట్ల కనిపిస్తుంది. 'రుద్రవీర్య సముద్భవాయ నమః' అని హనుమదష్టోత్తరం కూడా హనుమను రుద్రావతార మూర్తిగా నమస్కరిస్తుంది.

## హనుమంతుని సందేశం

హనుమంతుడంటే ఒకఅంకితభావం. బుద్ధిబలం, స్థిరమైనకీర్తి, నిర్భయత్వం, వాక్నైపుణ్యం... వీటన్నింటి సమ్మేళనం. ఈ లక్షణాలన్నింటికీ అసలైన సిసలైన ఉదాహరణ హనుమంతుడు. సముద్రంలో నూరుయోజనాల దూరాన్ని అవలీలగా దాటడం, విశ్వవిజేతలైన రాక్షసవీరుల్ని దోమల్లాగ నలిపివేయటం, బంగారుమేడలతోఉన్న లంకానగరాన్ని తన తోకకు అంటించిన నిప్పుతో భస్మీపటలం చేయటం ఇవన్నీ హనుమంతుడి వీరత్వాన్ని లోకానికి తెలియజేసిన అనేక సంఘటనల్లో కొన్ని మాత్రమే. సముద్రాన్ని దాటడానికిలేచిన హనుమంతుడు అంగదాది వీరులతో 'నేను లంకానగరానికి వెళుతున్నాను. ఎప్పటికి తిరిగి వస్తానో చెప్పలేను గానీ, సీతమ్మను చూసే వస్తాను. ఇది తథ్యం. నా రాక కోసం ఎదురుచూస్తూ ఉండండి' అన్నాడు. 'నీ వెవరివీ' అనిఎవరైనా అడిగితే హనుమంతుడు తనగురించి తాను చెప్పుకొనే మొదటిమాట 'నేను కోసలేంద్రుడి దాసుణ్ణి!'. కొంచెం వివరంగా చెప్పమంటే 'ఎంత అసాధ్యమైన కార్యాన్నయినా అనాయసంగా నెరవేర్చగలిగిన శ్రీరామచంద్రుడి సేవకుణ్ణి' అంటాడు.

'వినయం వల్లనే వ్యక్తిత్వం రాణిస్తుంది' అనేదానికి హనుమంతుడే నిదర్శనం. ఆయన సముద్రాన్నిదాటి 'అబ్బా! ఇది సామాన్యమైన పనేమీకాదు. మాలో ఏ నలుగురో ఆయిదుగురో దీనికి సమర్థులు, అంటూ సుగ్రీవుడి పేరు, మరొక ఇద్దరు ముగ్గురి పేర్లు చెప్పి, చిట్టచివరనే తన పేరుని చెప్పుకొన్నాడు.

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినప్పుడు హనుమంతుడు రెండుచేతులూ జోడించి శిరస్సునువంచి దానికి నమస్కరించాడు. ఆ బంధానికి కట్టుబడ్డాడు. ఒక్క విదిలింపు విదిలిస్తే ఆ బంధం వీడిపోతుంది. కానీ ఆయన దానికి కట్టుబడే ఉన్నాడు ఎందుకంటే ఇంద్రజిత్తు స్వయంగా తనను రావణుడి వద్దకు తీసుకొనివెళతాడు కనుక, రావణుణ్ణి వెతికే శ్రమ తనకు తప్పుతుంది కనుక "పెద్దలమాటకు బద్ధులుకండి. మన గౌరవానికేమి హాని ఉండదు" ఇదే హనుమంతుడు మనకిచ్చిన సందేశం. ఈ సందేశాల్ని అర్థం చేసుకొని, మనజీవితంలో ఆచరించాలి.

## హనుమంతుని ఆదర్శం

'ధర్మ ఏవ హతో హన్తి'– ధర్మాన్ని దెబ్బతీస్తే అది మనల్ని దెబ్బతీస్తుంది. ధర్మసేవ చేయాలనుకునేవారు హనుమంతుడి జీవితాన్ని అధ్యయనంచేయాలి. ఎందుకంటే నిజమైన ధర్మసేవకుడు అతడే. హనుమంతుణ్ణి రాముని సేవకుడని చెప్పుకుంటూ ఉంటాం. అక్కడ రామశబ్దాన్ని 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నదాన్నిబట్టి ధర్మంగానే స్వీకరించాలి. ధర్మరక్షణకోసం రాముడు అవతరిస్తే అతనిరూపంలో ధర్మసేవ కోసం హనుమంతుడు అవతరించాడు. త్రేతాయుగంలో రావణాదుల్ని వధించి ధర్మాన్ని రక్షించడంకోసం శ్రీరాముడు అవతరించాడు. ఆ ధర్మకార్యం హనుమంతుడి సహకారంతోనే జరిగింది. రాముని సేవకుడైతే రాముడు పుట్టినప్పటినుండీ అతనిసేవలో హనుమంతుడు ఉండాలి. కానీ రాముడు ధర్మకార్యం ఆరంభించినప్పటినుండి మాత్రమే హనుమంతుడు రాముడితో ఉన్నాడు. అందుకే రాముడికీ, హనుమంతుడికీ పరిచయం కిష్కింధకాండ దాకా జరగలేదు. అలాగే ధర్మకార్యం ముగియగానే హనుమంతుడు గంధమాదన పర్వతంపై తపోనిష్ఠుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు తప్ప రామునితోపాటు అయోధ్యలో ఉండి రాజభోగాలు అనుభవించలేదు. ధర్మకార్యంలో తన అవసరం ఉన్నప్పుడల్లా రాముడికితోడుగా నిలిచాడు. త్రేతాయుగంలో ధర్మస్థాపనలో కీలకపాత్రే వహించినవాడు హనుమంతుడు. రామరావణయుద్ధంఅనే ధర్మయుద్ధంలో విజయకారకుడు హనుమంతుడు. అలాగే, ద్వాపరయుగంలో కూడా కురుక్షేత్రసంగ్రామంలో ధర్మనిరతులైన పాండవుల రథాలపై పతాకంలో ఉంటూ విజయానికి పరోక్షంగా కారకుడయ్యాడు. ఇతిహాస పురాణాలు, చారిత్రిక సత్యాలు, ధర్మరక్షణలో హనుమంతుడు ఒక్కడే దిక్కు అని చెబుతున్నాయి. సకల సద్గుణ గరిష్ఠుడు, సర్వశక్తిమంతుడు అయిన హనుమంతుణ్ణి ఆదర్శంగా స్వీకరించినప్పుడే మానవజాతి ధర్మరక్షణ లక్ష్యాన్ని చేరుకోగలుగుతుంది.



# సనాతన ధర్మోద్ధారకులు ఆదిశంకరులు

– డా॥ కె. అన్నపూర్ణ

పండితపామరులంతా భగవదారాధనలో నిత్యం చేసే స్తోత్రాలు, పారాయణలు, శ్లోకపఠనాలలో అధికభాగం ఆదిశంకరులదే. దాదాపు సకలదేవతలకు సంబంధించిన స్తోత్రాలను, నదులకు సంబంధించిన స్తోత్రాలను మోక్షదాయక మైనవిగా, మనోరంజకమైనవిగా రచించారు.

జగద్గురువులు జన్మించిన ప్రదేశం కేరళలోని 'కాలడి'. నేటికీ ఆ ప్రాంతంలో అడుగుపెట్టిన వారికి అపూర్వమైన దివ్యాను భూతి కలుగుతుందనేది వాస్తవం. వృషాచలపర్వతంపైన ఉన్న మహాశివక్షేత్రంలో భక్తులు భజనద్వారా భగవదనుగ్రహ పాత్రు లయ్యేవారు. నేతి అభిషేకానికి ఈ క్షేత్రం ప్రసిద్ధి.

ఇక్కడ భజన అంటే, నెల లేదా రెండు నెలలపాటు అక్కడ ఉండే పుణ్యతీర్థాలలో స్నానంచేసి, స్వామిని ఆరాధించి, స్వామి ప్రసాదాన్ని స్వీకరిస్తూ, అక్కడే ఉంటూ స్వామిని సేవించడం సంప్రదాయం. ఆ విధంగానే శివగురువు, ఆర్యాంబ దంపతులు కూడా పుత్రప్రాప్తిని కోరి స్వామిని సేవించారు. ఈశ్వరుడు స్వప్నంలో సాక్షాత్కరించి "మీకు మూర్ఖులైన, దీర్ఘా యుష్కులైన నూరుగురు పుత్రులు కావాలో, అల్పాయుష్కుడైన, సర్వజ్ఞుడైన ఒక్క పుత్రుడు కావాలో" కోరుకోమన్నాడు.

ఆర్యాంబకు కూడా ఆ విధంగానే కల వచ్చింది. ఇద్దరూ మాకు దేని వలన మేలు కలుగుతుందో దానినే ప్రసాదించమని కోరుకొన్నారు. ఈశ్వరునిపై భారం వేశారు. పరమేశ్వరుడు తానే స్వయంగా వారి ఇంట అవతరించి కొన్ని సంవత్సరాలపాటు ఉంటానని అనుగ్రహించాడు. కలి ప్రారంభంలో అధర్మం మితిమీరిపోయింది. దాన్ని నివారించేందుకు సంకల్పించి పరమేశ్వరుడు ఒక సదాచార కుటుంబంలో అవతరించాడు. సర్వవిద్యలకు అధిపతి అయిన సదాశివుడు జ్ఞానోపదేశానికై శంకరావతారం ధరించాడు.

ఆర్యాంబకు వైశాఖశుద్ధ పంచమినాడు శంకరాచార్యులు జన్మించారు. వీరికి ఐదవఏట ఉపనయనం జరిగింది. మూడేళ్ళ వయసులోనే దేశభాషలు నేర్చుకున్నారు. ఐదేళ్ళ వయస్సుకు సంస్కృతాన్ని చక్కగా అభ్యసించారు. ఎనిమిదో ఏడులోగా వేదశాస్త్రాలు అభ్యసించారు. ఉపవీతులై గురుకుల వాసం పూర్తి చేసి ఎనిమిదో ఏట ఇంటికి వచ్చేసరికి తండ్రి దివంగతు లయ్యారు. అప్పుడు ఆచార్యులవారు లోకోద్ధరణ కర్తవ్యం తనమీద ఉన్నదని భావించి సన్న్యాసం స్వీకరించాలని నిశ్చ యించుకున్నారు. కానీ, తల్లియైన ఆర్యాంబకు ఈ విషయం బాధను కలిగిస్తుందేమోనని సంశయించారు.

ఇదిలా ఉండగా, ఒకసారి ఆర్యాంబ అనారోగ్యంతో నదికి వెళ్ళలేక శంకరులకు తెలుపగా, వారు దూరాన ఉన్న నది ఇంటి దగ్గరకు రావలసినదిగా ప్రార్థించారు. అలాగే ఆ నది ఇంటి దగ్గరకు వచ్చింది. ఆ ఒరవడికి దారిలోని కృష్ణాలయం కూలిపోయింది. కాలాంతరంలో ఆచార్యులవారి ఆజ్ఞతోనే పునరుద్ధరణ కూడా జరిగింది.

అలా తమ దగ్గరకు వచ్చిన నదిలో తల్లిని స్నానం చేయించారు. వారు కూడా నదిలోకి దిగగా ఒక మొసలి వారి పాదం పట్టుకొంది. అప్పుడు శంకరులు "ఇప్పుడు నా ప్రాణం పోవడం తథ్యం. నీవు నా తల్లివి. నీ ఆజ్ఞ లేకుండా నేను సన్న్యసించడం తగదు. సన్న్యాసం తీసుకుంటే నేను జీవిస్తానేమో,



కానీ తీసుకోకపోతే నాకు మరణం తప్పదు. ఇది దుర్మరణం. నేనీ విధంగా మరణిస్తే నీకు పుత్రకార్యాలు ఉండవు. సన్న్యాసాన్ని తీసుకుంటే నాకు మోక్షం, నీకు సద్గతి కలుగుతుంది. నేను సన్న్యసించినప్పటికీ నీకు అంత్యక్రియలు చేస్తాను" అన్నారు. పుత్రుని కోసం పరమేశ్వరునిపై భారంవేసి ఆ తల్లి తన నిర్ణయాన్ని కూడా శంకరునికే వదలివేసింది.

తక్షణమే మొసలి వారి పాదాలను విడిచింది. ఎంతో ఆనందించిన తల్లితో 'ఇప్పటి నుండి నేను ఒక ఇంటికి సంబంధించిన బిడ్డను కాను. సన్న్యాసినైన నాకు భిక్ష వేసేవారు తల్లులు. జ్ఞానోపదేష్టలైన గురువులే తండ్రులు. శిష్యులే కుమారులు. నేను ఈ విశ్వకుటుంబానికి చెందిన వాడను. నీవు నన్ను తలచగానే నేను నీ దగ్గరకు వస్తానని' నచ్చజెప్పారు. సక్రమసన్న్యాసానికి గురువును అన్వేషిస్తూ బయలుదేరారు.

పరమేశ్వరావతారమైన ఆ ఆచార్యునికి గురువులతో అవసరం లేనప్పటికీ లోకం కోసం, సద్గురువు ఆవశ్యకతను తెలిపేందుకు గాను గోవింద భగవత్పాదులకు శిష్యులై సన్న్యాసం స్వీకరించారు. గురుదేవులు బ్రహ్మసూత్రాలకు భాష్యం రాయమని ఆజ్ఞాపించారు. పదహారు సంవత్సరాల వయస్సుకే భాష్యరచన పూర్తయ్యింది. వ్యాసులవారు మరో పదహారేండ్ల ఆయుష్షును అనుగ్రహించి భాష్యరచన సిద్ధాంతాలను ప్రచారం చేసి భాష్య విషయాలను సిద్ధాంతీకరించమన్నారు.

అందుకుగాను శంకరులు దిగ్విజయం చేశారు. మండనమిశ్రుని వాదంలో గెలిచి సురేశ్వరాచార్యుల పేరుతో శిష్యునిగా స్వీకరించారు. వీరితో పాటు పద్మపాదుడు, తోటకాచార్యుడు, హస్తామలకాచార్యుడు అనే శిష్యులుండేవారు. జగద్గురువులైనప్పటికీ తల్లి అవసాన సమయానికి చేరుకుని, అక్కడ వ్యతిరేకించిన వారిని కాదని, వారి అంత్యక్రియలు నిర్వర్తించి తల్లి కోరికను నెరవేర్చారు. శంకరులు ఉపాసనా క్రమంతో షణ్మత స్థాపన చేశారు. వేదమంతటినీ ప్రమాణంగా గ్రహించారు.

త్రైగుణ్యమైన బంధాన్ని వదుల్చుకోవడం కోసం వర్ణాశ్రమ ధర్మాల బంధంలో చిక్కుకోవాలి. ఇది ఎంతగా బిగిస్తే ఆ బంధం అంతగా సడలుతుంది. పూర్తిగా సడలిన మీదట రెండు బంధాలూ తొలగుతాయి. ఈ విధంగా కర్మానుష్ఠానం చేస్తూ క్రమంగా అద్వైతాన్ని పొందాలని చెప్పారు. ధర్మానుష్ఠానం, జ్ఞానం, శివభక్తి, విష్ణుభక్తి అన్నీ వారికి సమ్మతాలే. శ్రుతి, స్మృతి, పురాణాలలో దేనినీ నిరాకరించలేదు. అన్నింటినీ అనుసరించారు. పండితులకు మాత్రమే బోధపడే గ్రంథాలతో పాటు సామాన్యులకు కూడా చదువుకోగలిగే గ్రంథాలను కూడా రచించారు. వివేక చూడామణి, ఉపదేశ సాహస్రి, సర్వవేదాంత సిద్ధాంత సార సంగ్రహం, గోవిందాష్టకం, భజగోవింద శ్లోకాలు మొ॥వి వీరి రచనలు.

భారతదేశమంతటా పర్యటించి దక్షిణాదిన **శృంగేరిలో,** పశ్చిమాన **ద్వారకలో,** ఉత్తరాన **బదరికాశ్రమంలో,** తూర్పున **పూరీలో** పీఠాలను స్థాపించారు. కాంచీపురంలోని రాజు కోరికను మన్నించి అక్కడి పండితులతో వాదించి, వారిని జయించి సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారు. ఆ సందర్భంలో ఏడు సం॥ల బాలు డొకడు స్వామితో ఏడురోజులు వాదించాడు. ఆదిశంకరులుగా అవతరించి ముప్పైరెండేళ్ళు మహోత్కృష్టమైన లోకోద్ధరణ చేసి వైదిక మతాన్ని పునఃప్రతిష్ఠించిన సరస్వతీ స్వరూపులు. వారి జ్ఞానజ్యోతితో జగత్తునంతా వెలుగుదారివైపు పయనింపజేసిన సనాతన ధర్మోద్ధారకులు జగద్గురువుఆదిశంకరాచార్యులు.

"శ్రుతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం।
నమామి భగవత్పాదం శంకరం లోక శంకరం॥"



ఈశ్వరుడైన విష్ణువు ఎప్పుడెవరిని ఏం చేస్తాడో ఎవరికెఱుక?

# లక్ష్మీవిభూతి "నృసింహావిర్భూతి"

– డా॥ సూరం శ్రీనివాసులు

*పాన్త్వస్మాన్ పురుహూతవైరిబలవన్మాతంగ మాద్యద్ఘటా*
*కుమ్భోచ్చాద్రివిపాటనాధిక పటు ప్రత్యేక వజ్రాయితాః।*
*శ్రీ మత్కంఠీరవాస్య ప్రతత సునఖరా దారితారాతిదూర*
*ప్రధ్వస్త ధ్వాన్త శాన్తప్రవితత మనసా భావితా భూరిభాగ్యైః॥*

ఇది శ్రీవాదిరాజతీర్థకృతమైన 'నఖ' స్తుతి. గోళ్లను పొగడటం. ఆ గోళ్ళు నృసింహునివి. "లక్ష్మీసంపన్నుడైన నృసింహస్వామి నఖాలు శుభప్రదాలై మనలను కాపాడాలి. ఆ గోళ్ళు ఇంద్ర శత్రువులనే మదపుటేనుగుల కుంభస్థలాలను బ్రద్దలుచేయటంలో వజ్రాయుధం వంటివి. శత్రువినాశనంద్వారా చీకట్లు దూరమైనందువలన ప్రశాంత మనస్సుతో దేవతలచే సత్కరింపబడేవి, సంభావింపబడేవి ఆ గోళ్ళు." ఇంత ప్రస్తుతులనందిన ఆ గోళ్ళు సాధారణమైనవి గావు. ఆర్తత్రాణ పరాయణత్వాన్ని నిరూపించుకోవటానికి భగవంతునిపై భక్తుల విశ్వాసం సన్నగిల్లకుండా చూసేందుకే, శ్రీమన్నారాయణుని నాలుగవ అవతారం– నరసింహావతారం. ఈ నృసింహావతారానికి కారణ భూతమైన సంఘటన ఒక ఘటన. సనకుడు, సనాతనుడు, సనందనుడు, సనత్కుమారుడు వీరు బ్రహ్మమానసపుత్రులు. ఎప్పుడూ కుమారులే. బ్రహ్మచారులు. వారు శ్రీలలనేశ్వర సందర్శనకై వెళ్ళగా ద్వారపాలకులు జయవిజయులు అడ్డగించారు. వారు కోపించారు. వారిని అడ్డగించరాదన్న వారి తర్కం జయవిజయులుకు అర్థం కాలేదు. అది సహజమే. అంతటి పండితులే అయితే వారు ద్వార పాలకులుగా ఎలా ఉంటారు? అయినా సనకాదులు కోపించారు.

*క్రోధము తపముం జెఱచును, .....బాధయగుం గ్రోధిగాఁ దపస్వికిఁ జన్నే...* అని భారత వచనం. క్రోధం అంత ప్రమాదకరం. సనకాదుల కోపం జయ విజయులకు శాపంగా పరిణమించింది. "మందబుద్ధులై మమ్మల్ని అడ్డగించిన అనుచిత కర్మలచేత మీరు మా శాపార్హులగుదురు. కావున భూలోకంలో లోభమోహమనే శత్రువులచే బాధితులై జన్మించండి" అని శపించారు. వారు మంద బుద్ధులు అయినా శప్తులు. భూలోకంలోనూ వారికి శత్రువులు లోభమోహాలే. మర్త్యలోకం సాధారణంగా కర్మభూమి. మానవులకు శప్తులైన సురాసురులకు మాత్రం శాపభోగభూమి. జయవిజయులు శాపాన్ని అనుభవించే విధానాన్ని శ్రీహరి ఇలా పరిష్కరించాడు.



*అదిగాన దనుజయోనిం.... మది నెపుడు నన్నెతలచుచు వదలక నా చేతఁ జచ్చి వచ్చెద రిటకున్.'*– ఆ శాపతత్పరిష్కార ఫలితమే తొలిజన్మగా హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల జననం. ఆ హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు.

తన అన్న హిరణ్యాక్షుని మరణంతో శోకిస్తున్న తల్లినీ, తమ్ముని భార్యకూ తాత్త్వికత బోధించి, ఊరడించాడు. అయితే తాను మాత్రం ఆ జరామరణాలు నుండీ బయటపడాలని తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. హిరణ్యకశిపుడు తన సంకల్పానికి తగినట్లుగా కోరుకున్నాడు ఇలా–*గాలిం, గుంభిని, నగ్ని, నంబువుల, నాకాశస్థలిన్,... స్త్రాలిన్, మృత్యువు లేని జీవనము లోకాధీశ! యిప్పింపవే.'* పంచభూతాలలోనూ, రేబవళ్ళలోనూ, వెలుగు చీకట్లలోనూ, దేవదానవ మానవజంతు జలచరాదుల వలననూ, సర్వాయుధాల వలననూ మరణం సంభవించగూడదని కోరిక– ఇక్కడ పడింది నరసింహావతారానికి బీజం. ఈ కోరిక లేకుంటే ఈ అవతారమే లేదు. మృత్యుభయం లేకుంటే అటువంటి కోరికలే ఉండవు. మృత్యువు కన్నా మృత్యు భయం ప్రబలతరం.

*"మదినెప్పుడు నన్నె తలచుచు"* అని తండ్రి హిరణ్య కశిపునికి నారాయణుడు చూపిన దారి. తండ్రి నారాయణస్మరణ మానడు. తనయుడు ప్రహ్లాదునికి తల్లికడుపులో ఉన్నప్పుడే నారదుని ఉపదేశంద్వారా నిత్యనారాయణస్మరణం ఎలానో చూద్దాం– *'పానీయంబులు ద్రావుచున్... సంతత శ్రీనారాయణ పాదపద్మ యుగళీ చింతా'* తండ్రీకొడుకులిద్దరూ నారాయణస్మరణయే చేస్తున్నారు. ఇద్దరికీ ఒకే ఫలం లభించవచ్చు కదకు. కానీ మార్గాలు వేరు. హిరణ్యకశిపునిది శత్రుత్వం. ప్రహ్లాదునిది శరణాగతి. ఎలా తలుచుకున్నా, తలుచుకోవటమే ముఖ్యం. అదే తలపుల ఫలితాన్ని ఇవ్వ గలదన్నది భాగవతతత్త్వం.

*'కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, ... వచ్చు ధాత్రీశ్వరా!'* ఇది నారదుడు ధర్మరాజుకి తెలిపిన విషయ రహస్యం. భక్తితో ఒకరు, వైరంతో ఒకరు. ఇద్దరికీ హరిస్మరణయే లక్ష్యం. నారాయణుని అనుగ్రహం ఇద్దరికీ కలగాలి. ఆయన చూపులలో, చేతలలో అనుగ్రహం, ఆవేశం రెండూకావాలి. ప్రేమా, క్రోధం

రెండూ జ్వలించాలి. నారాయణుడు శ్రీమన్నారాయణుడు. అందుకే ఉభయాత్మనా సర్వాత్మనా ప్రవృత్తిని నివృత్తులూ రెండూ కలవాడు. కారణం? లక్ష్మీవిలాసాలే- శ్రీగుణరత్నకోశం ఇలా అంటోంది.

**'శ్రియై సమస్త చిదచిద్విధానవ్యసనం హరేః అంగీకారి భిరాలోకైః సార్థయన్త్యై కృతాంజలిః'** నారాయణునికి చిదచిద్వి ధానం ఒక వ్యసనమట. దానిని తన చూపులతో ఆమోదిస్తూ సార్థకం చేసే లక్ష్మికి నమస్సులట. లక్ష్మిఆమోదంతోనే హరి శ్రీహరియై లోక పాలన చేస్తున్నాడు. ప్రహ్లాదునిపై అనుగ్రహానికి ఆ చూపులు ఆమోద ముంది. మరి హిరణ్యకశిపునిపై ఆగ్రహానికి? దానికీ లక్ష్మియే ఆమోదాన్ని అందించి శక్తినిస్తుంది. వివరంగా చూద్దాం-

తండ్రీ కొడుకుల మధ్య అభిప్రాయ భేదాలు పెరిగాయి. తీవ్రమైన ఆగ్రహావేశాలతో హిరణ్యకశిపుడు తన పితృత్వాన్ని కూడా మరిచిపోయి అనేక చిత్రహింసలకు గురిచేశాడు. అయినా ప్రహ్లాదుడు తొణకలేదు, బెణకలేదు. పైపెచ్చు తండ్రికే హితవచనాలు చెప్పటమారంభించాడు. తన తోటివారినీ తనలా తయారు చేశాడు. వారికీ మోక్షాసక్తిని కలిగించాడు. తండ్రి కోపాన్ని రెట్టింపు జేశాడు. ఇక్కడ ఆ కోపోద్రేకానికి పోతన విష్ణుభక్తి కూడా తోడైంది. ప్రహ్లాదుని వెనుక పోతన నిలిచాడు-

**'ఆచార్యోక్తము గాక బాలురకు..... విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్య వంశాచారంబులు.... నిర్దోషముం జేసెదన్.'** అని తండ్రి ఆక్రోశించి తనయుని చంపటానికైనా సిద్ధమయ్యాడు, ఆచార్య వచనాన్ని తిరస్కరించటం, ఇతరులలో మోక్షాసక్తిని కలిగించటం, వాచాలత్వం, శత్రుకీర్తన, వంశాచార తిరస్కారం, కులద్రోహం- ఇవి ప్రహ్లాదునిపై ఆరోపణలు- అయినా ప్రహ్లాదుడు హితోక్తులు మానలేదు.

**'పాలింపుము ....గేశవభక్తిన్'** అని ఉద్బోధించాడు. ఘర్షణ అనివార్యమైంది. వాదోపవాదాలు పరాకాష్ఠకు చేరాయి. *'మున్ను నే వెదకితిం బల్మాఱు నారాయణుండే తద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెందుండురా? దుర్మతీ!'* అని సూటిగా అడిగాడు. *"ఎందెందువెదికి చూచిన నందందే కలడు"* ప్రహ్లాదుని సమాధానం. ఈ వాదనతో వీరిద్దరి కన్నా ముందు నారాయణుడు జాగరూకుడు కావలసి వచ్చింది.

అటు హిరణ్యకశిపునకు బ్రహ్మ ఇచ్చిన వరం. అది అతిక్రమించరానిది. ఇటు ప్రహ్లాదునికి తనపై గల విశ్వాసం. అది చెదర రానిది. చెదరటమంటూ జరిగితే ఒక్క ప్రహ్లాదునితో అది ఆగదు. విశ్వవ్యాప్తమవుతుంది. తానే విశ్వాసమైన నారాయణుని తన ఉనికే సంశయాస్పదమై చుట్టుముట్టుతుంది. అందుకే నారాయణుడు సిద్ధ మయ్యాడు. ఎలా?-

**'శ్రీ నరసింహాకృతి నుండె నచ్యుతుడ ..... నుద్దండ ప్రభావంబునన్'** హిరణ్యకశిపుడు ఎక్కడ ఉన్నాడో అడుగుతాడని అంతటా నిలిచాడా విష్ణుమూర్తి? ప్రహ్లాదుడు చెప్పాడు గదా అని అంతట నిలిచాడా? చెప్పలేము. రెండూ కావచ్చు. ఏది ముందు జరిగినా దానికి సిద్ధమయ్యాడు నారాయణుడు. శరణాగతి ఫలాన్ని ఇంతకన్నా గొప్పగా ఇంకెక్కడా చెప్పలేదేమో కూడా! హిరణ్యకశిపుడు అడగనే అడిగాడు' స్తంభంలో ఉన్నాడా? అని.' ఏ సందేహము లేదు.. నేడు గాన బడు ప్రత్యక్ష స్వరూపంబునన్' అన్నాడు ప్రహ్లాదుడు. దానవేంద్రుడు స్తంభాన్ని బద్దలుచేశాడు. శ్రీనృసింహదేవుడు ఆవిర్భవించాడు ఇలా-



**'నరమూర్తి గాదు కేవల ..... హరి మాయారచిత మగు యథార్థము సూడన్.'** ప్రహ్లాదుని ప్రతిన నెరవేరింది. కథలో మధ్యలో ప్రవేశించిన అంశం నిర్వహింపబడింది. ప్రహ్లాదుని భక్తికి ప్రమాణం దొరికింది. విశ్వాసం విశ్వతో వ్యాప్తమైంది. అయితే మరొక అంశం మిగిలి ఉంది. అది హిరణ్యకశిపునకు సంబంధించి. తన అవతారా విర్భావంలోని రెండవలక్ష్యమది. తన ద్వారపాలకు లకు కూడా ముక్తిని కలిగించవలసి ఉంది. అందుకే తీవ్రరూపం ధరించాడు **'సటలు జళిపించి గర్జించి సంభ్రమించి .......పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప!'** -నారాయణునిలో ఇంత తీవ్రత కలగటానికి కారణం కూడా 'శ్రీ లక్ష్మియే'- ఋగ్వేద సూక్తమిలా చెప్తుంది- **'అహం సోమమాహనసం భిభర్మ్యహం....... తం బ్రహ్మాణం తమృ షింతం సుమేధామ్' (10-125-2, 5)** ఈ లక్ష్మీ అనుగ్రహం శ్రీమన్నారాయణునికేగాక మనకూ, మనచుట్టూ ఉన్న సర్వజగత్తుకూ కూడా అందటంలో ఆశ్చర్యమేమున్నది?



ప్రాతఃసాయ సంధ్యలలో హరికథలను చదివితే సంసారదుఃఖాలు తొలగుతాయి



## విశాఖసాగరతీరంలో...
## శ్రీమహాలక్ష్మీగోదాదేవిసమేత
## శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం

తిరుమలలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం లాగ విశాఖపట్నం ఋషికొండలో ప్రకృతి రమణీయతల మధ్య ఈ ఆలయ నిర్మాణాన్ని తి.తి.దేవస్థానం 2019లో చేపట్టింది. సముద్రమట్టానికి 60 మీటర్ల ఎత్తులో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.28 కోట్ల నిధులతో తి.తి.దే. ఈ ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దింది. చిన్న తిరుపతి స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఆలయం ఎదురుగా శ్రీబేడీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఏర్పాటు చేశారు. మూలవిరాట్టుకు ఒక వైపు పద్మావతి అమ్మవారి ఆలయం, మరో వైపు ఆండాళ్ అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు.

ఈ ఆలయమహాసంప్రోక్షణ కార్యక్రమం 2022, మార్చి 18 నుండి 23 వరకు జరిగింది. ఈ ఆలయ మహా సంప్రోక్షణ దృశ్యాలకై ప్రక్క పుటలలో త్రిప్పి చూడండి...



## శ్రీమహాలక్ష్మిగోదాదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం(విశాఖపట్నం) మహాసంప్రోక్షణ దృశ్యాలు


















# శ్రీమహాలక్ష్మీగోదాదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం(విశాఖపట్నం) మహాసంప్రోక్షణ దృశ్యాలు



















30-03-2022న తిరుపతి శ్వేత భవనంలో జరిగిన 'గోశాల నిర్వాహకుల మరియు గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల శిక్షణ'లో వర్చువల్ విధానం ద్వారా తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు ప్రారంభిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్. గారు మరియు ఇతర తి.తి.దే. అధికారులు పాల్గొన్నారు.



25-03-2022న తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు తిరుమలలో పి.ఏ.సి.1 నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ భక్తుల అభిప్రాయాలు తెలుసుకొంటున్న దృశ్యం



26-03-2022న తిరుమల స్వామివారిని దర్శించడానికి విచ్చేసిన శ్రీఅహోబిలమఠం 46వ జీయర్ శ్రీశ్రీశ్రీరంగనాథయతీంద్ర మహాదేశికన్ వారికి ఆలయమర్యాదలతో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. వారు స్వాగతం పలుకుతున్న దృశ్యం. చిత్రంలో శ్రీవారి ఆలయడిప్యూటీ ఈ.ఓ. శ్రీరమేష్ తదితర ఆలయసిబ్బందిని చూడవచ్చు



28-03-2022న శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 519వ వర్ధంతి సందర్భంగా తిరుపతి అలిపిరిలో 'మెట్లోత్సవం'లో జరిగిన సంకీర్తనాగోష్ఠిగానం. ఇందులో తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్. గారు, అధికారులు మరియు కళాకారులు పాల్గొన్నారు.



06-04-2022న పదోన్నతి పై బదిలీ అయి వెలుతున్న తి.తి.దే. సి.వి. & ఎస్.ఓ. శ్రీ గోపీనాథ్ జెట్టి, ఐ.పి.ఎస్. గారికి శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. గారు.




06-04-2022న తి.తి.దే. నూతన సి.వి. & ఎస్.ఓ. గా తిరుమల శ్రీవారి ఆలయంలో పదవీబాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీ డి.నరసింహకిషోర్, ఐ.పి.ఎస్. గారు

# శ్రీరామానుజ మార్గోపదేశం

- శ్రీమతి ఈ.జయలక్ష్మి

భారతదేశంలో ప్రచారంలో ఉన్న వైదిక సిద్ధాంతాలలో మూడుసిద్ధాంతాలు ప్రధానమైనవి అవి అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలు. అద్వైతసిద్ధాంతాన్ని శంకర భగవత్పాదులు, విశిష్టాద్వైతసిద్ధాంతాన్ని భగవద్రామానుజులు, ద్వైతసిద్ధాంతాన్ని మధ్వాచార్యులవారు ప్రవర్తింపజేశారు. ఈ ముగ్గురు కేవలం సిద్ధాంత ప్రచారకులే కాక, గొప్ప మానవతావాదులు కూడా. విశేషించి భగవద్రామానుజుల సమతావాదం సిద్ధాంత దృష్టిలోనూ, సాంఘిక దృక్పథంలోనూ చాలా విలక్షణమైనది. ఈ విషయం నాలుగైదు విధాలుగా నిరూపించబడుతున్నది.

1) భగవద్రామానుజులకు ముందున్న శ్రీవైష్ణవవిశిష్టాద్వైతమతప్రచారకులైన పూర్వాచార్యులు అందరూ ఆ సిద్ధాంతంలోని సంప్రదాయంలోని గొప్పతనాన్ని గమనించి, తమ దగ్గరకు వాటిని పొందడం కోసం వచ్చిన ఆ యా వ్యక్తుల భక్తి శ్రద్ధలను, సామర్థ్యాన్ని పరీక్షించి చూచి, యోగ్యత ఉన్నవారికి మాత్రమే ఉపదేశించేవారు. ఈ విధంగా వారు చేయడానికి కారణం గీతాచార్యుడు భగవద్గీతలో చివరలో పలికిన




**"ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన, న చాశ్రూషవే వాచ్యం న చ మాం యోభ్యసూయతి"** (ఈ గీతను తపస్వి కాని వానికి, భక్తి లేనివానికి, వినాలనే శ్రద్ధలేనివానికి, నా విషయంలో అసూయ కలిగినవానికి ఉపదేశించరాదు) అనే సూక్తి. ఉపదేశించే ఆచార్యుని పట్ల, ఉపదేశింపబడే విషయంపట్ల శ్రద్ధ, నమ్మకం లేకపోతే ఆ ఉపదేశం ఫలించదు కదా!

అయితే, భగవద్రామానుజులు ఈ కలియుగంలో క్రమంగా వచ్చే మార్పును గమనించి, ఈ సంప్రదాయాన్ని కొంత సంస్కరించారు. **"జ్ఞానాని అల్పీ భవిష్యంతి"** (ఈ కలి యుగంలో జ్ఞానం క్రమంగా తగ్గుతున్నది) అనే మహాభారత సూక్తిని బట్టి లోకంలో జ్ఞానంపట్ల శ్రద్ధ, ఆసక్తి తగ్గడం సహజం కదా! తీవ్రమైన పరీక్ష చేస్తే తప్ప జ్ఞానోపదేశం చేయకపోతే అమూల్యమైన జ్ఞానం మరగు పడిపోయే అవకాశం, ప్రమాదం ఉన్నదికదా.

ఈ విషయాన్ని గమనించిన భగవద్రామానుజులు వినాలనే ఆశ ఉన్నవారిని ఆదరించి, వారికి సంప్రదాయాన్ని సిద్ధాంతాన్ని ఉపదేశించటం తగినది, కాలానుగుణమైనది అని భావించి, ఆ క్రమాన్ని ఆచరణలో పెట్టారు. గోష్ఠీపురంలో గోష్ఠీపూర్ణులు అనే పేరు కలిగిన ఆచార్యుల వద్దకు తాము 18 సార్లు వెళ్లి, ఎంతో శ్రమపడి ఉపదేశంగా పొందిన అమూల్యమైన సంప్రదాయార్థాలను అక్కడే వానిని తెలుసుకోవాలని కోరిక కలిగిన వారికి అందరికీ ఉదారంగా ఉపదేశించారు. ఈ సందర్భాన్ని గమనించిన


గోష్ఠీపూర్ణులు మొదట ప్రాచీనమైన క్రమాన్ని కాదని, నూతనమైన క్రమాన్ని అడిగినవారికి అందరికీ జ్ఞానోపదేశం చేసిన భగవద్రామానుజులను చూచి కోపపడ్డారు, కానీ, తరువాత శ్రీరామానుజుల అంతరంగంలోని గొప్పతనాన్ని గమనించి తమకు లేని ఔదార్యం వారి మనసులో ఉన్నది అని గుర్తించి, ఎంతో సంతోషించి, వారిని **"ఎమ్బెరుమానార్"** (నా కంటే గొప్పవారు) అనే పేరుతో పిలిచి, సంభావించారు.

ఈ విధంగా జ్ఞానోపదేశం పొందడానికి అందరికీ సమానమైన యోగ్యత ఉన్నది అని భావించి వాదించిన రామానుజులు సమతావాది కదా.



2) భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు **"న మే ద్వేష్యోస్తి న ప్రియః"** (నేను ద్వేషించేవాడు, లేక, నేను ప్రేమించేవాడు అనేవాడు ఎవడు లేడు) అని అన్నాడు. ఈ విషయాన్ని ఋగ్వేదఖిలంగా చెప్పబడే జితంతే స్తోత్రం **"దేవానాం దానవానాం చ సామాన్య మధిదైవతమ్"** (దేవతలకు దానవులకు కూడా సమానమైన దైవం భగవంతుడు) అని తెలిపింది. **"సర్వే భద్రాణి పశ్యంతు"** అని ఆర్షవచనం ఈ వైదికమైన సమతావాదాన్ని గమనించిన శ్రీరామానుజులు, "భగవంతుని దర్శించి ఆనందించడానికి అందరికీ యోగ్యత ఉన్నది" అని భావించి, యాదవాద్రి అన బడే తిరునారాయణ పురంలో జాతి భేదం లేకుండా అందరికీ ఆ ఆలయంలో భగవంతుని అర్చామూర్తిని దర్శనం చేసుకునే అవకాశాన్ని కలుగజేశారు. ఇది కూడా భగవద్రామానుజుల సమతాదృష్టిలోని ఒక అంశం.

3)భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు **"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని, శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః"** (విద్యను, వినయాన్ని కలిగిన బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు ,కుక్క, ఆ కుక్క మాంసం తినేవాడు? అనే వీరిని అందరినీ పండితులు సమానంగా దర్శిస్తారు) అని అన్నాడు. వేరు వేరు రూపాలను, యోగ్యతను కలిగిన వీరిని అందరిని సమానంగా చూడడం ఏ విధంగా? అనే ప్రశ్న ఇక్కడ కలుగు తుంది. దీనిని శ్రీరామానుజులు తమ గీతాభాష్యంలో చక్కగా విశిష్టాద్వైత సిద్ధాంతానికి అనుగుణమైన రీతిలో వివరించారు.






మహాత్ములు, విద్వాంసులు కూడా విష్ణుని ఆజ్ఞలకు అణిగిమణిగి ఉంటారు

**"జ్ఞానైకాకారతయా సర్వత్ర సమదర్శినః, విషయాకారస్తు ప్రకృతేః, నాత్మనః, ఆత్మా సర్వత్ర జ్ఞానైకాకారతయా సమ ఇతి పశ్యంతి ఇత్యర్థః"** (విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుడు, గోవు మొదలైన వీరందరూ జ్ఞానాన్ని స్వరూపంగా కలిగినవారు కనుక వీరిని అందరినీ జ్ఞానులు సమంగా భావిస్తారు. బయట కనిపించే వీరి ఆకారంలోని భేదం ప్రకృతి వల్ల ఏర్పడింది, అంతే తప్ప, ఆత్మ స్వరూపంలోని తేడా వల్ల కాదు. ఆత్మలు అన్నీ జ్ఞానాన్ని ఆకారంగా కలిగి ఉన్నందున సమానమైనవి? అని భావం) అనే వివరణతో ఈ ప్రశ్నకు సమాధానం పలికారు. ఈ విధంగా ఆత్మలన్నిటి స్వరూపం సమానమైనదని పలకడం కూడా సమతావాదమే కదా.

4)"మా" అంటే 'లక్ష్మి'. **"ఇందిరా లోకమాతా మా"** అని అమరకోశం ఈ శబ్దాన్ని లక్ష్మీవాచకంగా పలికింది. **"మయా సహితః సమః"** (మా అనబడే లక్ష్మితో కూడిన నారాయణుడు సముడు అనబడుతున్నాడు.) అనే విధంగా సమశబ్దం లక్ష్మితో ఎల్లప్పుడు కలసి ఉండే భగవంతుని తెలియజేస్తుంది.

అందువల్ల సమతా వాదం అంటే? లక్ష్మితో కూడుకొన్న నారాయణుడే పరతత్వం అనే వాదం. వేదం **"హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ"** (భూదేవి, లక్ష్మీదేవి నీకు పత్నులు) అని లక్ష్మీ నారాయణుల నిత్యసంబంధాన్ని కీర్తించింది. ఈ నారాయణుడే **"నారాయణః పరంబ్రహ్మ తత్వం నారాయణః పరః"** అని పరతత్వంగా పేర్కొన్నది.




## వైకుంఠపాళి
### :: 76 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | | 2 దే | వ | 3 వ | ర్ణి | 4 ని | | 5 ధా |
| తి | | వి | | సు | | షా | | త్రే |
| 6 కా | శ్య | | 7 సు | దే | వి | | 8 వే | యి |
| యు | | 9 య | | వ | | 10 త్రి | | క |
| డు | | 10 ము | ని | | 11 రా | గ | ము | |
| | | న | | 12 మా | | ర్త | | 13 మో |
| 14 మా | య | | 15 మా | లి | ని | | 16 అ | హి |
| రి | | 17 ఆం | | ని | | 18 రా | | ని |
| ష | | 19 గి | రి | | 20 రా | ధ | | |

ఈ వైదికమైన సిద్ధాంతాన్ని దివ్యసూరులు కూడా తమ దివ్యప్రబంధాలలో పేర్కొన్నారు. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళి ప్రబంధంలో **"నాళు నమ్ తిరువుడై యడికళ్ తమ్మలమ్ కళల్ వణంగి"** (నిత్యం మనం లక్ష్మితో కూడుకొని ఉండే శ్రీమన్నారాయణుని భోగ్యమైన శ్రీచరణాలను నమస్కరించి) అని ఈ సిద్ధాంతాన్ని స్పష్టం చేశారు.

దీనిని భగవద్రామానుజులు శ్రీభాష్యం, వేదార్థ సంగ్రహం, గీతాభాష్యం మొదలైన గ్రంథాలలో పలుచోట్ల విశదం చేశారు. ఈ విధంగా సమతావాదాన్ని ఈ కోణంలో కూడా దర్శించవచ్చు.

## హృషీకేశ్, నారాయణవనం శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవం

2022, మే 12 నుండి 21 వరకు




| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 12-05-22 | గురు | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 13-05-22 | శుక్ర | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 14-05-22 | శని | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 15-05-22 | ఆది | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 16-05-22 | సోమ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 17-05-22 | మంగళ | పల్లకిలో.. మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 18-05-22 | బుధ | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 19-05-22 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 20-05-22 | శుక్ర | రథోత్సవం | అశ్వవాహనం |
| 21-05-22 | శని | పల్లకీఉత్సవం, తీర్థవారి, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చిఉత్సవం, ధ్వజావరోహణం ద్వాదశారాధానం, ఏకాంతసేవ |

## కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం

2022, మే 22 నుండి 31 వరకు


| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 22-05-22 | ఆది | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 23-05-22 | సోమ | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 24-05-22 | మంగళ | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 25-05-22 | బుధ | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 26-05-22 | గురు | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 27-05-22 | శుక్ర | పల్లకిలో.. మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 28-05-22 | శని | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 29-05-22 | ఆది | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 30-05-22 | సోమ | రథోత్సవం | అశ్వవాహనం |
| 31-05-22 | మంగళ | పల్లకీఉత్సవం, తీర్థవారి, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



# తిరుమలక్షేత్రంలో 'హనుమద్వైభవం'

– శ్రీ ఇటుగుళ్లపాటి హర్షవర్ధన్ రావు

కలియుగవైకుంఠంగా విరాజిల్లుతూ ఉన్నది తిరుమలఏడుకొండల క్షేత్రం. సప్తగిరుల్లో ఒకటి అంజనాద్రి. వానరప్రముఖుడు కేసరిని వివాహం చేసుకున్న అంజనాదేవి ఆకాశగంగ దగ్గర తపస్సు చేయగా హనుమంతుడు జన్మించాడు. అంజనాదేవి తపస్సు చేసిన, హనుమంతుడు జన్మించిన కొండే అంజనాద్రి. ఈవిధంగా తన జన్మస్థలమైన తిరుమలక్షేత్రంలో వైభవంగా విరాజిల్లుతూ ఉన్న శ్రీఆంజనేయస్వామి గురించి పదకవితా పితామహుడు అన్నమయ్య అనేక కీర్తనలను రచించారు. అందులో 'పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు' అనే కీర్తన స్వామి వారు ఇక్కడే జన్మించి... పెరిగి పెద్దవాడు అయ్యాడు అనేవిధంగా రాశాడనే భావన కలుగుతుంది. అటువంటి అంజనాద్రి ఉన్న తిరుమలలో శ్రీహనుమంతుడు వివిధరూపాలలో కొలువుదీరి పూజలందు కుంటూ దర్శనమిస్తాడు.



## శ్రీబేడీఆంజనేయస్వామి

తిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న సన్నిధి వీధిలో స్వామివారి ఆలయానికి అభిముఖంగా ఉన్న ఆలయమే – శ్రీబేడిఆంజనేయ స్వామివారి ఆలయం.

అంజనాద్రిపై ఆంజనేయుడు అల్లరిగా తిరుగుతూ అందరినీ భయాందోళనలకు గురిచేస్తూ ఉండటంతో ఆంజనేయ స్వామి తల్లి అయిన అంజనాదేవి కాళ్ళకు, చేతులకు బేడీలు తగిలించి ఎక్కడికీ కదలకుండా శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఎదురుగా నిలబెట్టినట్లు కథనం. ఈ స్వామివారి కాళ్ళకు చేతు లకు బేడీలు తగిలించినట్లుగా ఉండటం వల్ల స్వామివారికి 'శ్రీబేడీఆంజనేయస్వామి' అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది. అంతేకాకుండా 19వ శతాబ్దంలో తిరుమల పాలనను నిర్వహించిన మహంతులవల్ల శ్రీబేడీ ఆంజనేయ స్వామి సంప్రదాయం ఉత్తరదేశం నుంచి ప్రవేశించినట్లు కూడా చెప్పబడుతూ ఉంది. స్వామివారి ఆలయం పశ్చిమాభిముఖంగా ముఖమండపం, గర్భాలయాలను కలిగి, ఆలయంచుట్టూ ప్రదక్షిణ మండపం నిర్మింపబడి ఉంది. గర్భాలయంలో సుమారు 6 అడుగుల ఎత్తు ఉన్న శ్రీఆంజనేయస్వామివారు కొలువుదీరి పూజలందుకొంటూ దర్శనమిస్తారు.


ప్రతిరోజూ మూడుపూటలా పూజలు, నివేదనలు జరిగే శ్రీబేడీఆంజనేయస్వామివారికి ప్రతి ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో పంచామృతాభిషేకం జరుగుతుంది. అభిషేక ద్రవ్యాలను భక్తులు సమర్పించవచ్చు. భక్తులందరూ ఈ అభిషేక కార్యక్రమాన్ని దర్శించుకోవచ్చు. ప్రతినెలా పునర్వసు నక్షత్రంనాడు శ్రీసీతారామలక్ష్మణులు ఊరేగింపుగా ఈ ఆలయా నికి విచ్చేసి హారతిని అందుకొంటారు. శ్రీరాములవారి మెడలోని పుష్పమాలను శ్రీఆంజనేయస్వామివారికి వేస్తారు. అంతేకాకుండా బ్రహ్మోత్సవాలసమయంలో రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి లేదా ఇతరమంత్రులు శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టువస్త్రా లను ఈ ఆలయంనుంచే ఊరేగింపుగా తీసుకువెళ్ళడం ఆచారం.

## శ్రీకోనేటిగట్టు ఆంజనేయస్వామి

తిరుమలలో స్వామివారి పుష్కరిణికి ఈశాన్యమూలలో అంటే శ్రీవరాహస్వామివారి ఆలయానికి ఎదురుగా 'శ్రీకోనేటి గట్టు ఆంజనేయస్వామి' ఆలయం ఉంది. కోనేటిగట్టు మీద ఉండడం వల్ల ఈ స్వామికి ఆ పేరు వచ్చినట్లు తెలుస్తోంది. పశ్చిమాభిముఖంగా ఉన్న ఈ ఆలయంలో నమస్కారభంగిమలో స్వామివారు దర్శనమిస్తారు. 16వ శతాబ్దంలో శ్రీఆంజనేయ స్వామివారిని వ్యాసరాయలు ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

## శ్రీజాబాలిఆంజనేయస్వామి

కలియుగ వైకుంఠం అయిన తిరుమలక్షేత్రంలో తిరుమలకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో 'జాబాలి' క్షేత్రం ఉంది. జాబాలి మహర్షి 'జపం' చేసిన స్థలం కనుక



'జాబాలి' అనే పేరు ఏర్పడి కాలక్రమంలో 'జాపాలి'గా మారినట్లు ప్రతీతి. ఇప్పటికీ ఈ క్షేత్రం జాపాలి, జాబాలి అనే పేర్లతో వ్యవహరింపబడుతూ ఉంది. జాబాలిమహర్షి జపంవల్ల స్వయంభువుగా కొలువుదీరిన స్వామివారు కనుక శ్రీ జాబాలి ఆంజనేయస్వామి అనే పేరు ఏర్పడింది.

స్థలపురాణం పరిశీలిస్తే– పూర్వం జాబాలిమహర్షి శ్రీఆంజనేయస్వామి వారిని ప్రసన్నం చేసుకోవాలని భావించి... వివిధప్రదేశాలలో పర్యటిస్తూ అనేకచోట్ల తపస్సు చేసుకుంటూ.. చివరకు వేంకటాచలమునకు చేరాడు. ఈ ప్రాంతం చాలా మహిమాన్వితమైనదిగా గుర్తించిన మహర్షి ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని నిత్యం జపం, హోమం చేయసాగాడు. ఈ విధంగా కొంతకాలం తపస్సు చేసిన అనంతరం తపస్సుకు మెచ్చి శ్రీఆంజనేయస్వామి ప్రత్యక్షం కాగా, మహర్షి పరిపరి విధాలుగా ప్రార్థించి ఇక్కడనే కొలువుదీరమని కోరాడు. మహర్షి కోరికను మన్నించి శ్రీఆంజనేయస్వామివారు స్వయంభువుగా కొలువుదీరినట్లు స్థలపురాణ కథనం. కాగా, శ్రీరామచంద్ర మూర్తి వానరసైన్యం సహకారంతో లంకారాజ్యంపై దండెత్తి రావణాసురుడిని ఓడించి సీతాదేవిని వెంటబెట్టుకుని అయోధ్యకు వెళ్తూ మార్గమధ్యలో జాబాలికి చేరుకుని కొంతకాలం ఉండినట్టు చెప్పబడుతూ ఉంది. ఈ సమయంలో శ్రీరాముడు స్నానం చేసిన తీర్థానికి 'శ్రీరామతీర్థం' అనీ, సీతాదేవి స్నానమాచరించిన తీర్థానికి 'సీతాతీర్థం' అనే పేర్లు ఏర్పడినట్లు కథనం.


శ్రీజాబాలిఆంజనేయస్వామివారి ఆలయం ఉత్తర భారతదేశ నిర్మాణశైలిలో ఉత్తరాభిముఖంగా ఉంది. ఆలయం వెలుపల వేపచెట్టు ఉంది. ఈ చెట్టు మొదలు వద్ద వినాయకుడి రూపం సహజసిద్ధంగా ఏర్పడింది. ప్రధాన ఆలయం ముఖ మండపం, ప్రదక్షిణమండపం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధానగర్భాలయంలో స్వయంభువుగా కొలువుదీరిన శ్రీఆంజనేయస్వామి అభయహస్తం ధరించి, మరో చేతిలో గదను ధరించి కొలువుదీరి దర్శనమిస్తూ ఉన్నాడు. స్వామివారికి వెండి కవచంను ఉంచి పూజలు నిర్వహిస్తారు.

చారిత్రకంగా పరిశీలిస్తే పూర్వం ఢిల్లీకి దగ్గరలోని రామానంద ఆశ్రమ పీఠాధిపతి అయిన అభయానందజీ శిష్యుడైన బావాజీ తిరుమలకు చేరాడు. ఆయనకే 'హథీరాంజీ' అని పేరు. ఆయన జాబాలి చేరుకుని ఇక్కడ తపస్సు చేయడంతోపాటూ ఇక్కడ చిన్నఆలయాన్ని నిర్మింపజేసినట్లు చరిత్ర చెబుతోంది. హథీరాంజీమఠం (రాష్ట్ర దేవాదాయశాఖ) ఆధ్వర్యంలోనే ఆలయం నడుస్తూ ఉంది. ఇటీవలి కాలంలో ఆలయంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలు జరిగి నూతనంగా ఆలయాన్ని నిర్మింపజేశారు.

జాబాలి శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం ప్రతిరోజూ ఉదయం ఆరుగంటలనుంచి రాత్రి ఏడుగంటల వరకు తెరచి ఉంటుంది. తిరుమలక్షేత్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పాపవినాశనం వెళ్లే దారిలో ఉంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు జీపులు, టాక్సీలలో తిరుమలనుంచి జాబాలికి వెళ్లవచ్చు. తిరుమల నుంచి పాపవినాశనంకు ఆర్టీసివారు బస్సులు నడుపుతూ ఉన్నారు. ఈ మార్గంలో శ్రీవేణుగోపాలస్వామిఆలయం, జాబాలి, ఆకాశగంగ, పాపవినాశనంలను దర్శించి తిరిగి తిరుమలకు ఈ బస్సులో చేరుకోవచ్చు. శ్రీవేణుగోపాలస్వామి వారి ఆలయం తర్వాత 'జాబాలి' బస్‌స్టాపు ఉంది. ఇక్కడి నుంచి సోపాన మార్గంలో సుమారు ఒక కిలోమీటరు దూరంలో జాబాలి ఆలయం ఉంది.

'జై శ్రీరామ్'

# తిరుమలేశుడి భక్తురాలు... తరిగణమ్మ!



– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

ఇప్పుడు చెబుతుండేది మున్నూరు ఏండ్ల కిందటిమాట!

తిరుమల కొండపైన ఒక భక్తురాలు ఉండేది. ఆమె ఊరేదో ఎవరికీ తెలియదు. ఆమె ఎక్కణ్ణుంచి వచ్చిందో తెలియదు. పేరు కూడా అస్సలు తెలియదు. తెలియకపోతే ఏం? తిరుమల కొండలోని వాళ్లందరూ ఆమెకు ఒక పేరు పెట్టుకున్నారు. **"అమ్మోరు"** అనీ **"అమ్మోరమ్మ"** అని. అట్లాగే పిలిచేవారు కూడ. వాళ్లందరి పిలుపులకు తగ్గట్లుగానే ఆమె రూపురేఖలు కూడా అట్లాగే ఉండేవి.

ఆయమ్మ పొడగరీ కాదు. అట్లని అంత పొట్టీ కాదు. లావూ కాదు. సన్నమూ కాదు. పసుపుపచ్చని నిమ్మకాయలాంటి దేహఛాయ. శరీరం నిండా కప్పుకున్నట్లుగా కట్టుకున్న పెద్దంచు ముతక చీరా రవిక. రెండు చేతులనిండా ఆకుపచ్చని మట్టి గాజులు. పసుపు పూసుకున్న పచ్చటి మొగాన రూపాయి బిళ్లంత గుండ్రని కుంకుమబొట్టు. కళ్లకు నల్లనికాటుక. చెవులకు కమ్మలు. ముక్కున వేలాడుతున్న ముక్కెర. నల్లని కొప్పులో నిండుగా పెట్టుకొన్న మల్లెపూలు. కాలివేళ్లకు మట్టెలు, భుజాల మీదుగా కప్పుకున్న చీరకొంగు, చెరగని చిరుమందహాసంతో వేంకటేశులస్వామి గుడిచుట్టూ తిరుగుతూనో, ఒక్కొక్కసారి గుళ్లో కూర్చొని కళ్లుమూసికొని ధ్యానం చేస్తూనో, జపం చేస్తూనో అగపడేది అమ్మోరమ్మ!

తిరుమల కొండలో ఇలాంటివాళ్లకు కొదువే లేదు. ఈ మాదిరి యోగులు, యోగినులు, సాధువులు, సన్యాసులు ఇక్కడ కనపడడం కొత్తేమీ కాదు. అడపాదడపా తారసపడుతూనే ఉంటారు. కానీ..! కానీ..!!

పట్టుమని రెండు పదులు అంటే ఇరవై ఏండ్లయినా నిండని ఆడపడుచు, వెంట ఎవరూ లేకుండా, అచ్చంగా అమ్మవారిలాగే నవ్వు మొగంతో ఉండడమే గాక, ఆమెను మళ్లా మళ్లా చూడాలనీ, దగ్గరికెళ్లి ఆమెతో మాట్లాడలనీ, ఆమె రెండు కాళ్లను తాకుతూ మొక్కుకోవాలన్న బుద్ధి, ఆమెను చూచిన వాళ్లం దరికీ పుట్టడం చాల విచిత్రంగా ఉంది. వింతగాను ఉంది. కొందరయితే వంగిదండాలు పెట్టడం కూడా ఆశ్చర్యంగా ఉంది. ఏ దేవతో, ఏ దేవుడో ఈ రూపంలో వచ్చారేమో!

అమ్మోరమ్మ ప్రతిరోజూ ఆనందనిలయుని దర్శనం చేసుకుంటూనో, ప్రసాదం తీసుకుంటూనో, యోగనరసింహ స్వామి మండపం దగ్గర కూర్చొని ఆనందనిలయ గోపురాన్ని చూస్తూ ధ్యానం చేస్తూనో కనిపించేది. ఇదీ ఆమె నిత్యకృత్యం. ఇలా చాన్నాళ్లు గడిచాయి.

ఒకనా దేమయిందంటే, ఇద్దరు ముసలివాండ్లు కొండకు వచ్చారు. వాళ్లిద్దరూ ఈ **'అమ్మోరి'**ని చూసి గట్టిగా కావలించు కొని 'అమ్మా! వెంగమ్మా! ఈడ ఉన్నావా తల్లీ! రావే మనూరికి పోదాం రావే తల్లీ!' అంటూ బావురుమని గట్టిగా ఏడ్చినారు.

అది చూసిన వాళ్లందరి గుండెలు కరిగి నీరయ్యాయి. "నేను రానంటే రాను, నాకు తల్లీ దండ్రీ, దైవమూ అన్నీ ఏడుకొండల వాడే! నేను ఈ కొండను దిగి రానుగాక రాను" అంటూ నిక్కచ్చిగా వాళ్లిద్దరితో పలికింది అమ్మోరమ్మ!

ఇదిగో! ఆ ముసలోళ్లిద్దరూ అమ్మోరమ్మ తల్లీ దండ్రీ అనీ, ఆమె అసలు పేరు 'వెంగమ్మ' అనీ, వాళ్ల ఊరు దిగువ తిరుపతికి దగ్గర్లోని 'వాయల్పాడు' గ్రామానికి పక్కనే ఉన్న పల్లె **'తరిగొండ'** అని తెలిసింది.

అప్పట్నుంచే **'అమ్మోరు'** అనీ, **'తరిగొండమ్మ'** అనీ, **'వెంగమ్మ'** అనీ అమ్మోరమ్మకు పేర్లు ఏర్పడ్డాయి. అయినా కొండమీద ఉండే జనం మాత్రం **'వెంగమ్మ'** అని పేరు పెట్టి పిలవడానికి జంకేవాళ్లు. ఇష్టంగా ప్రీతిగా 'తరిగొండమ్మ' అని పిలిచేవాళ్లు. అదే వాండ్లనోటి ఉచ్చారణ వేగానికి **'తరిగణమ్మ'**గా మారి ఆ పేరే స్థిరమయింది ఈ అమ్మోరమ్మకి.

కాని, అర్చకులు, జియ్యంగార్లు, ఆలయ అధికార్లు మాత్రం ఈ భక్తురాలిని **'వెంగమ్మ!'** అంటూ నోరారా పిలుస్తూ

ఆదరించేవాళ్లు. ఆమె ఎప్పుడొచ్చినా, ఏ వేళ వచ్చినా, స్వామి దర్శనానికి అడ్డు చెప్పే వాళ్లు కాదు. పైగా ఆమెకు దండిగా ప్రసాదాలు కూడా పెట్టించేవాళ్లు. కాని, దర్శనం, ధ్యానాదుల్లో మునిగినందువల్లో ఏమో, ఒక్కొక్కరోజున వేళ దాటి పోయినందు వల్ల ఆమెకు ప్రసాదం దొరికేది కాదు. అలాంటి వేళల్లో ఆ భక్తురాలికి ఏకాదశీ ఉపవాసమే అయ్యేది.

ఉండడానికి ఇంత చోటు లేక, తినడానికి సరైన ఆహారం లేక ఎన్నో ఇబ్బందులకు తాళలేక పొయ్యేది తరిగణమ్మ.

ఒకనాటి రాత్రి గుడి మూసిన తర్వాత జడివానలో తడిసి ముద్దై, గుడికి ఎదురుగా ఉన్న వేయికాళ్లమండపానికి చేరుకొంది తరిగొండమ్మ.

సుమారు 20 ఏండ్ల కిందటి వరకు ఈ వేయి స్తంభాల మండపం గుడికి ఎదురుగా, నాదనీరాజనమండపం, ఊంజల్ సేవ మండపాల ముందుభాగంలో ఉండేది. అది శిథిలమై అందులోని స్తంభాలు కూలిపోతుండగా, భక్తుల సౌకర్యం కోసం ఆ మండపం పూర్తి తొలగింపబడింది.

ఆ వేయికాళ్ల (స్తంభాల) మండపంలో కూర్చొని దీర్ఘంగా ధ్యానిస్తూ "స్వామీ! ఏడుకొండలవాడా! ఇక్కడే, ఈ కొండపైనే ఉండడానికి ఇంత చోటు చూపించడంతో పాటు, రోజుకింత ప్రసాదాన్ని పెట్టించు స్వామీ!" అంటూ వేడికొంటూ అట్లానే నిద్రలోకి జారుకొంది తరిగణమ్మ.

వెంటనే వేంకటేశ్వరస్వామి కలలోకి వచ్చాడు, "అమ్మా నాగుండె మీద పదిలంగా ఉన్న **'వ్యూహ లక్ష్మి'**ని అడుగు నీకు ఏర్పాటు చేస్తుందన్నాడు" స్వామి, అంతే కలకరిగిపోయింది. ఇంకెందు కాలన్యం అన్నట్లు వెంగమ్మ ఆనందనిలయునితో పాటు, అలవేలుమంగమ్మను ప్రార్థించింది.


ఇంకేముంది? వేయికాళ్ల మండపానికి పక్కనేఉన్న మహంతు మఠంలో నిద్రపోతున్న **'ఆత్మారాం దాసు'**అనే మహంతు ఉలిక్కిపడుతూ లేచాడు. ఎదురుగ్గా బంగారు గోపురం 'ఆనందనిలయం' కనబడింది. వెంటనే ఆలయం అధికారులకు ఇలా చెప్పాడు.

"స్వామి ఆదేశించాడు. భక్తురాలైన వెంగమ్మకు ఉండడానికి ఇంతచోటూ, ప్రతిదినం తగినంత వంట దినుసులు ఏర్పాటు చెయ్యమని!"

వేంకటేశ్వరస్వామితో పాచికలాడిన హథీరాం బావాజీకి శిష్యుడూ, వారసుడూ, పరమభక్తుడైన 'ఆత్మారాం దాసు' చెప్పిన మాటను సాక్షాత్తు స్వామివారి ఆజ్ఞగా ఆలయ అధికారులు పాటించారు.

ప్రస్తుతం **'మాతృశ్రీతరిగొండవెంగమాంబ అన్నప్రసాద భవనం'** ఉన్న స్థలంలోనే, ఆనాటి అధికారులు అక్కడ ఉన్న చెట్లుచేమలను తొలగించి, ఒక కుటీరాన్ని నిర్మింపజేసి ఇవ్వడంతో పాటు **'హారవెచ్చం'** అనే పేరుతో రోజుకు సరిపడ్డా పప్పుబియ్యం వగైరా వస్తువుల్ని వెంగమ్మకు పంపించే ఏర్పాటు చేశారు.

ఆనాటి నుంచి ఆవాస సమస్య, ఆహార సమస్య తీరిన తరిగొండ వెంగమ్మ తన కుటీరానికి దగ్గర్లోనే ఒక పూలతోటను పెంచింది. ఆ చెట్ల పెంపకానికి ఒక 'దిగుడు బావి'ని తవ్వించింది. "తరిగణమ్మ బావి"గా, "ఆమ్మోరి బావి"గా పిలువబడు తున్న ఆ బావిని నేటికీ తిరుమలలో చూడవచ్చు.



ఇక అప్పటి నుంచి తీరిక దొరికిన వెంగమ్మ ఆతోట మధ్యలోనే ఒక పెద్దబండపైన కూర్చొని శ్రీనివాసుని మీద కవితలల్లేది. పాటలు రాసి గానం చేస్తుండేది. ఆమె భక్తికి మెచ్చిన స్వామి రాత్రిపూట అక్కడికి వచ్చి ఆమె వినిపించిన కవితల్నీ, కావ్యాల్నీ వినేవాడు. స్వామి వారు సాక్షిగా వింటూ ఉండగా, ద్విపదభాగవతం, శ్రీవేంకటాచలమాహాత్మ్యం, విష్ణు పారిజాతంవంటికావ్యాల్నీ, సంకీర్తనల్నీ తరిగొండ వెంగమ్మ రచించింది.

1730 వైశాఖ మాసంలో శ్రీనరసింహ జయంతినాడు జన్మించిన వెంగమాంబ, తన రచనల్లో

**తాళ్లపాకవారి లాలి! తరిగొండవారి హారతి!!**

**తిరుమలలో ప్రతిరోజు రాత్రి చిట్టచివరగా ఏకాంత సేవలో తాళ్లపాక అన్నమయ్య వంశీయులు జోలపాటలు పాడు తుండగా, తరిగొండ వెంగమాంబ ముత్యాలహారతిని స్వామి వారికి సమర్పిస్తారు. ఆ తర్వాత శ్రీవారిఆలయం బంగారు వాకిళ్లు మూసివేస్తారు. అందువల్లే 'తాళ్లపాకవారి లాలి, తరిగొండవారి హారతి' అనే నానుడి ఏర్పడింది.**

అన్నింటిలోను తరిగొండ శ్రీనృసింహస్వామికీ, తిరుమలేశునికి అభేదం కల్పించిన మహా కవయిత్రీనీ, మహాయోగినీ, మాతృశ్రీ తరిగొండవెంగమాంబ.

ఇలాంటి తరుణంలోనే ఆమె కుటీరం శిథిలమైనందు వల్ల శ్రీవరాహస్వామి ఆలయం వెనుక ఉన్న తాళ్లపాక అన్నమయ్య వంశీయులు, తమ ఇంటిలో కొంత భాగాన్ని పరమభక్తురాలైన వెంగమ్మకు నివాసంగా ఇచ్చారు.

సరిగ్గా, ఇదే సమయంలోనే తరిగొండ నుంచి వచ్చిన యాత్రికుల వల్ల "వెంగమ్మకు బాల్యంలోనే పెళ్లి అయ్యిందనీ, భర్త గతించినా, ముత్తైదువ వస్తువులు పసుపు కుంకుమ, పూలు విడిచిపెట్టనేలేదనీ, ఆ తర్వాత వైరాగ్యంతో, శ్రీనివాసుని మీది భక్తితో తిరుమలక్షేత్రానికి చేరిందన్న" అనేక విషయాలు తిరుమల వాసులకు తెలిశాయి.

అయినా, కొందరు పరమభక్తురాలైన ఆమె ఇష్టాలకు సంబంధించినవి అంతే అంటూ, ఆమె యందు గౌరవంగానే ఉండేవారు. కాని, కొందరు మూర్ఖులు మాత్రం ఆమెను అసృహించుకొంటూ ఈసడించే వాళ్లు.

ఇవేవీ పట్టించుకోని తరిగొండ వెంగమ్మ యథావిధిగా శ్రీస్వామివారికి పూలమాలను, కర్పూరహారతిని తీసుకెళ్లేది. ఇది సహించలేని శ్రీస్వామి అర్చకులైన అక్కారాందీక్షితులు, వెంగమాంబ మొగం మీదే ఛీదరించుకొని, ఇక మీదట పూలమాలను హారతిని తేవద్దంటూ గట్టిగా మందలించాడు. వెంగమ్మ హారతులేకాక పూర్తిగా గుడికి వెళ్లడమే మానివేసింది.

ఇదంతా గమనించిన శ్రీనివాసభగవానుడు తానే వెంగమాంబ ఇంటికి వచ్చేవాడు. ఆమె చెప్పిన కవితలను కావ్యాలను వింటూ, ఆమె పెట్టిన వంటకాలను కమ్మగా తిని, హారతులందుకొనేవాడు స్వామి. ఇలా రాత్రంతా జరిగేది. తెల్లవారుజామున సుప్రభాత సమయానికి గుళ్లో ప్రత్యక్షమయ్యేవాడు.

ఒకరోజున సుప్రభాతవేళ వేళ మించిపోయినందువల్ల ఉన్న ఫళంగా స్వామి అదృశ్యమయ్యాడు. ఆ సమయంలో స్వామివారి వస్త్రం వెంగమ్మ చేతిలో ఉండి పోయింది. గుడితెరచిన అర్చకులకు స్వామివారి వస్త్రం సగం చిరిగినట్లుగా కనపడి, దొంగలు పడ్డారేమో అని శోధించినారు. కాని భక్తులతో స్వామి ఆడిన నాటకంగా తీర్మానించి, వెంగమ్మ కంటె భక్తులు ఎవరుంటారు? అని ఆమె ఇంటికి వెళ్లి స్వామివారి వస్త్రం సంగతి అడిగారు. ఆ వస్త్రం ఇదేనా! అంటూ ఆమె ఇవ్వగా ఆశ్చర్యంగా అర్చకులు దాన్ని స్వీకరించి గుళ్లో స్వామికి అలంకరించినారు.

## పుష్కరిణీజుడు

**తుంబురుతీర్థంలో వెంగమాంబ తపస్సు చేసుకుంటున్న సందర్భం అది. యాత్రికుడైన ఒక విప్రుడు భయంకరమైన కుష్టువ్యాధితో బాధపడుతూ తిరుమలకు వచ్చాడు. అన్ని చోట్లా అందరూ అతణ్ణి ఛీదరించుకోగా, 'ఆత్మహత్య' చేసుకుందామని తిరుమల కొండల్లో తిరుగుతూ 'తుంబురుకోన' చేరుకొని పెద్దగా ఏడుస్తూ బాధపడ్డాడు. వాని ఆక్రోశాన్ని విన్న 'వెంగమాంబ' వాని దగ్గరికి వచ్చి వివరాలు తెలుసుకొని, తన చూపులతోనే వాని రోగాన్ని పోగొట్టింది. ఈవిషయాన్ని ఎవరకీ చెప్పొద్దు అంటూ కళ్లుమూసుకోమనింది. వాడు కళ్లు తెరిచేటప్పటికి 'స్వామిపుష్కరిణి'లో తేలాడు. అందువల్లే అతడు 'పుష్కరిణీజుడు' అని పిలువబడ్డాడు.**



ఇంతలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై చివరి రథోత్సవం నాడు సరిగ్గా వెంగమాంబ ఇంటి ముందర రథం ఆగిపోయింది. అది ఎంత ప్రయత్నించినా కదలనందు వల్ల, ఇది వెంగమాంబ ఇంటి దగ్గరే, జరిగినందు వల్ల ఆమెను పిలిచి స్వామికి హారతులు ఇవ్వవలసిందంటూ అందరూ ప్రార్థించారు, సరేనంటూ వెంగమాంబ హారతి ఇవ్వగానే రథం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగిపోయింది.

ఇన్ని మహిమలను, లీలలను స్వామివారు చూపుతున్నా, అర్చకులు అక్కారాం దీక్షితులు, వెంగమాంబ మీద మరింత ద్వేషం

పెంచుకున్నాడు. ఒకరోజు మిట్టమధ్యాహ్నం పూట ఇంటి పెరడులో ధ్యానం చేసికొంటున్న వెంగమ్మ మీద, పక్కనే ఉన్న తన ఇంటి పెరటిలోనించి ఎంగిలి విస్తళ్లను విసిరినాడు. వెంటనే ధ్యానభంగమైన వెంగమాంబ "మహావృక్షం కూలినట్లుగా నీ వంశం నిలువుగా నశించు గాక" అని శపించింది. అంతే అక్కారాందీక్షితులతో పాటు, ఇంటిలోని అందరూ కుప్పకూలు తుండగా, మిగిలిన వాడు ఒక్కడు దేకుతూ తరిగొండ వెంగమ్మ కాళ్లమీదపడి ప్రాధేయపడినాడు, ఆమె శాంతించి "మీ వంశంలో ఒక్కొక్కడే మిగులు గాక" శాపాన్ని తగ్గించింది.

దీనితో మనస్సు వికలమైన వెంగమాంబ గుడికి పదిమైళ్లు ఉత్తరంగా అరణ్యంలో ఉన్న తుంబురు తీర్థానికి వెళ్లి కొంతకాలం తపస్సు చేసింది. కాని, ఆమె అక్కడ ఉందని తెలుసుకుని భక్తులు అక్కడికే వెళ్లేవారు. ఇక లాభం లేదని ఆమె స్వామివారిని ప్రార్థించి ఆయన ఆజ్ఞగా, భౌతికంగా, సజీవంగా బృందావనంలో ప్రవేశించాలని సంకల్పించింది.

1817 ఈశ్వర సంవత్సరం శ్రావణమాసం శుద్ధనవమి నాడు శ్రీవారి ఆలయానికి ఉత్తరదిక్కులో ఉన్న తన తోటలోనే బృందావనంలో ప్రవేశించింది పరమభక్తురాలైన తరిగొండ వెంగమ్మ. ఆనాటి నుంచి పగలంతా బృందావనంలో తపస్సు




చేసుకొంటున్న వెంగమాంబ, రాత్రి ఏకాంతసేవ అనంతరం యోగమార్గంలో ఆలయానికి వెళ్లి ఆనందనిలయుణ్ణి సేవించుకుంటున్నదని జనశ్రుతి, భక్తుల పరమవిశ్వాసం.

ప్రతిరోజు రాత్రి చివరగా శ్రీవారికి జరిగే ఏకాంత సేవలో తరిగొండవెంగమ్మ పేరుతో **"ముత్యాలహారతి"** మంగళ హారతిని సమర్పిస్తారు. ఈ హారతి తర్వాత ఆలయం తలుపులు మూసివేస్తారు. ఈ **"ముత్యాలహారతి"** సేవలోను, తరిగొండ వెంగమ్మ బృందావనం దగ్గర పూజల్లోను వెంగమాంబ వంశీయులే నేటికీ పాల్గొంటున్నారు. ప్రతి శుక్రవారం అమ్మోరి బృందావనానికి అభిషేకార్చనలు తిరుమల ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

## అన్నప్రసాదవితరణం!

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రతి సంవత్సరం, బ్రహ్మోత్సవాల్లోను, శ్రీనృసింహజయంతి ఉత్సవాల్లోను అన్నప్రసాద వితరణ చేసేవారు. ఆమె చేసిన భక్తజన సేవకు గుర్తుగా తిరుమల తిరుపతి దేవస్థానంవారు ***"మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదభవనం"*** అద్భుతంగా నిర్మించి నిరంతరం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు.

## ధ్యానమందిరం

'వెంగమాంబ బృందావనం' చుట్టూరా, చక్కని పూల తోటను, ధ్యానమందిరాన్ని నిర్మించడానికి దేవస్థానం వారు ప్రయత్నిస్తున్నారు.

ఇలా తిరుమలేశుని పరమభక్తురాలిగా, యోగినిగా మహాకవయిత్రిగా, అన్నదాతగా పేరొందిన వెంగమ్మను, తర్వాతి తర్వాతి ప్రజలు "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ" అని భక్తి ప్రపత్తులతో పిలుస్తూ కీర్తిస్తూ పూజిస్తున్నారు.

సుమారు తొంభైఏండ్లపాటు తిరుమలలో భౌతికంగా నడయాడిన **"అమ్మోరమ్మ"**, **"తరిగొండమ్మ"**, **"తరిగణమ్మ"** అయిన పరమయోగిని "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ" తిరుమల శ్రీవారి ఆలయంలో రాత్రి చివరగా నిర్వహింపబడు తున్న "ముత్యాలహారతి" వల్లా, ఆమె పేరుతో వెలసి "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనం"లో అన్న ప్రసాద వితరణ వల్లా, ఆమె రచించిన రచనలవల్లా తరతరాల తిరుమల చరిత్రలో చిరంజీవియై వర్ధిల్లుతుందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

*ఓం నమో వేంకటేశాయ.*

# పరశురాముడు

- శ్రీ అప్పురుసు రమాకాంతరావు

భార్గవరాముణ్ణే పరశురాముడనీ అంటారు. పరశువు అంటే గొడ్డలి. దీన్నే ఆయుధంగా చేసుకొని శత్రు సంహారం చేశాడు భార్గవరాముడు. భృగువంశానికి చెందిన వాడు కనుక ఈయనకు భార్గవరాముడనీ పేరు. మహాభారతం లోని ఆదిపర్వంలో వివరించినట్లు భృగువంశంవారైన చ్యవనుడు, ఔర్వ, రిషిక, జమదగ్ని తరువాతివాడు పరశురాముడు.

కుశ వంశానికి చెందిన మహారాజు గాధి. ఒకసారి భృగువంశానికి చెందిన ఋచీకుడు అనే మహర్షి గాధి దగ్గరికి వెళ్ళి ఆయన కూతురు సత్యవతిని తనకిచ్చి వివాహం చెయ్యమని కోరగా, ఆ మహారాజు నున్నటి శరీరం, నల్లటి చెవులు గల వెయ్యిగుఱ్ఱాలు ఇమ్మని కోరుతాడు. ఋచీకుడు వరుణుని ప్రార్థించి వెయ్యి గుఱ్ఱాలు తెచ్చి ఇచ్చి సత్యవతిని పెళ్ళి చేసు కొన్నాడు.

ఒక రోజు సత్యవతి ఋచీకుని దగ్గరకువచ్చి తనకు, తన తల్లికి పుత్ర సంతానం ప్రసాదించమని కోరగా ఋచీకుడు యాగంచేసి, విప్రమంత్రపూతం అయిన ఒక హవిస్సు, రాజ మంత్రపూతం అయిన మరో హవిస్సు తయారుచేసి స్నానానికి వెళతాడు. సత్యవతి ఈ విషయం తెలియక రాజమంత్రపూత మైన హవిస్సు తను తీసుకొని, విప్రమంత్రపూతమైన హవిస్సు తల్లికి ఇస్తుంది. ఋచీకునికి సత్యవతి విషయంతెలిపి ప్రాధేయ పడగా, తన కొడుకు సాత్వికుడిగ ఉండి, మనుమడు ఉగ్రుడు అవుతాడు అని పల్కుతాడు. ఋచీకుని కుమారుడు జమదగ్ని. జమదగ్ని రేణుకాదేవికి కొడుకుగా పురుషోత్తమాంశతో జన్మించిన వాడు పరశురాముడు. భార్గవరాముడు శివునివద్ద అస్త్రవిద్యలను అభ్యసించి, అజేయ పరాక్రమవంతుడై, ఆయన నుండి అఖండ పరశువు (గండ్రగొడ్డలిని) పొంది, పరశురాముడైనాడు.

పరశురాముడు దత్తాత్రేయునివద్ద శిష్యునిగాచేరి అనేక విద్యలను నేర్చుకొన్నాడు. ఈ అంశాలు స్కాందపురాణంలో వివ రించారు. పరశురాముడు పూర్ణావతారముకాదనీ, అవశేషా వతారమనీ అంటారు. కనుక పరశురాముని స్తోత్రాలూ, మంది రాలూ చాలాతక్కువ.

కేరళలో తిరువనంతపురం దగ్గర, తిరువళ్ళంలో కరమణ నది ఒడ్డున ఒక పురాతనమైన పరశురామమందిరం ఉంది. ఇది 12వేల సంవత్సరాలనాటిదంటారు. ఇక్కడ పిత్రు దేవతలను పూజించడం ఆచారం. స్కాందపురాణంలో ఈ విషయం తెలుస్తుంది. కంచర్లగోపన్న రచించిన రామదాసు శతకంలో **"ఇరువదియొక్క మాఱు ధరణీ శులనెల్ల వధించి"** అని 21మార్లు భూమిపై ఉన్న రాజులను సంహరించాడు.

ప్రపంచంలోని భూభాగాన్నంతా దానం చేసి, తన తల్లి జ్ఞాపకార్థం ఇకపై సమరాలు చేయనని తన గండ్రగొడ్డలిని సముద్రంలోకి విసిరేశాడు పరశురాముడు. ఆ ఆయుధంపైన గౌరవం కొద్దీ సముద్రుడు వెనక్కితగ్గి విడిచిపెట్టిన భూభాగాన్నే 'పరశురామక్షేత్రాలు' అన్నారు.

జయదేవుడు రాసిన దశావతారాల స్తుతిలో- *'క్షత్రియ రుధిర మయే జగదపగతపాపమ్। .......... కేశవ! ధృత భృగుపతి రూప!'* అని ప్రార్థించాడు జయదేవుడు.



రామాయణంలో పరశురాముడు మనకు తొలిసారి సీతా స్వయంవరంలో కనిపిస్తాడు. శ్రీరాముడు శివధనుస్సును విరచిన తరువాత సీతారాముల కల్యాణం జరిగింది. తన గురువైన శివునివిల్లు విరచినందుకు పరుశురాముడు కోపించి, రామునిపై యుద్ధానికి సిద్ధపడ్డాడు. దశరథుని అభ్యర్థనలను, రాముని శాంతవచనాలనూ పట్టించుకొనలేదు. చేతనైతే ఈ విష్ణుచాపాన్ని ఎక్కుపెట్టమని తనధనస్సును రామునకిచ్చాడు. రాముడు దానిని అవలీలగా ఎక్కుపెట్టాడు.



రామచంద్రమూర్తి ఎక్కుపెట్టిన బాణాన్ని ఎక్కడకు విడవాలి అని అడుగగా తన తపోశక్తిని కొట్టమని చెప్పి, తాను మహేంద్రగిరిపై తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. ఆ విధంగా ధనస్సును పరశురాముడు రామునకు అందించినపుడు పరశురామునికీ రామునికి భేదంలేదని ఇద్దరికీ అవగతమయింది.

మహాభారతంలో పరశురాముడు ముగ్గురువీరులకు గురువైనాడు. 1)గంగాదేవి అభ్యర్థనపై భీష్మునకు అస్త్రవిద్యలు బోధించాడు. 2)కర్ణుడు కూడా పరశురాముని వద్ద శిష్యునిగా చేరాడు. 3)ద్రోణాచార్యుడు కూడా పరశురాముని వద్ద దివ్యాస్త్రాలను గ్రహించాడు. అర్జునుడుకూడా మహేంద్రపర్వతంపై పరశురాముని దర్శించుకొన్నాడు.

మన అష్టాదశాపురాణాల్లో సప్తచిరంజీవులు **అశ్వత్థామ, బలి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపుడు, పరశురాముడు**గా చెబుతుంటారు. వీరిని నిత్యం స్మరించేవారు ఎటువంటి రోగాలు లేకుండా, నూరేండ్లు జీవిస్తారు.

# శ్రీకృష్ణామృతం




**నిరాగ! నీరాగ!**
**నిశ్చల! నిశ్చయ!**
**నిర్గుణ! నిరాకార!**
**నిర్నిమేశ! నిఖిలలోకేశా!**

**నిర్జీవమౌ ఆత్మను, నీయాజ్ఞగా సృష్టిచేసి**
**నీరవమౌ దేహమున, నీవె ప్రవేశింపజేసి**

**నిముష నిముషమున, నిరవధిక బంధములద్రోసి!**
**నిషిద్ధ మార్గముల త్రిప్పి, నిరుత్తర సమస్యల పడవేసి!**

**నిస్త్రాణ, నిర్వీర్య, నెలవులందునను**
**నిగ్రహము వీడునేమోయని నొచ్చు నంతనే,**

**నిర్ద్వంద్వమౌ భక్తి నీవె ప్రసాదించి**
**నిర్వృత్తి చేయవే కష్టములు, నిముషముననే**

**నియమమెఱగని నా నివేదనలను గాంచి**
**నిక్కముగ నిధానమై నిలచి నన్నాపదలబ్రోచి**

**నిమిత్తమౌ జన్మకు నిష్కృతి నొసగవె నీవు**
**నిత్య నిదర్శనము నాకు నీ అనుగ్రహామృతము**

*– "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు)*


'తల్లి'ని మించిన దైవం లేదు, 'గాయత్రి' ని మించిన మంత్రం లేదు

శ్రీవేంకటేశ్వరలీలలు




# భక్తసులభుడు

- శ్రీ భీమవరపు శ్రీహరిరావు

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆర్తత్రాణ పరాయణుడు, దీనజనబాంధవుడు, కలియుగ ప్రత్యక్షదైవము శ్రీవేంకటేశ్వరస్వామివారి లీలలు ఎన్నో! మా జీవితంలో ఏ చిన్న కష్టమైనా స్వామికి విన్నవించితే అవి దూది పిందెలవలె తొలగిపోయేవి. ఇటీవల జరిగిన ఒక నా అనుభవాన్ని మీకు తెలుపుతున్నాను.

కొన్ని సంవత్సరాల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానములవారు శ్రీవారిసేవకుల కొఱకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించారు. నా బంధువర్గములోని ఒక 10మందితో పేర్లు నమోదు చేసుకొన్నాం. తీరా దేవస్థానమువారు సేవ కొరకు రమ్మని లేఖ ద్వారా తెలిపినపుడు, అందరూ ఏదో ఒక సాకుతో రాలేమన్నారు. ఇక నేనొక్కణ్ణే వెళితే బాగుండదు అని నేను కూడా సేవకు వెళ్లలేదు.

కాని నామనసులో స్వామివారి సేవలో పాల్గొన లేక పోయాను అనే బాధ ఎప్పుడూ మెదుల్తూ ఉండేది. తిరుమల వెళ్లినప్పుడల్లా శ్రీవారి సేవకులను చూచి వారిలాగా ఏ చిన్ని పని అప్పగించినా చేసి ఉందును కదా! చేయలేకపోయానని బాధపడుతూ ఉండేవాణ్ణి. ఒక మిత్రుని సాయంతో పేరు నమోదు చేసుకొని ఎలాగో శ్రీవారి సేవకు ఒకసారి వెళ్లాను. అక్కడ ఉన్న దేవస్థాన ఉద్యోగి నా వివరాలు చూచి, నీ వయస్సు 65 సంII దాటినందున నీవు శ్రీవారి సేవకు అనర్హుడవని వెనుకకు తిరిగి వెళ్లమని, నీవు చేయదల్చినసేవ మీ ఊళ్లోనే చేసుకోమని సూచించారు కూడా. ఎంతో మనోవేదనతో వెనక్కు తిరిగి వచ్చాను. నా మిత్రుని మాత్రం సేవకు అంగీకరించారు.



మా ఇంట్లో ఏ సందర్భం వచ్చినా, నేను సేవకు వెళ్లలేక పోయినానని, నా మనోవ్యథను తెలిపేవాడని. ఒకసారి మాటల సందర్భంలో నా కుమారునితో 'నీ వయస్సు శ్రీవారిసేవకునిగా సరి పోతుంది కనుక ప్రయత్నించమని' చెప్పాను.

నా కుమారుడుకూడా తాను శ్రీవారి సేవకునిగా పేరు నమోదు చేసుకోవాలని ప్రయత్నించగా ఖాళీలు లేవని తెలిసి ఊరుకొన్నాడు. ఇలాకాలం జరిగిపోతున్న తరుణంలో నా కుమారుని మిత్రుడు ఒకరు ఫోను చేసి 'పరకామణిసేవ' కొఱకువారి గ్రూపులో ఒక ఖాళీ ఉంది, రాదల్చుకొంటే వివరాలు ఇవ్వమని తెలుపగా, నా కుమారునికి పరకామణి సేవకు రమ్మనమని ఆన్‌లైన్ ద్వారా మెసేజి పంపారు.

మా కుటుంబమంతా అతనితో బాటు దర్శనం టిక్కెట్లు పొంది, అందరం స్వామి దర్శనం చేసుకొన్నాము. 'ఆత్మావై పుత్రనామసి' అంటారు కదా! తండ్రిగా స్వామి సేవకు వయసు రీత్యా నేను అనర్హుడైనా, నా కుమారుని చేత సేవకు పిలిపించు కొని, ఆ సేవ నేను చేసినట్లుగానే భావింపచేసిన శ్రీవేంకటేశ్వర స్వామి భక్తుల మనోవేదనను గ్రహించి, ఈ చిన్నకోరికను కూడా ఎంత సులభంగా తీర్చావు తండ్రీ! నీవు భక్తసులభుడవు గదా! అని మనస్సంతా కోరిక తీరిన ఆనందంతో నిండిపోయింది.

*ఓం నమో వేంకటేశాయ!!*

108 దివ్యదేశాలు

# తిరుక్కరంబనూర్ (ఉత్తమర్ కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

భగవంతుడు పర-వ్యూహ-విభవ-అంతర్యామి-అర్చా అను ఐదురూపములతో దివ్యక్షేత్రములయందు విరాజిల్లుతూ విశేషముగా అర్చామూర్తిగా సకలజనులను అనుగ్రహిస్తున్నాడు. ఆళ్వారుల చేత కొనియాడబడిన దివ్యక్షేత్రాలలో మూడవ దివ్య క్షేత్రముగా దేదీప్యమానముగా ప్రకాశిస్తున్న క్షేత్రం శ్రీరంగ పరిసరంలో ఉన్న **'తిరుక్కరంబనూర్'** అను దివ్యదేశం.

## తిరుక్కరంబనూర్ దివ్యక్షేత్ర పరిచయం

ఈ స్థలం తిరుచ్చికి ఉత్తరం వైపు సుమారు 5 కిలో మీటర్ల దూరంలో అద్భుతమైన ప్రకృతి రమణీయతతో నెలవై ఉన్నది. ఈ దివ్యదేశానికి **'ఉత్తమర్ కోయిల్'** అని ప్రసిద్ధి. ఈ క్షేత్రం- ***'ఆదిమాపురం, కదంబవనం, పిచ్చాండార్ కోయిల్, నీభక్షేత్రం'*** అని అనేక నామధేయములతో విరాజిల్లుతున్నది.

## నామసార్థక్యము

ఈ క్షేత్రమునకు తిరుక్కరంబనూర్ అను పేరు సార్థక నామధేయము. ఎందుకంటే ఈ క్షేత్రములో కదంబవృక్షములు చాలా ఉన్నందున దీనికి కదంబనూర్ అని, అదే కాలక్రమంలో కరంబనూర్ అయ్యింది. కదంబమహర్షి తపస్సుకి మెచ్చిన నారాయణుడు ఈ క్షేత్రములోనే సాక్షాత్కరించడం చేత ఈ క్షేత్రమునకు కరంబనూర్ అను పేరూ సార్థకమైనది.

## స్థలపురాణం

ఇది త్రిమూర్తిక్షేత్రంగాను వెలుగొందుతున్నది. పత్నీ సమేతమైన హరి-హర-బ్రహ్మాదుల ఆలయములు ఇక్కడ గలవు, విశేషముగా పరమేశ్వరుడు **'పిచ్చాండార్'** అను పేరుతో పార్వతీ సమేతుడై విరాజిల్లుతున్నాడు, చతుర్ముఖబ్రహ్మ సరస్వతీసమేతుడై శోభిల్లుచున్నాడు, నారాయణుడు **'పురుషోత్తమన్'** అను పేరుతో **'పూర్ణవల్లీనాయికా'** అను పేరుగల లక్ష్మీసమేతుడై భక్తులను అను గ్రహిస్తున్నాడు. హర-బ్రహ్మాదులు ఈ క్షేత్రమునందే పురు షోత్తముడైన నారాయణుని అనుగ్రహాన్ని పొందినట్టుగా ఇక్కడి స్థలపురాణంద్వారా తెలుస్తున్నది. ఈ ఉత్తమర్ కోయిల్ ఆలయాన్ని జనకమహారాజు నిర్మించినట్లు తెలుస్తోంది.

## పూర్ణవల్లీనాయికా

పూర్వము చతుర్ముఖబ్రహ్మకు పంచముఖములు ఉండేవి. ఒకనాడు పరమేశ్వరుడు అహంకారముతో గర్వించిన ఆ ఐదవశిరస్సుని చూసి కోపోద్రిక్తుడై తన చేతులతో ఆ శిరస్సుని గిల్లి ఖండించాడు, తద్వారా బ్రహ్మకు గర్వభంగము జరిగింది. కానీ బ్రహ్మశిరస్సుని ఖండించడం వలన ఆ పరమే శ్వరునికి బ్రహ్మహత్యాపాతకము చుట్టుకుంది. అలాగే బ్రహ్మ కపాలము శివుని కరము(చేతి)నందే ఉండిపోయింది. 'ఈ దోషమునకు ప్రాయశ్చిత్తముగా ఏ క్షేత్రమునందు నీ కరములయందు నున్న కపాలము అన్నముతో నిండునో అచట ఈ బ్రహ్మహత్యా పాతకము నశించగలదు' అన్న అశరీరవాక్కుని విన్న పరమ శివుడు కపాలకరముతో అన్ని క్షేత్రములను సంచరిస్తూ, ఈ దివ్యక్షేత్రమైన తిరుక్కరంబనూర్ క్షేత్రమును సమీపిస్తుండగా, నారాయణుడు పరమశివుని బ్రహ్మహత్యాపాతకమును నివా రించుటకు సంకల్పించి పూర్ణవల్లీనాయికా రూపమునున్న లక్ష్మీ దేవిని అనుగ్రహించమని ఆదేశించాడు, నారాయణుని ఆదేశాను సారము, జగన్మాతయైన పూర్ణవల్లీనాయికాస్వరూపిణియైన





లక్ష్మీదేవి ఈ దివ్యక్షేత్రమునకు వచ్చిన పిచ్చాండార్ అనగా శివుని కరగతకపాలమునందు అన్నమును ప్రసాదించగా అచ్చటనే ఆ బ్రహ్మహత్యాదోషము నివారణజరిగింది. ఆనాటి నుండి లక్ష్మీదేవి తన దర్శనార్థము వచ్చు భక్తులమనోరథములను పూర్ణము చేస్తూ పూర్ణవల్లీనాయికగా ఈక్షేత్రమునందు ప్రసిద్ధి గాంచినది. లక్ష్మీనారాయణుల ఆదేశానుసారము, గర్వభంగమైన పిదప చతుర్ముఖబ్రహ్మ సరస్వతీసమేతుడై ఇచట నారాయణుని సేవించి ఇచటనే శిలారూపమున వెలసియున్నాడు. అలాగే లయకారకుడైన శివుడు ఈ క్షేత్రమునకు భిక్షకై వచ్చినందున పిచ్చాండార్ అను పేరుతో పార్వతీసమేతుడై ఇక్కడనే నెల కొన్నాడు. ఇక సర్వోత్తముడైన నారాయణుడు పురుషోత్తమన్ అను పేరుతో పూర్ణవల్లీనాయికా సమేతుడై భక్తుల మనోరథము లను పూర్ణము చేయుచున్నాడు. ఇది ఈ క్షేత్రమహిమ.

## కదంబతీర్థావిర్భావము

బ్రహ్మహత్యవంటి మహాపాతకమును కూడా తొలగించే మహిమాన్వితమైన ఈ క్షేత్రమును సందర్శించవలెనన్న ఉత్సు కతతో ఒకనాడు చతుర్ముఖబ్రహ్మ ఈ క్షేత్రమును వేంచేసి, అచట నారాయణుని కానక, చింతాక్రాంతుడై యుండగా ఈ క్షేత్రము నందు ఒక కదంబవృక్షమును గాంచి, నారాయణుడు సర్వాంత ర్యామి అని ఎరిగి ఆ వృక్షమునందున్న పుష్పములో అంతర్యామి స్వరూపియైన నారాయణుని ఆరాధిస్తూ, తన కమండలంలోని జలములతో ఆ వృక్షాన్ని అభిషేకించగా, ఆ అభిషేకజలం ద్వారా ఆవిర్భవించిన తీర్థమే ఈ **'కదంబతీర్థము'**. తదనంతరం బ్రహ్మకు నారాయణసాక్షాత్కారము జరిగినట్లు స్థలపురాణము తెలుపు తున్నది. కాబట్టి సాక్షాత్ బ్రహ్మచేత అభిషేకించిన పవిత్రజలము ఈ తీర్థమునందు ఉన్నందున ఈ తీర్థస్నానము సకలపాప హరణము అనుటలో ఎటువంటి సందేహమూ లేదు.

## తిరుమంగైఆళ్వారుల ఆగమనం

ఆళ్వారులలో చిట్టచివరి ఆళ్వారులు తిరుమంగై ఆళ్వారులు. వీరు ఈ క్షేత్రమును సందర్శించి ఇచటయున్న పురుషోత్తమన్ పెరుమాళ్ళను సాక్షాత్ శ్రీరంగనాథునిగా భావించి మంగళాశాసనములు చేసిరి.

పేరానై కురుఙ్గుడి యెమ్బెరుమానై తిరుత్తణ్గాల్
ఊరానై క్కరమ్బనూరుత్తమనై ముత్తిలంగు
కారార్ తిణ్ కడలేళుమ్ మలై యేళుయువ్వులగే యుణ్డుమ్
ఆరాదెన్నిరున్దానై క్కణ్డదు తెన్నరంగత్తే

(తిరుమంగై ఆళ్వార్ పె.తి. మొ 5-6-2)



ఈ విధముగా తిరుమంగై ఆళ్వారులు స్వామిని స్తుతించి అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందారు.

## పురుషోత్తమన్ పెరుమాళ్ మూర్తి

ఈ క్షేత్రములో పురుషోత్తమన్ పెరుమాళ్ తూర్పుదిక్కున చూస్తూ పవళించి యున్నటువంటి మూర్తిని గాంచవచ్చు. ఇది చూచుటకు రంగనాథస్వామి వలే యుండును, ఆలయంలో స్వామివారికి దక్షిణమున పూర్ణవల్లీ తాయార్ దర్శనమిస్తారు. ఈ క్షేత్రము మహాగురుస్థానముగా కూడా విరాజిల్లుతున్నది.

సంగ్రహంగా ఈక్షేత్రవైభవాన్ని చెప్పుకొంటే- పురు షోత్తమ పెరుమాళ్-పూర్ణవల్లీతాయార్- కదంబతీర్థము-ఉద్యోగ విమానము- తూర్పు ముఖము- భుజంగశయనము, స్థల వృక్షము అరటిచెట్టు, సనకసనందాదులకు, కదంబమహర్షికి, ఉపరిచర వసుమహారాజునకు, ప్రత్యక్షము తిరుమంగైయాళ్వార్ కీర్తించినది. ఈ క్షేత్రమహిమను పెద్దలు ఇలా కీర్తించారు.

రంభా వృక్షయుతే కదంబ నగరే కాదంబ తీర్థాంచితే
పూర్వాభ్యాప్రియయా భుజంగశయనో హ్యుద్యోగవైమానగః
ధ్యాతశ్శ్రీస్సనకాది యోగి కలిజిత్ కాదంబ వస్వాదిభిః
ప్రాగాస్యః పురుషోత్తమో విజయతే కీర్త్యః కలిద్వేషిభిః

ఇటువంటి పరమపవిత్రమైన క్షేత్రమును సకలమాన వాళి సందర్శించి, పూర్ణవల్లీనాయికా సమేతుడైన ఆ పురుషో త్తమన్ పెరుమాళ్ అనుగ్రహాన్ని పొంది తరించగలదు.

లోకాః సమస్తాః సుఖినో భవంతు

# ఆయుర్వేదం

# వ్యర్థపదార్థాలూ ఔషధాలే!

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

మానవజాతి ఆవిర్భావం నుంచి మొక్కలు మానవాళికి మహోపకారం చేస్తూనే ఉన్నాయి. మొక్కలు పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత కాపాడటమే గాక జీవ జాతుల మనుగడకు కారణభూతమవుతున్నాయి.

ఆరోగ్య విషయానికొస్తే విశ్వంలో ఔషధంగా ఉపయోగ పడని పదార్థమంటూ లేదంటే అతిశయోక్తి కాదు. ఎన్నో కారణాల వల్ల మన చుట్టూ ఉండే నానా పదార్థాలను సద్విని యోగ పరచుకోలేక వ్యర్థపదార్థాలుగా వదిలేస్తున్నాం. అవి ఆరోగ్య సంరక్షణకు ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో చూద్దాం...

## చింత గింజలు :



**తేలు కాటుకు:** చింతగింజలను నీటితో నూరి తీసిన చిక్కటి గంధాన్ని లేపనం చేస్తే తేలు కాటు వల్ల కలిగే మంట, పోటు, నొప్పి, బాధ, సలుపు లాంటి లక్షణాలు తగ్గిపోతాయి.

**తెల్లబట్ట మరియు ఎర్రబట్టకు :** రోజూ రెండు పూటలా పూటకు అర టీ స్పూను చింతగింజల పొడి 100 మి.లీ. బియ్యపు కడుగు నీటిలో కలిపి సేవిస్తే స్త్రీసంబంధించిత తెల్లబట్ట వ్యాధిగా పిలువబడే శ్వేతప్రదరం, ఎర్రబట్ట వ్యాధిగా పిలువబడే రక్తప్రదరం తగ్గిపోతాయి.

**గమనిక :** చింతగింజలను వేయించి ఒక రోజంతా నీటిలో నాన్చి పిసికితే పై తోలు ఊడిపోతుంది. లోపలి పప్పును బాగా ఎండించి మరలా దోరగా వేయించి పొడి చేసుకోవాలి. చింతగింజల పొడి ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో కూడ దొరుకుతుంది.

**మోకాళ్ళ నొప్పులకు:** రోజూ 2 సార్లు పూటకు 50 మి.లీ. పాలు, 50 మి.లీ. నీళ్ళు, అర టీస్పూను చింతగింజల పొడి, అర టీ స్పూను పంచదార లేదా తాటికలకండ కలిపి కొద్దిసేపు మరిగించి పాయసంలా ఉంచి చల్లార్చి సేవిస్తూ ఉంటే మోకాళ్ళ అరుగుదల వచ్చే నొప్పుల నుంచి పరిష్కారం దొరుకుతుంది.

## పుచ్చకాయ గింజలు :



**కిడ్నీ స్టోన్స్ తగ్గేందుకు:** పుచ్చకాయ గింజలను ఎండించి చేసిన చూర్ణాన్ని రోజూ మూడుపూటలూ పూటకు 2-3 గ్రాముల వంతున తీసుకొని 100 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తే మూత్ర వ్యవస్థలోని రాళ్ళు కరిగిపోతాయి.

## నిమ్మ తొక్కలు-నిమ్మ గింజలు :

**ముఖం కాంతివంతంగా అయ్యేందుకు:** నిమ్మతొక్కలను బాగా ఎండించి, చూర్ణించి, జల్లించి ఉంచుకొని తగినంత పొడిలో తగినంత పాలు కలిపి పేస్టులా చేసి ముఖంపై రాసుకొని చేసి గంట తర్వాత కడిగితే ముఖంపై మొటిమలు, గుల్లలు, మచ్చలు తగ్గుముఖం పట్టి ముఖం కోమలంగా, తేజోవంతంగా తయారవుతుంది.

**పంటి మీద గార తొలిగేందుకు:** 25 గ్రాముల ఎండిన నిమ్మ తొక్కల పొడి, 100 గ్రాముల వంట సోడ, 100 గ్రాముల ఉప్పు కలిపి ఉంచుకొని రోజూ ఒకసారి దంతధావన చూర్ణంగా వాడుతూ ఉంటే త్వరగా సమస్య తగ్గిపోతుంది.

**చర్మ వ్యాధులకు:** ఎండిన నిమ్మ తొక్కలను కాల్చి బూడిద చేసి చల్లార్చి, జల్లించి ఉంచుకొని రోజూ ఒకసారి తగినంత బూడిదలో తగినంత కొబ్బరినూనె కలిపి పై పూత మందుగా లేపనం చేస్తే గజ్జి, తామర, దురద, చిడుము లాంటి చర్మ వ్యాధులు తగ్గిపోతాయి.



**పేనుకొరుకుడు:** ఎండిన నిమ్మగింజల చూర్ణం 15 గ్రాములు, మిరియాల పొడి 15 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు ఒకసారి తగినంత పొడిలో తగినంత నీరు చేర్చి నూరి పేస్టులా చేసి పట్టిస్తూండాలి.

## దానిమ్మ పెచ్చులు :

**రక్త, బంక విరేచనాలు తగ్గేందుకు:** రోజూ రెండు లేదా మూడుసార్లు పూటకు 200 మి.లీ. నీటిలో 5 గ్రాముల ఎండిన దానిమ్మ పెచ్చుల చూర్ణం వేసి 100 మి.లీ. నీళ్లు మిగిలేలా మరిగించి, చల్లార్చి, వడగట్టి తగినంత పంచదార కలిపి సేవిస్తూండాలి.

**కడుపు ఉబ్బరానికి:** ఎండిన దానిమ్మ పెచ్చుల చూర్ణం 50 గ్రాములు, ఎండిన పుదీనాకుల చూర్ణం 25 గ్రాములు, సైంధవలవణ చూర్ణం 25 గ్రాములు కలిపి ఉంచు కొని రోజూ రెండుపూటలా ఆహారం తర్వాత పూటకు 2, 3 గ్రాముల పొడిని 100 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తూంటే కడుపుబ్బరం తగ్గడమే కాక, జీర్ణరసాలు బాగా ఉత్పత్తి అయ్యి ఆకలి బాగా అవుతుంది. జీర్ణశక్తి వృద్ధి అవుతుంది.



**దంత, చిగుళ్ళ సమస్యలకు:** 100 గ్రాముల ఎండు దానిమ్మ పెచ్చుల చూర్ణంలో 25 గ్రాముల చొప్పున మిరియాల పొడి, ఉప్పు కలిపి ఉంచుకొని రోజుకు ఒకసారి దంతధావన చూర్ణంగా ఉపయోగిస్తే చిగుళ్ల నుంచి చీము, రక్తం రావడం తగ్గి దంతాలు ఆరోగ్యంగా, పటిష్ఠంగా, దృఢంగా ఉంటాయి.

## మొక్కజొన్న పీచు :



**మూత్రవ్యవస్థలోని రాళ్ళ సమస్యకు:** రోజూ 2 సార్లు పూటకు 200 మి.లీ. నీటిలో మొక్కజొన్న పొత్తులోని పీచును 5-10 గ్రాములు కత్తిరించి వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి త్రాగితే మూత్రవ్యవస్థలోని రాళ్ళు కరిగిపోతాయి. అంతేకాకుండా రోజూ ఒకసారి ఈ ఔషధాన్ని సేవిస్తుంటే గర్భిణుల్లో వచ్చే కాళ్ళ వాపులు తగ్గిపోతాయి.

మే, 2022

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**– దూరప్రయాణాలు కలసివస్తాయి. మంచి వారితో స్నేహం, ఆరోగ్యం, అలంకారవస్తువుల ప్రాప్తి. మీ వాగ్ధాటితో కార్యజయం పొందుతారు. పిల్లలచదువుల గురించి సమయం వెచ్చిస్తారు. పంటలు కలసివస్తాయి. చేతికి డబ్బు వస్తుంది.



**వృషభం** – ధనధాన్యబంధు మిత్రలాభం, గృహమున శుభకార్యాలు చేస్తారు. ఆర్థికఇబ్బందులు తొలగి, ఆదాయం సమకూరుతుంది. రచనా వ్యాసంగాల్లో చురుకుగా పాల్గొంటారు.



**మిథునం**– మీ బంధుమిత్రులతో సంయమనము, సహనం పాటిస్తే అన్నింటినీ అధిగమిస్తారు. ఆకస్మిక ధనలాభం. గౌరవమర్యాదలు పెరుగుతాయి. సుఖమయజీవనం. బంధువుల ఇంటిలో శుభకార్యంలో పాల్గొంటారు.



**కర్కాటకం**– అలంకార వస్తుప్రాప్తి, ఉద్యోగప్రాప్తి కల్గుతుంది. ఇతరులు మాట సహాయం చేస్తారు. ధనము నిల్వచేయుట, గృహమున ఆనందకరమైన వాతావరణం, వృత్తి సంబంధ పనులలో రాణిస్తారు. పైఅధికారులు మిమ్ములను గుర్తించి ఆదరిస్తారు.



**సింహం**– వృత్తివ్యాపారాలలో సామాన్యలాభములు కల్గుతుంది. అష్టమకుజదోష ప్రభావంవల్ల కల్గిన అనారోగ్యంపోవుటకు సుబ్రహ్మణ్య అభిషేకం చేయుట మంచిది. రాజకీయనాయకులకు ఆకస్మికంగా పదవి లభిస్తుంది. ప్రజాదరణను పెంచుకుంటారు.



**కన్య**– రైతులకు అధికదిగుబడులు కల్గుతుంది. వృత్తివ్యాపారంలో జాగ్రత్తవహించి లాభార్జన చేస్తారు. అధికారులు రాణిస్తారు. ఇతరులకు తమవంతు సాయం చేస్తారు. మీరు చేసే మంచి పనులకు గురుబలం మీకు తోడవుతుంది.



**తుల**– వేళదాటి భుజించుట వల్ల అజీర్ణం, ఉదర సంబంధ అనారోగ్యాలు కల్గుతాయి. వ్యాపారస్తులకు మాసద్వితీయార్థంలో అధికలాభాలు కల్గుతాయి. విద్యార్థులకు ఉత్తీర్ణత కల్గుతుంది.



**వృశ్చికం**– గ్రహస్థితి మిశ్రమంగా ఉంటుంది. వ్యాకులత పోగొట్టుకుని మనోనిబ్బరంగా ఉండండి. వేళనతిక్రమించి భుజించుట తగదు. సంతానం అభివృద్ధిలోనికి వస్తుంది. ఇతరులు మీ మాటకు మంచి విలువనిస్తారు. అందరి ప్రశంసలు పొందుతారు.



**ధనుస్సు**– ఉద్యోగములలో ఇబ్బందులు కల్గుతుంది. తగుజాగ్రత్త వహించండి. ధనధాన్యవృద్ధి, ధనం నిల్వలో ఉంటుంది. కష్టార్జితము నిలుస్తుంది. విద్యార్థులు చదువులో అనూహ్యంగా రాణిస్తారు. ఇతరదేశ చదువులు, దూరప్రయాణాలు కలసి వస్తాయి.



**మకరం**– గృహవాతావరణము అనుకూలము. శుభకార్యాలు చేస్తారు. ఆరోగ్యగ్రహస్థితి సామాన్యము, ధైర్యంతో చేసే ప్రతీ పని మీకు కలసి వస్తుంది. కార్యజయం కలుగుతుంది.



**కుంభం**– మనస్సున సంకటములు తొలగి శరీరారోగ్యము బాగుండును. కోర్కెలు ఫలిస్తాయి. దానధర్మాలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు. బంధుమిత్రులతో సంతోషము, సన్మిత్రలాభములు కల్గును. ధనలాభం మిమ్ములను వరిస్తుంది.



**మీనం**– శుభకార్యపరంపర మొదలవుతుంది. గృహమున మంగళతోరణములు బంధుమిత్ర సమాగమము, శుభవ్యయం, మిత్రుల ప్రశంసలు మీరు చేసే ప్రతీ పని కలసి వస్తుంది. ఆరోగ్యవిషయంలో స్వస్థత కల్గుతుంది.

పాఠం-15

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| युष्मत् | = మీ, మీవల్ల | किन्तु | = కాని | अस्मत् | = మా మావల్ల |
| तर्हि; चेत् | = అయితే | गृहम् | = ఇల్లు, ఇంటిని | तूष्णीम् | = ఊరక |
| कुर्वन्तु | = చేయుదురుగాక | कुरुत | = చేయుడు | करवाम | = చేయుదుముగాక, చేయనీయుఁడు |

**అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?**

01) तत्र किमर्थम् आसीः?
02) अहं तूष्णीम् आसम्।
03) तर्हि त्वं पाकं कुरु।
04) नोचेत् वयं करवाम।
05) चेत्किम्?
06) अस्मद्गृहे शाकानि न सन्ति।
07) ते कुत्र सन्ति वा खलु?
08) ते युष्मद्गृहे भोजनं कुर्वन्ति।
09) कुर्वन्ति चेत् कुर्वन्तु।
10) यूयं तूष्णीं स्त।

**అ) జవాబులు**

01) అక్కడ ఎందుకు ఉంటివి?
02) నేను ఊరక ఉంటిని.
03) అయితే నీవు వంట చేయుము.
04) లేనిచో మేము చేయుదుము.
05) అయితే ఏమిటి?
06) మా ఇంటిలో కూరలు లేవు.
07) వారు ఎక్కడనున్నారో ఏమిటో?
08) వారు మీఇంటిలో భోజనము చేయుచున్నారు.
09) చేస్తే చేయుదురు గాక!
10) మీరు ఊరక ఉండుడు.

**ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?**

01) మీ యింట్లో ఎవ రున్నారు?
02) మా యింట్లో అందఱు పిల్లలు స్నానము చేయుచున్నారు.
03) వారు వంట చేయుదురుగాక.
04) నేను వంట చేసినాను.
05) అయ్యో మీ రక్కడ నూరకయే యుంటిరా?
06) కొంచెము వంట చేయుడు.
07) నేను మొదట పలువిధములుగా చేసినాను.
08) కాని వారు మా యింట్లో లేరు.
09) మీ రిపుడు స్నానము చేయకుఁడు.
10) మొదట మేము స్నానము చేయనీయుఁడు.


**ఆ) జవాబులు**


01) युष्मद्गृहे के सन्ति?
02) अस्मद्गृहे सर्वे बालकाः स्नानं कुर्वन्ति।
03) ते पाकं कुर्वन्तु।
04) अहं पाकम् अकरवम्।
05) अहो! यूयं तत्र तूष्णीम् आस्त किम्?
06) किञ्चित् पाकं कुरुत।
07) अहम् आदौ अनेकधा अकरवम्।
08) किन्तु ते अस्मद्गृहे न सन्ति।
09) यूयम् इदानीं स्नानं न कुरुत।
10) आदौ वयं स्नानं करवाम।

చిత్ర కథ

# హనుమంతుని భక్తి


కథ– శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు– శ్రీ కె.ద్వారకనాథ్






లోకాః సమస్తాః సుఖినో భవన్తు

విశ్వదాభిరామం                వేమన పద్యసూక్తి



# చిత్తశుద్ధి - పుణ్యకర్మ

చిత్తశుద్ధి గలిగి చేసినపుణ్యంబు
కొంచె మైన, నదియు కొదువ గాదు;
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత?
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** పుణ్యము= సుకృతం; విత్తనము= గింజ; మఱ్ఱి= ఊడలు దిగే పెద్దచెట్టు.

**భావం:** చిత్తశుద్ధితో చేసినపుణ్యం కొంచెమైనా అది తక్కువేం కాదు. చిన్నదిగానే ఉన్నప్పటికీ, మఱ్ఱి విత్తనం మహావృక్షం ఏర్పడుతుంది గదా?

**వివరణ:** చిత్తశుద్ధి అణుశక్తివంటిది. లక్ష్యం ఛేదించడానికి ప్రారంభమయ్యేచోట అది కంటికే కనిపించ నంత సూక్ష్మాతి సూక్ష్మమైనది. లక్ష్యాన్ని ఛేదించే సమయానికి అదెంతో పెద్దదిగా మారుతుంది. అణుబాంబు చిన్నదిగానే ఉంటుంది. అతి దూరంలో ఉన్న మహాపర్వతాన్ని సైతం పిండి పిండిగా చేస్తుంది. అలాగే చిత్తశుద్ధితో చేసిన పుణ్యకర్మ చిన్నదే కావచ్చు. కాని దాని వలన కలిగేఫలితం మాత్రం ఎంతో ఎక్కువగా ఉంటుంది. మఱ్ఱివిత్తనం చాల చిన్నది. కాని దానినుండి పుట్టే మఱ్ఱిచెట్టు మహావృక్షం అవు తుంది కదా! మెప్పుకోసం ఆడంబరంగా గొప్ప కర్మలు చేస్తే ఫలితం ఉండదు. చిన్నపని అయినా, చిత్తశుద్ధితో చేయాలి.

- కే.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# 76 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)భరద్వాజమహర్షి కుమార్తె (5); 6)జనమేజయుని భార్య(2); 7)నాభి భార్య (3); 8)1000 సంఖ్య అక్షరాల్లో (2); 10) ధరణీదక్షుల కుమారిత(2); 11)అనురాగము-లో ఒకపదం(3); 14)ఇదియే హరి ద్వారము(2); 15)ఈ నది ఒడ్డుననే శకుంతలను మేనకా విశ్వామిత్రులు విడిచారు(3); 16)పాము(2); 19)పర్వతం(2); 20)అతిరథుడను సూతుని భార్య(2)

## నిలువు

1)ధాన్యమాలియందు రావణునకు పుట్టిన కుమారుడు(5); 2)ప్రహ్లాదుని భార్య(2); 3)అజామీఢుని తల్లి(4); 4)ఎపుడూ కీచకుడు ఇందులో ఉంటాడు(2); 5)కామ్యక వనములో ద్రౌపది పరిచారిక(4); 9)నదీ రూపం దాల్చిన సూర్యుని కుమార్తె(3); 10)సుశర్మపాలించిన దేశం(3); 12)అజ్ఞాతవాసంలో ద్రౌపది పెట్టుకున్న పేరు(3); 13) ఈ రూపంలో విష్ణువు, దేవతలకు అమృతం పంచాడు(3); 14) వసుదేవుని తల్లి(3); 17)అరిహుని భార్య(2); 18)నందిని మఱదియగు శతగోపుడను వాని పుత్రిక(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



ఎంతఉన్నా చాలదనే బాధను ఎవ్వరూ తీర్చలేరు



బాలనీతి

# వట్టిమాటలు.... కట్టిపెట్టాలి

- శ్రీ జి.సీతారామశాస్త్రి

**శు**చిగా ఉండడం అందరికీ అవసరమే. శరీరాన్నే కాదు మనస్సును, వాక్కును కూడా శుచిగా ఉంచాలి. తైత్తిరీయారణ్యకంలో 'మనోవాక్కాయ కర్మాణి శుద్ధ్యన్తామ్' అని కనిపిస్తుంది. ఇతరుల మనసులను గాయపరుస్తూ, బాధించేలా మాట్లాడకూడదు. అలా చేయడం కూడా హింసే. అందుకే–

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్ర బాంధవాః।
జిహ్వాగ్రే బంధనం ప్రాప్తి జిహ్వాగ్రే మరణం ధ్రువమ్॥

అన్నారు పెద్దలు. మంచిగా మాట్లాడితే సంపదలతో పాటు, మిత్ర బాంధవులు కూడా దగ్గరకు చేరతారు. కర్కశమైన వాక్కు వల్ల కొన్నివేళలో మరణం కూడా సంభవించవచ్చు. అశుద్ధమైన, అశ్లీలమైన వాక్కువల్ల మనిషి ఆత్మశక్తి కోల్పోతాడు.

## ముఖ్యమైన మూడుపనులు


ప్రియమైన వాక్కుల వల్ల సర్వప్రాణులూ ఆనందిస్తాయి. కాబట్టి ప్రియవాక్కులే పలకాలి. సత్యమైనా అప్రియవాక్కులు పనికిరావు. అయినా మంచి మాటలు మాట్లాడడం వల్ల దరిద్రం చుట్టదు కదా! చెడుమాటలు మాట్లాడితే ముందు నోరు, తద్వారా మనసు మైలపడతాయనడంలో సందేహం ఏమైనా ఉందా?! దైవమిచ్చిన వాక్ శక్తిని దుర్వినియోగపరిస్తే అపచారమే సుమా!!

వాక్కుకు శౌచం ఏర్పడాలంటే చేయాల్సినవి... 1)వాక్కుతో దైవనామ స్మరణ చేయడం. 2)హిత, మిత, స్మిత, సత్యవచనాలు పలకడం. 3)భగవంతుని లీలాకథలను చెప్పుకుంటూ వేదాంత విచారణలు చేయడం.

మలినవాక్కులు పలికే నోటికి పవిత్రమైన భగవన్నామం పలికే అర్హత కూడా లేదన్నది శాస్త్రవాక్యం. అసత్యం పలకడం అశౌచమే. అసత్యవాది మాటకు సమాజంలో ప్రామాణికత ఉండదు. వినయంతో సత్యవచనాలు పలకడం వల్ల వాక్కుకు రాణింపు, కార్యసిద్ధి కలుగుతాయి. "సూనృతమైన వాక్కు కామధేనువు లాంటిది. అది కీర్తిని గౌరవాన్ని ఇస్తుంది. శత్రువులను తరిమేస్తుంది. కనుక సత్యవాక్కునే పలకాలి. అబద్ధం చెప్పడం, మాట ఇచ్చి తప్పడం, అశ్లీలంగా మాట్లాడడం, వాక్కు అశౌచం కావడానికి కారణమవుతాయి" అని ఉత్తరరామ చరితంలో భవభూతి పేర్కొన్నాడు.

## ధర్మవర్తన కోసం....

వాక్ శౌచం అంటే దానితో పాటు చెవి, కన్ను, ముక్కు, చేతులు, పాదాల వంటి ఇతర ఇంద్రియాల శౌచం కూడా ముడిపడి ఉంది. అందుకే 'భద్రం కర్ణేభిః' అనే మంత్రంలో కూడా... 'ఓ దేవతలారా! మా చెవులతో మంగళధ్వనులనే వింటాము. మా కన్నులతో మంగళాకారాలను చూచెదము అని కర్ణ, నేత్ర శౌచాలను నిరూపిస్తారు. ఇక మధురమైన వాక్కులు నాలుకకు శౌచాన్ని కలిగిస్తాయని తెలుస్తూనే ఉంది కదా!



అలాగే మన 'చేతులతో' దానధర్మాలు, జపతపాలు చేస్తూండాలి. ఇతరుల వస్తువులు దొంగిలించకుండా, ఇతరులను హింసించకుండా ఉంటే చేతులతో శౌచం పాటించినట్లవుతుంది. 'పాదాలతో' పవిత్ర ప్రదేశాలకు మాత్రమే వెడుతూ, 'చెవుల'తో మంచిమాటలు మాత్రమే వింటుండాలి. వాక్ శౌచంతో పాటు ఇతర ఇంద్రియాల శౌచం కూడా పాటించాలి. దీనివల్ల ధర్మం వర్ధిల్లుతుంది.

*నీతి– ఎల్లప్పుడూ మంచి మాటలే పలకాలి.*

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

### విక్రమాదిత్యుని కొలువులో నవరత్నాలు (కవులు)

01) ధన్వంతరి
02) క్షపణకుడు
03) అమరసింహుడు
04) శంకభట్టు
05) వేతాళభట్టు
06) ఘటకర్పరుడు
07) వరాహమిహిరుడు
08) వరరుచి
09) కాళిదాసు

## పిల్లలూ..జతచేయండి!!

| | | | |
|---|---|---|---|
| 1) | చిదంబరం | అ) | ఉత్తరప్రదేశ్ |
| 2) | శ్రీకాళహస్తి | ఆ) | గుజరాత్ |
| 3) | వారణాసి | ఇ) | మధ్యప్రదేశ్ |
| 4) | సోమనాథ్ | ఈ) | ఆంధ్రప్రదేశ్ |
| 5) | ఉజ్జయిని | ఉ) | తమిళనాడు |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(అ); 4-(ఆ); 5-(ఇ)

## మీకు తెలుసా?



1) 'నారాయణ.... నారాయణ' పదం నిత్యం జపించే ఋషి పేరు?
2) తల్లిదండ్రులను సేవించిన వారిలో శ్రేష్ఠుడు ఎవరు?
3) ఐరావతం ఎవరి వాహనం?
4) 'ఏకదంత' అన్నది ఏ దేవుని నామం?
5) 'గాండీవం' ఏ వీరుని ధనుస్సు?
6) స్వామివారు ధరించే చక్రాయుధం పేరు?

జవాబులు:
1) నారదుడు
2) శ్రవణకుమారుడు
3) ఇంద్రుడు
4) విఘ్నేశ్వరుడు
5) అర్జునుడు
6) సుదర్శనం

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

త మిం ని ల్లి చి వం దై దు లే న

జవాబు:
తల్లిని మించిన
దైవం లేదు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.






02-04-2022న తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన "శుభకృత్" నామ ఉగాది ఆస్థానం, పుష్పప్రదర్శన దృశ్యాలు





2022, ఏప్రిల్ 04 నుండి 06 వరకు తిరుమల ధర్మగిరి శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో జరిగిన శ్రీలక్ష్మీశ్రీనివాస ధన్వంతరి మహాయాగ దృశ్యాలు





స్విమ్స్-టాటా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణాలను పరిశీలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు. వీరితో పాటు తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., స్విమ్ డైరెక్టర్ డా॥ బి.వెంగమ్మ టాటా క్యాన్సర్ ఆసుపత్రి ఇంచార్జ్ డా॥ బి.ఆర్.రమణన్ మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొన్న చిత్రాలు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-04-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

